ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

4 అణాలు
9-5-'56



అర్ధనారీశ్వర

వాగర్థా వివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే.
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ (మహాకవి కాళిదాసు).

—చిత్రకారిణి ! [illegible]

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

సంపుటము 40
సంచిక 36
9-5-56

సచిత్ర వారపత్రిక


Founder : K. NAGESWARA RAO

దుర్ముఖి చైత్ర బహుళ చతుర్దశి బుధవారం



[illegible]

విషయానుక్రమణిక



శ్రీ చింతామణ్ దేశ్‌ముఖ్ రాజీనామా న్యూఢిల్లీలో సంచలనం కలిగించింది. మహారాష్ట్రులు ప్రత్యేకమయిన తెగ అనీ, 'తెగ' సిద్ధాంతం నమ్మి వారు పనిచేస్తారనీ ఈ రాజీనామావల్ల విదితమవుతున్నది. మహారాష్ట్రంలో బొంబాయిని చేర్చకపోవడం దాన్ని తీసుకుపోయి పాకిస్తాన్‌లో చేర్చినంత పని అని వారు భావిస్తున్నారు.

తలకాయల్ని లెక్కపెట్టి నిర్ణయం చేసే 'ప్రజాస్వామ్య' విధానానికి ఈ రాజీనామా విజయపతాకంలాంటిది. బొంబాయిలో మహారాష్ట్రులు అధికసంఖ్యాకులు కనుక బొంబాయిని మహారాష్ట్రంలో చేర్చాలని ఈ వాద సారాంశం.

భారతదేశం ఒకేజాతి అని భ్రమలో ఉన్న కాంగ్రెసు రాష్ట్రపునర్వ్యవస్థీకరణ సంఘం నివేదిక చక్కని గుణపాఠం నేర్పింది. ముస్లిములు విడిపోయి పాకిస్తాన్ ఏర్పరచుకోవడం దేశానికి మొదటి దెబ్బ. పునర్వ్యవస్థీకరణసంఘం నివేదిక ఏకజాతి భ్రాంతికి మరొక దెబ్బ తీసింది. భారతదేశమనేది లేనట్టు, భారతజాతి అనేది లేనట్టు, భారతజాతీయైక్యభావం, సుస్థిరత కేవల భ్రాంతులైనట్లు వ్యక్తులు వ్యవహరించారు. ఢిల్లీప్రజలొక్కరే ఏకజాతీయభావం కలిగినవారనో లేక అనాగరికప్రజలనో అనిపిసుంది. 'ఢిల్లీప్రజలు స్వార్థలాభంకోసం ఢిల్లీవచ్చి స్థిరపడిన కాంగ్రెసు నాయకుల చేతనే పరిపాలింపబడుతూవచ్చారు. ఢిల్లీ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా పనిచేసిన డా॥ శే॥ శంకర్‌లాల్, దేశబంధుగుప్త ఢిల్లీకి ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చినవారు. అలాటివారే కిద్వాయ్, యదుబీర్ సింగ్, సుశీలా నయ్యర్, గురుముఖ్ నిహాల్ సింగ్ మున్నగువారు. ఇప్పటి ఢిల్లీ కాంగ్రెసు అధ్యక్షురాలు శ్రీమతి సుభద్రా జోషీ పంజాబీ.

పునర్వ్యవస్థీకరణబిల్లువలన హోదా, పలుకుబడి కోల్పోయేది ఈ బాపతు వ్యక్తులు. అందుచేత బిల్లును వీరు వ్యతిరేకించడం సహజం. ప్రధానమంత్రి జన్మతః ప్రజాస్వామ్యవాది గనుక పాలకవర్గంకూడ ప్రజాస్వామ్య గీతాలు పాడడం నేర్చుకుంది. బర్క్ ఒకచోట ఇలా వ్రాశాడు: "పొలంలో ఒక డజను గొల్లభామలు అర్థంలేని శబ్దాలు చేస్తూఉంటాయి. కాని వేలాది ఆవులు, గేదెలు చెట్ల నీడలలో పడుకుని గడ్డి నెమరేస్తూ ఉంటాయి. అంతమాత్రాన రణగొణ ధ్వని చేసే గొల్లభామలే పొలంలో ఉన్నాయనీ, ఇంకేమీ లేవనీ భావించరాదు." ఇది ఢిల్లీకి కూడా వర్తిస్తుంది. ఢిల్లీలో వేలాదిగోవుల్లాంటి ప్రజలున్నారు. వీరికి ఒక డజను గొల్లభాముల్లాంటి నాయకులు చేసే గోల ఏమాత్రం పట్టదు. బర్క్ చెప్పిన మరొక మాట–"ఒకసారి అధికారం రుచిచూసి,దాని

శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

లాభాలు పొందిన వ్యక్తి అధికారాన్ని చేజేతులా ఎన్నడూ వదులుకోడు." అనే దానిలోని సత్యం ఢిల్లీ ప్రజలకు బాగా తెలుసు.

సర్ చింతామణి దేశ్‌ముఖ్ వెళ్లిపోవడం న్యూఢిల్లీకి వెలితి అనేమాట కాదనలేను. మొన్నటిదాకా ఆయన వెళ్ళిపోతాననేది ఊహాగానం. ఇప్పుడది దాదాపు నిజం. ఆయన సమర్థుడైన ఆర్థికమంత్రియే గాక, పండితుడు. ఆయన అయిదేళ్ళకిందట ఈ పదవిలోకి వచ్చేసరికి భారతదేశానికి ఎక్కడా అప్పు పుట్టేదికాదు. ఈ రోజున భారతీయ రూపాయి 'ఆసియా డాలర్'గా చలామణీ అవుతోంది.

* * *

అంచనాల సంఘాన్ని గూర్చి, దాని విధులను గూర్చి, రైల్వేల విషయంలో దాని సలహాలను గూర్చి నేను వ్రాసిన వ్యాఖ్యలను (ఆంధ్ర వారపత్రిక 14-3-56 సంచిక) అధికారులు గుర్తించారు. అంచనాల సంఘం "రైల్వే లాబీ"గా వ్యవహరిస్తోందనే దానికి వారు కించపడుతున్నారని తెలుస్తోంది. రాజ్యాంగరీత్యా, ఈ సంఘం ప్రభుత్వవిధానాలను గూర్చి ఏవిధా నిర్ణయాలు చెయ్యరాదు. జరిగిపోయిన జమా ఖర్చుల పద్దులను పరిశీలించడానికి ఈ సంఘం ఉద్దేశించబడిందిగాని, ప్రతి శాఖకు విధినిర్వహణకుగాను ఎంతెంత కేటాయింపులో సూచించడానికి కాదు. ఒకవేళ వాదనకోసం అలా సూచించే అధికారం ఉందని ఒప్పుకున్నా, అది రాజ్యాంగరీత్యా ఏర్పడిన సంఘం కనుక రాజ్యాంగ పరిమితిలోనే వ్యవహరించాలి గాని, రాజ్యాంగాన్ని త్రోసిరాజనరాదు. ద్వితీయ పంచవర్షప్రణాళిక ప్రకారం బాధ్యతలను నిర్వహించడానికి రైల్వేశాఖకు ఎంతధనం కేటాయించవలసి ఉందో ఆ సంఘం సూచించినప్పుడు ప్రైమరీ ఉపాధ్యాయుల జీతాలకు సబ్సిడీ ఇచ్చి ప్రజాధనాన్ని వృథా చెయ్యరాదని కూడా ఆ సంఘమే కేంద్రప్రభుత్వానికి చెప్పి ఉండవలసింది. ప్రైమరీ ఉపాధ్యాయుల జీతాల బాధ్యత జిల్లాబోర్డులది. "ప్రభుత్వ వ్యయానికి సూత్రాలు" (కంట్రోలు ఆఫ్ పబ్లిక్ ఎక్స్‌పెండిచర్) అనే పుస్తకంలో లేసిల్ చబ్ ఇలా వ్రాశాడు:

"ఎస్టిమేట్సుకమిటీ అనేదానిలోపార్లమెంటు సభ్యులుంటారు. ఈ సభ్యులు ప్రధానంగా రాజకీయవాదులు, వీరికి వేరే వృత్తులు, వ్యాపకాలు ఉంటాయి అనేది ముందుగ గుర్తించాలి. ఈ కమిటీని మొత్తంగా తీసుకుంటే సభ్యులను నిపుణులుగా పరిగణించడానికి వీలులేదు. ఒకరో,ఇద్దరో నిపుణులై ఉండవచ్చును. కొంచెం శ్రమ, కాలం

★ న్యూఢిల్లీ లేఖ ★

వినియోగిస్తే సభ్యుల్లో ఇంకా ఎక్కువ మందే నిపుణులుగా తయారు కావచ్చును.

కాని ఇంకా ఎక్కువకాలం వినియోగించడమనేది ప్రస్తుత పరిస్థితుల్లో దుస్సాధ్యమౌతున్నది. పార్లమెంటు కమిటీలద్వారానే ఎక్కువ పని కొనసాగిస్తూ ఉంటే ఎక్కువమంది ఇప్పటికంటె ఎక్కువగా నిపుణులుగా తయారయ్యే అవకాశం ఉంటుంది. వివేకవంతులైన వ్యక్తులు నిపుణుల నివేదికను విని, నిర్ణయాలకు వచ్చి, పనిచేయడం అనేక వ్యాపకాల్లో జరుగుతున్నదే.

అయితే పార్లమెంటుసభ్యుల్లో సాధారణంగా ఈ "నిపుణత్వం" అనేది కొరత కావడం పార్లమెంటరీవిధానంలో తప్పని సరిలోపమనే ఒప్పుకోవాలి.

వ్యయాన్ని పరిశీలించడానికి నియోగించబడిన సెలెక్ట్ కమిటీ సక్రమంగా పనిచేయాలంటే ఐదు ముఖ్యమైన షరతులున్నాయి.

1. పార్లమెంటు నిర్దేశించిన విధులను నెరవేర్చడానికి వీలుగా, ప్రతి సెలెక్ట్ కమిటీకి తాను పరిశీలించవలసిన విషయాలేమిటో స్పష్టంగా, ఆచరణయోగ్యంగా నిర్వచించబడి ఉండాలి.

2. సెలెక్ట్ కమిటీకి కావలసిన సమాచారమంతా అందుబాటులో ఉండాలి. కమిటీ సభ్యులు నిపుణులు కారు గనుక నిపుణుల సహాయం, సలహా ఉండాలి. దీనివలన, ఏ విషయాలతో మొదలు పెట్టాలి, ఎటువంటి సమాచారం ఉపయోగపడుతుంది, పరిపాలనానిర్వహణను ఎలా అంచనా కట్టాలి, దర్యాప్తుదారుల హోదా ఏమిటి అనే ప్రశ్నలుత్పన్నమవుతాయి.

3. సెలెక్ట్ కమిటీకి విధినిర్వహణలో తోడ్పడేంత సిబ్బంది ఉండాలి.

4. సెలెక్ట్ కమిటీ సలహాలను గుర్తిస్తారు అని హామీ ఉండాలి. లేకపోతే కమిటీ పడిన శ్రమ అంతా వృథా అవుతుంది.

5. ప్రభుత్వపు పద్దుల కమిటీతో సన్నిహితసంబంధాలుండాలి. లేకపోతే ఆ కమిటీచేసిన పనే ఈ కమిటీ వృథాగా మళ్ళీ చేయడం, ఒక్కొక్కసారి ఘర్షణరావడం తటస్థిస్తుంది.

ఇదివరకటి కమిటీలకు పట్టినగతి, ఇప్పటి అంచనాల సంఘానికి లభించిన విజయం చూస్తే, స్పష్టంగా విధులను, పరిశీలించవలసిన విషయాలను నిర్వచించడం అవసరమనీ, నిర్వచించబడకపోతే సంఘమే తన విధులు నిర్వచించాలనీ తేలుతున్నది.

సెలెక్ట్ కమిటీలు ప్రభుత్వవిధానపు పరిమితులలోనే వ్యవహరించాలి. అలా కానప్పుడు కమిటీలోనే పార్టీలవారీగా సభ్యులు చీలిపోయి, 'ఏం చేసి ఉండవలసింది' అనేదానిమీద దెబ్బలాడుకోవడమో (దీనిమీద పార్లమెంటు అదివరకే ఒక అభిప్రాయం వెల్లడించి ఉండవచ్చును) 'ఏం చెయ్యాలి' అనేదానిమీద తగాలాడడమో (ఇది ప్రభుత్వ అధికార

తంలో జోక్యం చేసుకోవలసి వస్తుంది) జరుగుతుంది. ఈ పరిస్థితులు రాకుండా చేయడానికి 'సెలెక్టు' కమిటీని నియమిస్తారో ఆ పరిస్థితులనే తిరిగి తెచ్చుకున్నట్లవుతుంది. అయితే ఒక చిక్కు వస్తుంది. ఏది ప్రభుత్వ విధానం, ఏది కాదు అనేదాన్ని స్థూలంగా నిర్వచించడం కష్టం. కొన్ని ప్రత్యేక వివాదాలు వచ్చినపుడు సమర్థుడైన అధ్యక్షుడు కొన్ని విషయాలు నిర్వచించగలడు. తగాదాలు ఏవైనా వచ్చినపుడు ప్రభుత్వమే తన విధానాన్ని వ్యక్తం చేస్తుంది. అంగీకారం కుదరనప్పుడు కమిటీలు ఉన్నదున్నట్టు పార్లమెంటుకు నివేదించటం తప్ప మరేమీ చేయలేవు.

ఇక తరువాత, సెలెక్టు కమిటీ ఆర్థికాంశాలనే పరిశీలించవలసి ఉంటుంది. దీనికి చాలా కారణాలున్నాయి. ప్రభుత్వ వ్యయాన్ని వీలైనంత తగ్గించడానికి పార్లమెంటు, ప్రజలుకూడా ప్రయత్నిస్తారు. ప్రతి సెలెక్టు కమిటీ ఇందుకే ప్రయత్నిస్తుంది. ఒక శాఖ ఎలా పనిచేయాలో నిర్దేశించడం కాక, ఎంత తక్కువ వ్యయం చేయడానికి వీలున్నదో మాత్రమే సెలెక్టు కమిటీ పరిశీలించాలి. ఇది రాజ్యాంగ రీత్యా కూడా చాలా సురక్షితమైన పద్ధతి. 1946 సం॥పు అంచనాల సంఘం ఆర్థిక విషయాలపైనే కేంద్రీకరించి, వ్యయాన్ని తగ్గింపజేయడానికే కృషి చేసింది. కనుక అది జయప్రదమైంది. ఈపని రాజ్యాంగ చట్టానికి భంగం లేకుండా, అనగా 'పని ఎలా చెయ్యాలో నిర్ణయించేది మంత్రిగాని తదితరులు కాదు, అందుకు మంత్రికి పూర్తి అధికారం ఉండాలి' అనే సూత్రానికి భంగం రాకుండా సెలెక్టుకమిటీ తన వ్యయ కర్తవ విచారణను కొనసాగించాలి.

రాజ్యాంగం ఏమి నిర్దేశిస్తోందో అంచనాల సంఘం దృష్టికి తీసుకురావడానికే ఇదంతా వ్రాయవలసి వచ్చింది.

అఖిలభారత బేసిక్ విద్యాప్రదర్శనాన్ని రాష్ట్రపతి ప్రారంభించే రోజునే శ్రీ శ్రీమన్నారాయణ్ ఒక రేడియో ప్రసంగం చేయబోతున్నారు. ఆయన ప్రసంగవిషయం "విద్యావ్యాప్తిలో అహింసాయుత విప్లవం." మామూలు పౌరునికి ఒక సందేహం సహజంగా కలుగుతుంది. బేసిక్ విద్య మామూలు పౌరుల పిల్లలకోసమే ఉద్దేశించబడిందా, లేక గొప్పగొప్పవారి పిల్లలకుకూడా అది పనికి వస్తుందా అని. ఈ ప్రశ్నకు సమాధానం కావాలంటే. న్యూఢిల్లీలో ఐరిష్ సోదరులు నడుపుతున్న సెంట్ కొలంబియా హైస్కూల్‌కు వెళ్లి చూడాలి, గొప్ప గొప్ప వాళ్ల పిల్లలను మళ్ళీ ఇంటికి తీసుకువెళ్ళడానికి వేచివున్న మోటారుకార్ల సుందర దృశ్యం అక్కడ కనిపిస్తుంది. ★

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణవలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

6. ధాలియా డ్రమండ్ దొంగ

పోలీసు కమీషనరు బల్లమీద ఉన్న వార్తాపత్రిక నుండి చించిన భాగాన్ని తదేక దీక్షతో చూస్తూ మీసం పట్టుకులాగుతూ, ఆలోచిస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ పార్ ఇదంతా గమనిస్తూ దాని అర్థం తెలిసినట్లు, తనకేమీ పట్టనట్లు ఊరుకున్నాడు.

పార్ పొట్టిగా, బలంగా ఉన్నాడు. అటువంటివాడు పోలీసుశాఖకు ఎలా పనికి వచ్చాడా అని ఆశ్చర్యం కలుగుతుంది. వయస్సు యాభైలోపు ఉంటుంది. ఎర్రని పెద్ద ముఖం. ముఖంమీద ఒక్క ముడత అయినా లేదు. ఆ ముఖం చూస్తే తెలివి తేటలు, సౌకుమార్యం ఏకోశానా కనిపించవు. నిశ్చలమైన గుండ్రని నేత్రాలలో ఏ భావమూ వ్యక్తంకాదు. పెద్ద ముక్కు, బలువైన దవడలు, బట్టతల మొదలైన లక్షణాలతో అతడు అతిసామాన్యంగా ఉంటాడు.

కమీషనరు వార్తాపత్రికలో చించిన భాగాన్ని తీశాడు.

"ఇది విను," అని ఆతురతగా సంబోధిస్తూ, "మార్నింగ్ మానిటర్" పత్రిక సంపాదకీయం చదివాడు. అది చాలా ఘాటుగా ఉన్నది.

"...ఈ దారుణమైన హత్యతో దేశమంతా గగ్గోలెత్తుతున్నది. ఈ ఏడాది ఇలా జరగడం ఇది రెండోసారి. మృతుడు ప్రముఖ వ్యక్తి. అరుణవలయం జరిపిన హత్య వివరాలు ఇక్కడ ఇవ్వడం అనవసరం. అవి మరొక పేజీలో ముద్రించాము. అయితే ఈ హంతకుల ముఠా ఆగడాలను అరికట్టలేక పోతున్న పోలీసుశాఖ నిస్సహాయత్వం చాలా ఆశ్చర్యం కలగజేస్తోందని నిర్మొగమాటంగా, నిష్కర్షగా చెప్పక తప్పదు. ఈ హంతకులను పట్టుకోవడానికి ఏడాదినుండీ ప్రయత్నిస్తున్న ఇన్‌స్పెక్టరు పార్ ఎంతసేపూ 'పట్టుకుంటా' ననే వ్యర్థవాగ్దానం చెయ్యడం తప్పిస్తే ఇంతవరకూ ఏమీ చెయ్యలేదు. పోలీసుశాఖలో బూజు దులిపివేసి, కొత్త సిబ్బందిని వేయడం అవసరమని స్పష్టమవుతున్నది. అందుచేత జాప్యం లేకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలన్నీ తక్షణం తీసుకోగలరని మేము ఆశిస్తున్నాము."

"ఏమంటావు పార్!" అని కమీషనర్ కఠినంగా ప్రశ్నించాడు.

పార్ గడ్డం నిమురుకోవడం తప్ప పెదవి విప్పలేదు.

"పోలీసులకు సకాలంలో హెచ్చరిక అందినా, జేమ్స్ బియర్డ్‌మోర్ హత్య జరగకుండా చెయ్యలేకపోయారు. బియర్డ్‌మోర్ భవనం కనుచూపు మేరలోనే హత్య జరిగింది. హంతకుడు ఇంకా దర్జాగా తిరుగుతూనే ఉన్నాడు. ఇది అరుణవలయం హత్యకేసుల్లో రెండోది. పార్! నన్నడిగితే ఈ పత్రిక రాసిన ప్రకారం చెయ్యడం మంచి దంటాను," అని కమీషనర్ పత్రిక ముక్కను చేతితో సాభిప్రాయంగా తాటిస్తూ అన్నాడు.

"కిందటిసారి హత్యకేసులో డెరిక్ యేల్ హత్యచేసిన వాణ్ణి పట్టుకుని అందరి మెప్పు పొందాడు. యేల్‌ను ఈ మధ్య చూశావా నువ్వు?"

చూశానన్నట్లు తలఊపాడు ఇన్‌స్పెక్టర్ పార్.

"ఏమంటాడు?"

పార్ కొంచెం చిరాకుగా అటూ ఇటూ కదిలాడు.

"ఎవరో నల్లని మనిషిట. వాడికి వళ్ళు తీపు ఉందట. ఇంకా ఏదేదో చెప్పాడు."

"అతని కెట్లా తెలిసింది" కమీషనర్ అడిగాడు.

"మృతుని పక్కన కనిపించిన ఫోటో చూసి. నాకు అతని అలౌకికశక్తుల మీద ఏమీ నమ్మకం లేదు."

కమీషనరు కుర్చీలో వెనక్కు చేరబడి నిట్టూర్పు విడిచాడు.

"మనకి పని కొచ్చేవాటి మీద నీకు నమ్మకం ఉండదు. యేల్‌ను నువ్వు వేళాకోళం చెయ్యనక్కర్లేదు. అతనికి విచిత్రశక్తులున్నాయి. నీకవి అర్థం కానంత మాత్రాన అవి విచిత్రమైనవి కాకపోవు."

పార్‌కి కొంచెం కోపం వచ్చింది. "రివాల్వరు ఫోటో చేతిలోకి తీసుకుని, అది ఎవరిదో, వాడేం ఆలోచిస్తున్నాడో చెప్పగలిగే మనుషులుంటారనా మీ ఉద్దేశం. అర్థంలేని మాట."

"ఎంతమాత్రం కాదు. వస్తువులను చూసి దాని విషయాలు సాకల్యంగా చెప్పగల మనుషులుంటారు. ఈ విద్య శాస్త్రీయంగా అభ్యసించే వారున్నారు. యేల్ అటువంటి వాడు కావచ్చును," అని కమీషనరు సమాధానమిచ్చాడు.

"హత్య జరిగినప్పుడు యేల్ సమీపంలోనే ఉన్నాడు. అయినా హంతకుణ్ణి పట్టుకోలేక పోయాడు," అని పార్ అన్నాడు.

"నువ్వు మాత్రం పట్టుకోగలిగావా?" అని కమీషనర్ ప్రశ్నించాడు. "పన్నెండు నెలల కిందట నువ్వు అరుణవలయాన్ని నేలమట్టి పట్టుకుంటానని నీ ప్లానంతా చెప్పావు. నేను ఒప్పుకున్నాను. నీ ప్లాను బాగా పని చేస్తుందని మన మిద్దరం తప్ప అనుకునే వాళ్ళు లేరు. నువ్వింకెవరైనా పని చేసు కోవడం మంచి దనుకుంటాను. నీ మీద నాకేం కోపం లేదు. కాని ఉన్న విషయం అది."

పార్ కొంతసేపు మౌనం వహించాడు. ఒక్కసారిగా కుర్చీ దగ్గిరగా జరుపుకుని

మీషనరు కూర్చోమనకుండానే కూర్చున్నాడు.

"కర్నల్! మీకు ఒకమాట చెబుతాను వింటారా!" అని ప్రారంభించాడు. ఎప్పుడూ కంగారుపడని పార్ ఇలా అంటాడేమిటా అని కమీషనరు ఆశ్చర్యపడ్డాడు.

"అరుణాచలయాన్ని పట్టుకోవటం కష్టమేమీ కాదు. ఆ ముఠావాళ్లలో ప్రతి ఒక్కణ్ణీ పట్టుకోగలను, మీరు గడువిస్తే. అయితే ఆ చక్రం మధ్య ఉన్న వ్యక్తి కోసమే నేను ప్రయత్నిస్తున్నాను. ఇతన్ని పట్టుకుంటే చక్రం ఆకులు ఓ లెక్క కాదు. కాని మీరు నాకిస్తున్న దానికంటె మరి కొంచెం అధికారమివ్వాలి."

"మరికొంచెం అధికారమా?" అని కమీషనరు ఆశ్చర్యచకితుడయ్యాడు. "నీ ఉద్దేశం?"

"చెబుతాను వినండి" అని తన పథకం వివరంగా చెప్పాడు. కమీషనరు అంతా విని దీర్ఘాలోచనలో పడ్డాడు.

పోలీసు కార్యాలయంనుండి పార్ నగర మధ్యంలో ఉన్న ఆఫీసులోకి వెళ్లాడు.

మూడో అంతస్తులో ఒక చిన్న భాగంలోకి ప్రవేశించాడు. తలుపుమీద డెరిక్ యేల్ పేరు వ్రాసి ఉంది. యేల్ ఉన్నవ కైరుకోసం ఎదురు చూస్తున్నాడు. ఇద్దరినీ ఒక్కసారిగా చూస్తే ఇద్దరికీ ఎంత వ్యత్యాసం వుందో తెలిసిపోతుంది.

యేల్ ఎప్పుడూ ఏదో ఉద్రేకంలో ఉన్నట్లు, ఏదో స్వప్నంలో తిరుగుతున్నట్లు ఉంటాడు. పార్ గంభీరంగా, దృఢంగా, స్వతంత్రంగా ఆలోచించటం చేతకానట్లు ఉంటాడు.

"నీ ఇంటర్వ్యూ ఏమైంది మిస్టర్ పార్!"

"ఏమంత బాగాలేదు పరిస్థితి. కమీషనరుకు నామీద సదభిప్రాయం లేదు. ఏమైనా తెలిసిందా?" అని అడిగాడు పార్.

"పంటితీపుతో బాధపడుతున్నాడన్నా నే, ఆ మనిషిని కనుక్కోగలిగాను," అని యేల్ అన్నాడు. "వాడిపేరు సిడ్లీ. నాపితుడు. బియర్డ్ మోర్ గృహసమీపంలో మర్నాడు కనిపించాడు. నిన్న వాడు తాగి తందనాలాడుతున్నాడని అరెస్టు చేశారు. వాడిదగ్గర ఆటోమాటిక్ పిస్తోలుకూడా కనిపించింది. దాంతోనే వాడు హత్య చేశాడని నా నమ్మకం. బియర్డ్ మోర్ శవంనుంచి తీసిన తూటా ఆటోమాటిక్ దాని తూటా కని నీకు తెలిసిందేగా?"

పార్ విభ్రాంతుడై అలా చూస్తూ ఉండిపోయాడు.

"నీకిదంతా ఎలా తెలిసింది." డెరిక్ యేల్ మెల్లిగా నవ్వాడు.

"నా శాస్త్రంలో నీకంత విశ్వాసం ఉన్నట్లు తోచదు" అని యేల్ కొంటెగా అన్నాడు. "కాని సినాతూటాను చేత లోకి తీసుకున్నప్పుడు, నిన్ను చూడగలిగినంత స్పష్టంగా హంతకుణ్ణి చూడగలనని నేను భావించాను. నామనుష్యుల్లో ఒకణ్ణి ఫోటోగ్రాఫ్ కనుక్కురమ్మని పంపించాను. దాని ఫలితమే ఇది." ఏల్ టెలిగ్రాం తీసి చూపాడు.

పార్ ఆశ్చర్యంతో కనుబొమలు ముడిచాడు.

"అయితే హంతకుణ్ణి పట్టుకున్నారన్న మాట. ఇది రాసింది హంతకుడే నేమో" అంటూ పార్ తన నోటుబుక్కులోంచి ఒక చిన్న కాగితం ముక్క తీశాడు. ఆ ముక్క చివరో కాలిపోయిన గుర్తులు న్నాయి.

యేల్ దాన్ని తీసుకున్నాడు.

"ఎక్కడిదిది నీకు?"

"బియర్డ్ మోర్ గృహంలో నిన్న కనిపించింది" అన్నాడు పార్.

అక్షరాలు పెద్ద పెద్దవిగా ఉన్నాయి. అందులో ఇలా ఉన్నది.

సుమోవ్యక్కడిపి
నె నొక్కణ్ణే
'టి' బ్లాక్ లో
లాభం

"ఏమిటిది? ఏం తెలియటం లేదే" అని యేల్ ఆ ముక్క అంచేతిలో పెట్టుకున్నాడు.

"ఉహూ స్పర్శకుకూడా అందటం లేదు. నిప్పు అంటుకుంటే దాని అసలు స్వభావం మారిపోతుంది."

పార్ ఆ కాగితం ముక్క తీసుకుని మళ్లీ జాగ్రత్తగా నోటు బుక్కులో పెట్టుకున్నాడు.

"ఇంకో విషయం నీతో చెప్పాలి. బియర్డ్ మోర్ భవన సమీపంలో ఉన్న అడవిలో ఎవరో వ్యక్తి ఆసమయంలో దాగి ఉన్నాడు. అతని బూట్లుచివర కొన తేలి ఉన్నాయి. చుట్టలు చాలా కాల్చాడు. చుట్టల బూడిద ఒక చిన్న కన్నంలో కనిపించింది. జోడు గుర్తులు నేలమీద కనిపించాయి" అని చెప్పాడు పార్.

"ఇంటి సమీపంలోనా?" యేల్ అడిగాడు.

పార్ తల ఊపాడు.

"నా అభిప్రాయ మేమంటే, బియర్డ్ మోర్ ను జాగ్రత్తగా ఉండమని హెచ్చరించడానికి ఎవరో వ్యక్తి ఈ ఉత్తరంరాసి, ఆ ఇంటికి చీకటిపడ్డ తర్వాత తీసుకువచ్చాడు. కిమ్సి బియర్డ్ మోర్ ఆ ఉత్తరం చూసి కాల్చివేసి ఉంటాడు. ఈ ఉత్తరం తాలూకు బూడిద నౌకర్లు మామూలుగా నిప్పు ఆర్పివేసే చోట కనబడింది కూడాను" అని ముగించాడు పార్.

తలుపు ఎవరో కొట్టిన చప్పుడైంది.

"జాక్ బియర్డ్ మోర్ అనుకుంటాను" అన్నాడు యేల్.

జాక్ లోపలికి వచ్చాడు. తండ్రి హత్య సంఘటనతో అతడు మానసికంగా చాలా బాధపడుతున్నట్లున్నాడు. జాక్ పార్ ను చూసి కనుబొమ లెగరేసి, యేల్ వైపు నడిచి వచ్చాడు.

"ఏ విశేషాలేమైనా తెలిశాయా పార్! నిన్న మీరు మా ఇంటికి వచ్చారుగదా. ఏమైనా కనబడిందా?"

"చెప్పుకో దగినంతగా ఏమీ లేదు"

"నే నిప్పుడే గ్రాయంట్ దగ్గరికెళ్లి వస్తున్నాను. అతడు పట్నంలోనే ఉన్నాడు. అతనిదగ్గరకు వెళ్లినందువల్ల ఫలితమేమీ లేదనుకోండి. చాలా ఆందోళితుడై ఉన్నాడు గ్రాయంట్" అన్నాడు జాక్.

ఫలితం లేదనటంలో అర్థం ఫాలియాగ్రామండ్ కనిపించలేదని. ఈ అర్థం వారిద్దరిలో ఒక్కడే గ్రహించాడు.

హంతకుడని అనుమానించబడిన వ్యక్తిని అరెస్టుచేసిన సంగతి డెరిక్ యేల్ చెప్పాడు.

"అయితే ఇంతలో మనకు తెలియవచ్చే దేమీ లేదు. నిజంగా వాడు హంతకుడే అయినప్పటికీ వాడు ఏజెంట్ అయి ఉంటాడు తప్ప అసలు వ్యక్తిగురించి ఏమీ తెలుసుకోలేము. వాడు తను చాలా చిక్కుల్లో ఉన్నానని, అరుణాచలయం యొ

గూని తనకు డబ్బిచ్చి హత్య చేయించాడనీ చెబుతాడు. ఈ కథ ఇదివరకు విన్నదే. అసలు వ్యక్తి ఎవరో తెలియనంతవరకూ మనం రహస్యాన్ని ఛేదించలేము."

ముగ్గురూ ఆఫీసునుండి బయటికి వచ్చారు. బయట హాయిగా ఎండకాస్తోంది.

యేల్, పార్ హంతకుడు బంధింపబడి ఉన్న చోటికి వెడుతున్నారు. జాక్ తన తండ్రి ఎస్టేటు వ్యవహారాలు తేల్చుకోవడానికి లాయరు దగ్గిరికి వెడుతున్నాడు. కొంతదూరం డిటెక్టివ్‌లతో కలిసినడిచాడు. జనసమ్మర్దం బాగా ఉన్న ఒక వీధిలో జాక్ హఠాత్తుగా ఆగి "హేయ్" అన్నాడు. రోడ్డు కవతల తాకట్టుపెట్టే షాపు ఉన్నది. ఆ షాపుపక్క ద్వారంలోనుండి ఒక యువతి బయటికి వస్తోంది.

"ఇంకేం, బాగుంది" పార్ తాపీగా అన్నాడు. "ఈమె రెండేళ్ళనించీ కనిపించడంలేదు."

జాక్ చకితుడయ్యాడు.

"రెండేళ్ళనించీ కనిపించడంలా? ఎవరు? ఆ అమ్మాయేనా?"

పార్ అవునన్నాడు.

"అవును. థాలియా డ్రమండ్‌ను గూర్చే నేనన్నది. ఆమె దొంగ. దొంగలతో కలిసి పనిచేసింది!"

7. బుద్ధవిగ్రహం

జాక్ ఈ మాటవిని నిశ్చేష్టుడయ్యాడు. థాలియా డ్రమండ్ వీరిని గమనించినట్టే నడిచిపోయి ఒక టాక్సీని కేకేసి ఎక్కి వెళ్ళిపోయింది.

"ఈ షాపులో ఏంచేస్తోంది ఈ పిల్ల?" అన్నాడు పార్.

"దొంగ! దొంగలతో కలిసి పనిచేసింది!" అని జాక్ పార్ మాటలను పునరుచ్చరించాడు. "ఎంతచిత్రం! ఎక్కడికి వెళ్తారు?" అని అప్పుడే రోడ్డు దాటబోతున్న ఇన్స్పెక్టరును అడిగాడు.

"తాకట్టు షాపులో ఆమె ఏంచేసిందో కనిపెట్టాలి." అన్నాడు పార్.

"బహుశా డబ్బుకోసం వెళ్లి ఉండవచ్చును. డబ్బుకోసం వెళ్ళడంతప్పా?" ఈ మాటలు జాక్ అన్నాడేగాని, తనమాటలమీద తనకే నమ్మకంలేనట్లు హీనస్వరంతో అన్నాడు.

థాలియా డ్రమండ్ దొంగా? అసంభవం! అసత్యం! కాని మారుమాటాడకుండా డిటెక్టివ్‌ను అనుసరించాడు. పార్ షాపు ప్రవేశించాడు. మేనేజరు గదిలోకి వెళ్లాడు. గుమాస్తా ఒకడు థాలియా తెచ్చిన వస్తువు తీసి చూపించాడు. అది బంగారు బుద్ధ విగ్రహం.

"చిత్రంగానే ఉన్నది," అన్నాడు మేనేజరు "ఇది వంద పౌన్లకు తక్కువ ఉండదు. ఆమె పదిపౌనులు మాత్రమే కావాలంది."

"ఆమె ఇంకా ఏమని చెప్పింది?" అన్నాడు ఇంతవరకూ మౌనంగా అన్నీ గమనిస్తున్న యేల్.

"ఆమె డబ్బు కిబ్బందిగా ఉందని, తన తండ్రివద్ద ఈమాదిరి పాత వస్తువులు చాలా ఉన్నాయనీ, మళ్ళీ తీర్చడానికి వీలైనంత సొమ్ము మాత్రమే అప్పు తీసుకుంటాననీ చెప్పి, ఈవిగ్రహం తాకట్టుపెట్టింది," అని వివరించాడు మేనేజరు.

"తన ఎడ్రెసు ఇచ్చిందా? పేరేమని చెప్పింది?" యేల్ అడిగాడు.

"ఆమెపేరు థాలియా డ్రమండ్. పార్క్‌గేట్ ఇరవై తొమ్మిదో నంబరు."

డెరిక్ యేల్ ఆశ్చర్యపడ్డాడు. "అరే అది ఫ్రాయంట్ ఎడ్రెస్ కదూ?"

జాక్‌కి ఆ ఎడ్రెసు హార్వె ఫ్రాయంట్‌దేనని తెలుసు. పాతవస్తువులు కొని సేకరించే అలవాటు ఫ్రాయంట్‌కున్నదని కూడా అతనికి తెలుసు. ఇన్స్పెక్టర్ పార్ షాపువాడికి రసీదిచ్చి ఆవిగ్రహం జేబులో వేసుకున్నాడు.

"పోయి, ఫ్రాయంట్‌ను చూద్దాం," అన్నాడు పార్. జాక్ ఆందోళన పడుతూ అన్నాడు. "మిస్టర్ పార్! మీరు అలాంటిపని ఏమీ చెయ్యకండి. ఆమె చిక్కుల్లో పడుతుంది. ఏదో తెలియక, మరేమీదారి లేక చేసి ఉంటుంది. డబ్బుతో తీరిపోయేట్లయితే నేనంతా సర్దుబాటు చేస్తాను."

జాకునిఅర్థం చేసుకున్నట్లు డెరిక్ యేల్ గంభీరంగా చూశాడు.

"మీకు మిస్ డ్రమండ్ తెలుసా?" జాక్ తల ఊపాడు. అతనికి నోటమాటరానంత నిస్పృహ కలిగింది. ఎక్కడికన్నా పారిపోయి దాక్కోవాలన్నంత పిచ్చి ఆలోచన కలిగింది.

"అదేం కుదరదు," అని పార్ కఠినంగా అన్నాడు. ఇప్పుడు అతడు పోలీసు అధికారి హోదాలో మాట్లాడాడు. "నేను వెంటనే ఫ్రాయంట్ వద్దకువెళ్ళి ఈ వస్తువు అతని అనుమతి మీదనే తాకట్టు పెట్టిందా అని అడుగుతాను."

"అయితే మీరే వెళ్లండి" అని జాక్ కోపంగా అన్నాడు.

తన ప్రేయసి అవమానితురాలు కావడం తన కళ్ళారా చూడడం జాక్ కిష్టంలేదు. పార్ మీద అతనికి అసహ్యంవేసింది. ఆముక్క యేల్‌తో ఒంటరిగా ఉన్నప్పుడు అన్నాడు.

"ఆమె ఇంత నీచంగా ఎప్పుడూ దొంగతనం చేయదు. పార్ తెలివి తేటలు ఏడిసినట్టే ఉన్నాయి. అసలతనికి ఆమెను చూపించి ఉండక పోవల్సింది."

"అతనే చూశాడు ముందు." అంటూ యేల్ జాక్ భుజంపై చెయ్యివేశాడు. "జాక్! నువ్వు కొంచెం ఉద్రేక పడుతున్నావు. మిస్ డ్రమండ్‌మీద నీకెందుకంత ఆసక్తి? అవున్లే. మీఇల్లు ఫ్రాయంట్ ఇంటికి దగ్గిర కదూ! మీకు పరిచయం వుండి ఉంటుంది."

జాక్ అవునన్నట్లు తల ఊపాడు.

"ఈ ఇన్‌స్పెక్టరు ఆ అమ్మాయిని వేటాడానికి చూపిస్తున్నంత శ్రద్ధ అరుణవలయం నేరగాళ్ళను వేటాడానికి చూపించివుంటే మా నాన్నగారు ఈ రోజున బతికే ఉండేవారు." అని కోపం ఆపుకోలేక జాక్ అక్కడను వెళ్ళిపోయాడు.

డెరిక్ యేల్ అతన్ని శాంతపరచడానికి ప్రయత్నించాడు. తన ఆఫీసుకి తీసుకువెళ్ళాడు. కాస్త కులాసాగా కబుర్లు చెప్పాడు. ఒక పావుగంట గడిచింది. టెలిఫోన్ గంట మోగింది. పార్ పిలిచాడు.

"ఏమిటి?" అని యేల్ ప్రశ్నించాడు.

"నేను థాలియా డ్రమండ్‌ను అరెస్టు చేశాను. రేపు ఆమెమీద కేసు పెడుతున్నాను."

యేల్ టెలిఫోను పెట్టేసి, యువకుని కేసి తిరిగాడు.

"ఆమెని అరెస్టుచేశాడు గదూ?" జాక్ ఊహించి అన్నాడు.

యేల్ తల ఊపాడు.

జాక్ ఓయర్డ్‌మోర్ ముఖం పాలిపోయింది.

"జాక్! నువ్వు ఫ్రాయంట్ లాగానే మోసపోయావు. ఆమె దొంగే."

"ఆమె దొంగ కానివ్వండి, హంతకురాలు కానివ్వండి. ఆమెను నేను ప్రేమిస్తున్నాను." అని ఖండితంగా చెప్పాడు జాక్. ★

విధి వైపరీత్యం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

మహాసముద్రం ప్రళయ గంభీర ఘోషంతో భయంకరంగా గర్జించింది. సాగరతరంగాలన్నీ శాత్రవపంక్తిలా ఒక్కసారిగా ఉవ్వెత్తుగా పైకి పొంగి ఒళ్లెరగని క్రోధంతో తరుముకువచ్చే ఆదిశేషువుపడగల్లా ఆవేశంగా బుసకొట్టడం మొదలుపెట్టాయి. సముద్రం ఒక్క ముంపుతో ద్వారకానగరం అంతా ముంచివేసేటట్టు భయంకరంగా పరవళ్ళు తొక్కింది.

అర్జునుడు యాదవులందరినీ రథాల మీద, ఏనుగులమీద, గుర్రాలమీద ఇంకా ఇతర వాహనాలమీద ప్రయాణం చేయించి అతి త్వరితంగా ఇంద్రప్రస్థపురం వైపు తరలించుకు పోతున్నాడు. అతడు ద్వారకానగర ద్వారం దాటగానే సముద్రతరంగాలు ఒక్కుమ్మడిగా నగరం అంతా ముంచెత్తివేశాయి.

ఆ సముద్రతరంగాల ప్రళయ భీకర గర్జితం వినేసరికి అర్జునుని వెనువెంట సురక్షితంగా సాగిపోతున్న ద్వారకానగర పౌరులంతా గొంతులెత్తి హాహాకారాలు చేశారు. అర్జునుని వెంటవెంట హస్త్యశ్వరథాది వాహనాలమీద ప్రయాణం చేస్తున్న శ్రీకృష్ణుని షోడశసహస్రాంతఃపురకాంత లందరు ఒక్కసారి వెనుదిరిగి ఆ భీభత్సదృశ్యం చూచి గుండెలు బాదుకుంటూ గొంతెత్తి విలపించారు. కొందరు స్త్రీ బాల వృద్ధులు తమ తమ వాహనాలమీదే మూర్ఛపడిపోయారు.

అర్జునుడు అతికష్టంమీద వారిందరినీ ఓదార్చి తిరిగి యథాప్రకారంగా ప్రయాణం చేయించాడు. అతని వెనువెంట సాగిపోతున్న ద్వారకానగరపౌరులలోను, అంతఃపుర కాంతలలోను బయలుదేరిన హాహాకారాలు కొంతవరకు ఉపశమించాయి. తిరిగీ వాహనాలన్నీ మెల్లమెల్లగా ఇంద్రప్రస్థపురం వైపు సాగిపోయాయి.

సవ్యసాచి వారందరికీముందుగా సాగిపోతూ అయిదారు మారులు వెనుకకు తిరిగి ద్వారకానగరంవైపు చూశాడు. సముద్రతరంగాలు గంభీరంగా గర్జిస్తూ ద్వారకానగర రాజవీథులలో ఉన్మత్తనృత్యం ప్రారంభించాయి. ఆదృశ్యం తిలకిస్తూంటే అర్జునుని నేత్రాలనుండి బాష్పజలా లవిరళధారగా ప్రవహించాయి

జరిగిపోయిన గత దినవృత్తాంతాలన్నీ తిరిగీ విద్యుద్వేగంతో అతని కళ్లయెదుటే జరుగుతున్నట్టుగా స్ఫురించాయి.

అర్జునుడు హస్తినాపుర రాజసౌధంలో విశ్రమించి ఉండగా హఠాత్తుగా అతని కళ్లయెదుట శ్రీకృష్ణదేవునిరథం ప్రత్యక్షమైనది. తిరిగీ శ్రీకృష్ణదర్శనం కాగలదని సవ్యసాచి ఎంతైనా సంతోషించాడు. కాని ఆరథంలో అతనికి కనిపించినవాడొక్క దారుకుడే!

అతడు హస్తినాపురంలో రాజద్వారంలో రథం ఆపి పాదచారియై రాజప్రాసాదంలో ప్రవేశిస్తూనే పాండవులందరికీ ద్వారకాపుర విషాదవృత్తాంతం తెలియజేశాడు. తిరిగీ వెంటనే ఆరథంలోనే ద్వారకానగరానికి బయలుదేరవలసిందని సవ్యసాచిని ప్రార్థించాడు. కావడాని కది దారుకుని ప్రార్థనమే కావచ్చునుగాని సాక్షాత్తు అది శ్రీకృష్ణదేవుని ఆదేశమే. ఒక్కరైనా మిగలకుండా యాదవులందరు మద్యపానమత్తులై సముద్రతీరంలో భీకరయుద్ధం చేసి నిలువున్నపాటుగా స్వర్గస్థులైనారు! యాదవకులంలో ఉద్భవించిన ముసలమే ఆ విధంగా వారినందరినీ పొట్టన పెట్టుకొన్నది. ఆ భీభత్సం చూడగానే శ్రీకృష్ణుడు అరణ్యంలో తపోమగ్నుడై, సమాధినిష్ఠుడై ఉన్న అన్నగారిని సందర్శించడానికి బయలుదేరి వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణు డావిధంగా ఏకాకిగా తరలిపోవడం చూచి అంతఃపురకాంతలందరు పెద్దపెట్టున హాహాకారాలు చేశారు. వెళ్లిపోయే సమయంలో అతడు వసుదేవుని పాదాలు తన శిరస్సుపై ఉంచుకొని నమస్కారంచేసి యాదవస్త్రీబాలవృద్ధుల నందరినీ కంటికి రెప్పలా కాపాడుతూండవలసిందనీ అచిరకాలంలోనే ద్వారకానగరంఅంతా సముద్రంలో కలిసిపోగలదనీ, ఆ సమయంలో అంతఃపురమహిళల సంరక్షణకై అర్జును డానగరానికి రాగలడనీ చెప్పి వెనుదిరిగి చూడకుండా అలాగే అరణ్యానికి వెళ్లిపోయాడు. వెళ్లిపోయేముందు దారుకుని పిలిచి ఆ వృత్తాంతం అతనితో చెప్పి వెంటనే అర్జునుణ్ణి ద్వారకానగరానికి తోడుకొని రావలసిందని ఆజ్ఞాపించాడు.

దారుకు డా వృత్తాంతం వినిపించిన మరుక్షణంలోనే గాండీవి ద్వారకానగరానికి వెళ్లిపోయాడు. రోదనధ్వనులతో మహాభీభత్సంగా కనిపించే ద్వారకానగరం చూడగానే అర్జునికి కాళ్లు చేతులు ఆడలేదు. ఆక్షణంలోనే అతనికి శ్రీకృష్ణ బలరాములనిర్యాణవృత్తాంతం ఒక మహాశనిపాతంలా వినబడింది. ఇంతకీ వారిద్దరి మృతకళేబరాలు ఎక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియలేదు! ద్వారకానగర పరిసరారణ్యం అంతా గాలించగా గాలించగా ఎక్కడో ఒక దిక్కులేని తోట వారి శరీరాలు కనిపించాయి. శ్రీకృష్ణుడు సమాధినిష్ఠుడై శయనించిన సమయంలో మృగభ్రాంతితో ఒక బోయవా డతనిపై ఒక నిశితబాణం ప్రయోగించాడు. వెంటనే శ్రీకృష్ణనిర్యాణం జరిగిపోయింది. అర్జునుడు బలరామకృష్ణుల శరీరాలకు దహనసంస్కారాలు జరిపి తిరిగీ ద్వారకానగరం చేరుకొన్నాడు. దుర్భరమైన ఆ దుఃఖభారం భరించలేక కొన్ని గడియలలోనే వసుదేవుడు కూడా స్వర్గస్థుడైనాడు. చివరికి అర్జునునికే అతనికి దహనసంస్కారం చెయ్యవలసిన దురదృష్టం పట్టింది. అశ్రునిమీలిత నేత్రాలతో అత డా కర్మకాండ అంతా ముగించి అనేకవిధాలుగా అంతఃపుర స్త్రీలనందరినీ ఓదార్చి వారికి దుఃఖోపశమనం కలిగించాడు.

ఇక ఆ మరునాడే సముద్రం ఒక్క

★ విధి వైపరీత్యం ★

జోరుగా ద్వారకానగరంపై విరుచుకు పడబోతున్నది. అందువల్ల వెంటనే ద్వారకా నగర పౌరులందరినీ ఇంద్రప్రస్థానికి ప్రయాణం కావలసిందని ఆజ్ఞాపించాడు. హతశేషులైన యాదవులకు, శ్రీకృష్ణుని అంతఃపురసుందరులకు హస్త్యశ్వరథాదివాహనా లేర్పాటు చేయించి, వారందరినీ అతి జాగరూకతతో సంరక్షిస్తూ ఇంద్రప్రస్థానికి ప్రయాణమైనాడు. గత దివసస్మృతులన్నీ అతని హృదయంలో భీకర దుఃస్వప్నాల కంటకమాలికగా మెసలి వేయివిధాలుగా వేధించాయి.

౨

శ్రీకృష్ణుడు షోడశ సహస్రాంతఃపుర కాంతలతో మహాభోగాలనుభవిస్తూ చిట్టచివరికొక దిక్కులేనిచోట ఒకానొక క్షుద్ర వ్యాధుని బాణాఘాతంతో పరమపదించాడు. మహావీరులైనవట్టి యాదవులందరు తుంగగడ్డి పరకలతో ఒకరొకరినిసంహరించుకొని ఒక్క క్షణంలో నశించిపోయారు! సిరి సంపదలతోను, భోగభాగ్యాలతోను, గోగోపాలక గణాలతోను కలకలలాడే ద్వారకానగరం అంతా కన్నుమూసి కన్ను తెరిచేలోగా భీషణ సాగరగర్భంలో విలీనమైపోయింది. ఎంచక్కన్నరుగని వాసుదేవునిఅంతఃపురాంగనలందరు దిక్కులేని అనాథలై అల్లాడిపోయారు. "అర్జునునికీ నాకూ విభేదమేమీ లేదు! అతడే అంతఃపురకాంతల నందరినీ సురక్షితప్రదేశానికి చేర్చి అత్యంత జాగరూకతతో సంరక్షింపగలడు!" అని శ్రీకృష్ణుడతనికి దారుకునిద్వారా సందేశం పంపించాడు. అదే శ్రీకృష్ణుని చరమసందేశం! ఆ సందేశాజ్ఞ శిరసావహించి అర్జును డావిధంగా ఆ మహిళల నందరినీ అతిభద్రంగా తన వెనువెంట తోడ్కొనిపోతున్నాడు.

హృదయంగమమైన గోపాలదేవుని స్నేహమాధుర్యము, అనితర సాధారణమైన అతని మహాభోగైశ్వర్యము, జగన్మోహనమైన అతని మనోహరాకారము, లోకాతీతమైన ఆ మహామహుని స్థితప్రజ్ఞత్వము, చిట్టచివరికా మహానుభావునికే సంభవించిన అత్యంత దుర్భరమైన ఆ విపత్పరంపర తలుచుకొనేసరికి గాండీవి కదంతా అవిశ్వసనీయమైన మిథ్యామరుమరీచికగా స్ఫురించింది. గతదివసాలలో జరిగిన దుస్సంఘటనలన్నీ నిజమేనా? అని కూడా ఒకొక్కప్పు డతనికొకశంక కలిగింది. అయితే ప్రత్యక్షంగా తన చర్మచక్షువుల ఎదటే జరిగిన ఆ సంఘటనలన్నీ కేవలం మిథ్యే అని అనుకోవడాని కతనికి ధైర్యం చాలలేదు.

ఒక రథంలో ఒంటరిగా సాగిపోయే అతని హృదయంలో ఆ విధమైన భావ పరంపర లెన్నెన్నో బయలుదేరాయి. ఒక్కొక్కప్పుడు మహాధైర్యశాలి అయిన అతని కనుగొలుకులనుండి కవోష్ణ బాష్ప బిందువులు జాలువారేవి. అతని వెంట వెంట అపారమైన యాదవపరివారం అంతా నెమ్మదినెమ్మదిగా సాగిపోయింది.

ఆ పరివారం అంతా పంచనద దేశ ప్రాంతం సమీపించేసరికి అప్పుడే సూర్యాస్తమానం అయింది. తరవాత వారొక భీకర దుర్గమారణ్యం అధిగమించిపోవలసి ఉన్నది.

దూరదూరంగా వారికెదురుగా రక్తారుణమై ప్రజ్వలించే శుక్రతారక భయంకర దుర్విధి క్రోధనేత్రంలా స్ఫురించింది. ఇంకా దూరంగా వినిపించే క్రూర వన్య మృగాల గర్జితాలు, జంబుకాక్రందనాలు, ఘూకారవాలు వారి హృదయాలలో అపూర్వమైన భీభత్సం కలిగించాయి. ఆ ధ్వనుల కన్నిటికీ మంద్రమంద్రంగా వినిపించే సన్నసన్నని కీచురాతి మోత ఒక విచిత్రశ్రుతిలా వినిపించింది.

యాదవ బలానికి వెనకభాగంలో ఎవరో అయిదారుగురు యదుకుమారులు మాత్రమే వారందరికీ రక్షకులుగా ఉన్నారు. ఆ బలగానికి ముందుభాగంలో మరికొందరు తరుణ యాదవులు వారందరి సంరక్షణభారం వహించి నెమ్మదినెమ్మదిగా సాగిపోతున్నారు. అంతఃపురకాంతలు, ఇంకా ఇతర స్త్రీ బాల వృద్ధులు ఆ బలగానికి మధ్యభాగంలో హస్త్యశ్వరథారూఢులై మెల్ల మెల్లగా సాగిపోతున్నారు.

వారి కెదురుగా కనిపించే మహారణ్యంలో దారులుకాచే ఆటవికదస్యుగణా లెన్నెన్నో ఉన్నాయి. యాదవపరివారంలో చాలామంది స్త్రీ బాలవృద్ధులే. ఎవరో పది పన్నెండుగురు యదుకుమారులున్నా వారెవరు రణాంగణంలో ఆరితేరినవారు కారు. శస్త్రాస్త్రవిద్యలలో అర్జునికి సహాయకులుగా నిలబడడానికి తగిన శక్తిసామర్థ్యాలు కూడా వారికిలేవు. అందుచేత ఆ రాత్రి వేళ దుర్గమారణ్యంలో ప్రవేశించకుండా అక్కడే స్కంధావారా లేర్పాటు చేయించి, తెల్లవారేవరకు ఆ స్కంధావారాలలో విశ్రమించడమే సముచిత కర్తవ్యమని అర్జునికి స్ఫురించింది. అతడు వెంటనే తన సంకల్పం పరివారంలోని వారందరికీ తెలియజేశాడు. అప్పటికే అలిసిపోయిన వారంతా దాని కంగీకరించారు. దానితో మందమందంగా సాగిపోతున్న యాదవబృందంలోని వారంతా తమ యాత్ర విరమించారు. వెంటనే స్కంధావారా లేర్పాటు చేసే ప్రయత్నంలో నిమగ్నులైనారు. అప్పటికి కొంచెం చీకటిపడింది. అంతలో అంతఃపుర కాంతలూ ఇంకా ఇతర స్త్రీబాలవృద్ధులు అతి భీభత్సంగా ఆక్రందనధ్వనులు చేశారు. ఆ ఆక్రందనాలు వినగానే అర్జునిహృదయం నీరైపోయింది. వాటికి కారణమేమో అతనికి తెలియలేదు.

వెంటనే తనరథం ఆ ఆక్రందన ధ్వనులు వినిపించేప్రాంతానికి మరలించాడు. అక్కడ జరుగుతున్న భీభత్సం సందర్శించగానే గాండీవిహృదయం క్రోధావేశంతో కంపించిపోయింది.

వేలాది దస్యులు ధనుర్బాణాద్యాయుధాలతో యాదవులపై విజృంభించారు. కాని వారి నెదుర్కొనగలిగినవా డాపరివారంలో అర్జునుడొక్కడే; మిగిలిన యదుకుమారులు పదిపన్నెండుగురుదాకా ఉన్నా వారివల్ల ప్రయోజనమేమీ కలగలేదు!

అయినా అర్జునుడది లక్ష్యపెట్టక ఒక్క దూకులో దస్యుగణాలపై విరుచుకుపడ్డాడు. ఆగ్నేయాద్యస్త్రాలు ప్రయోగించి కనురెప్పపాటుకాలంలో దస్యులనందరినీ తరిమివెయ్యాలని సంకల్పించాడు. కాని ఎందుచేతనో ఆ అస్త్రాల మంత్రాలేవీ అతనికి స్ఫురించలేదు. ఆ వింతైన విధివైపరీత్యానికి కారణమేమో అతనికి తెలియలేదు. వెంటనే తన అమ్ములపొదిలో ఉన్న బాణాలన్నీ ప్రయోగించి ఆ దస్యులలో కొందరిని సంహరించివేశాడు. అయినా వారు నేల ఈనినట్లుగా కోకొల్లలుగా అర్జునుని మీదికి లంఘించారు.

అంతలోనే అర్జునునికి అక్షయతూణీరంలోని బాణాలన్నీ అయిపోయాయి. అక్షయతూణీరంకూడా ఆ విధంగా వ్యర్థమైపోయేసరికి గాండీవి హృదయంలో అదివరకెన్నడు బయలుదేరని భయాందోళన లుద్భవించాయి. అయినా నిరుత్సాహపడక అర్జునుడు గాండీవంకొనతోనే వారిని చావమోదడం ప్రారంభించాడు.

అయితే ఆ విధమైన యుద్ధపద్ధతివల్ల దస్యులెవరు భయపడలేదు. ఇంకా ఉద్ధతింగా అతనిపైకి లంఘించారు.

ఇంతలో మరికొందరు దస్యులు అంతఃపురస్త్రీలపై బడి వారి ఆభరణాలన్నీ అపహరించుకు పోయారు. మరికొందరు శ్రీకృష్ణుని అంతఃపురాంగనలలో కొందరిని బలాత్కారంగా అరణ్యంలోనికి తీసుకు

పోయారు. మరికొందరిని నానా విధాలుగా హింసించారు.

ఈ దౌర్జన్యంతో అంతఃపుర కాంతలందరు తిరిగి హృదయవిదారకంగా ఆర్తనాదాలు చేస్తూ అతిదీనంగా ఆక్రోశించారు!

ఆ కరుణాక్రందనాలు విని అర్జును డతి ధైర్యంతో దస్యులతో యుద్ధం చేశాడు.

కాని శస్త్రాస్త్ర విహీనమైన అతని పరాక్రమంఅంతా కేవలం బూడిదలోపోసిన పన్నీరైపోయింది! శ్రీకృష్ణుని అష్టపట్టమహిషులు, మరికొందరు అంతఃపురాంగనలు మాత్రం ఎలాగోఅలాగ దస్యుపరాభవభయంలేకుండా బయటపడ్డారు. మిగిలిన అంతఃపురాంగనలలో చాలామంది కిరాతకులచేతులలో పడి అనేకవిధాల యాతనలనుభవించారు.

వారి కరుణాక్రందనలు వినగానే అర్జునుని నవనాడులు క్రుంగిపోయాయి. అంతటిమహాపరాక్రమశాలి అని పేరుపొందిన తన బలపరాక్రమాలు కిరాతకులబారిపడ్డ శ్రీకృష్ణ కళత్ర సంరక్షణకు కూడా ఎందుకూ కొరగాకుండాపోయాయే అని అతడెన్నోవిధాల మధనపడ్డాడు. ఆ క్షణంలో అతనికిక జీవించడమే వ్యర్థమని అనిపించింది.

అత్యంతదారుణములయిన ద్వారకానగర వృత్తాంతాలు విన్నప్పుడే అతని హృదయం శతథా వ్రీలి విదళమైపోయింది. తరవాత జరిగిన కిరాతకుల కిరాతకృత్యాలు, తన అశక్తత అనుభూతికి రాగానే అతని ముఖం వివర్ణమై వెలవెలబోయింది. సమరాంగణంలో వీరాధివీరుడని ప్రసిద్ధి పొందిన బీభత్సుడొక్క నిట్టూర్పు విడిచిపెట్టి కేవలం జీవచ్ఛవప్రాయుడై తన రథంలో అలాగే కూలబడిపోయాడు!

అటుపిమ్మట తిరిగి ఎలాగోఅలాగ ధైర్యం చిక్కబట్టుకొని మిగిలిన అంతఃపురస్త్రీలను, ఇతరులను, క్షేమంగా ఇంద్రప్రస్థానికి తీసుకుపోయాడు. అనంతరం కొంతమంది యాదవవంశీయులను, శ్రీకృష్ణపౌత్రులను ఇంద్రప్రస్థానికి సమీపంలో ఆయా రాజ్యాలలో అభిషేకింపజేశాడు. పాండవులందరు హృదయవిదారకమైన ద్వారకానగరవృత్తాంతాలు విని ఆ విధమైన దుర్విధికై పరితాపానికెంతైనా కుమిలిపోయారు.

3

అనంతరం కొంతకాలానికి అర్జునుడు వ్యాసమహర్షిని సందర్శించవలెననే అభిలాషతో ఆయన ఆశ్రమానికి బయలుదేరాడు.

అతడు మహర్షి ఆశ్రమసమీపానికి చేరుకునేసరికి అప్పుడే సూర్యోదయం అయింది. మహర్షి ఆశ్రమంలో బ్రహ్మచారుల వేదసూక్తపారాయణాలు ప్రాతఃకాల కలవిహంగకూజితాలతో కలిసి మంద్రమంద్రగా వినిపించాయి. ఆశ్రమ హోమాగ్ని జ్వాలల పైడివెలుగులు పరిసర పూజాకృతులపై ప్రసరిస్తూ నెమ్మదినెమ్మదిగా మెరుగులు దిద్దాయి. ఆ సమీపంలో మరి ఒక ఆహవనీయాగ్నిలా సమాసీనుడైన సాత్యవతేయ మహర్షి పాండవమధ్యముడాశ్రమంలో ప్రవేశించగానే మనోజ్ఞమైన మందహాసంతో ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. ఆ సమయంలో అర్జునుడికి మహర్షిముఖం అప్పుడప్పుడే వికసించిన సహస్రదళపద్మంలా స్ఫురించింది. కాని అర్జునుని ముఖంమాత్రం అలాగే చింతాక్రాంతమై, వివర్ణమై వెలవెలబోయింది. అతడు నెమ్మదిగా వెళ్ళి వ్యాసమహర్షి సన్నిధిని కూర్చున్నాడు.

మహర్షి కొంతసేపు నిశ్చలదృష్టితో అతని ముఖభంగిమ గమనించి, ఆవిధమైన అపూర్వదైన్యానికి హేతు వేమని ప్రశ్నించాడు.

మొట్టమొదటగా అర్జునుడు మహర్షికి ద్వారకానగర బీభత్సవృత్తాంతము, శ్రీకృష్ణ బలరాముల నిర్యాణము, వ్యాధుని బాణాఘాతంతో కలిగిన దారుణ పరిణామము మొదలైనవన్నీ యథాక్రమంగా విన్నవించాడు. అనంతరం తిరిగి మహర్షిముఖంవైపు పరికించి చూచాడు.

మహర్షి మందస్మిత జ్యోతి ప్రాతఃకాల సూర్యకిరణాలతో చేతులు కలుపుతూ అలాగే ఒక ఆరని జ్యోతిలా వెలిగింది.

అనంతరం సవ్యసాచి ఒక నిట్టూర్పు విడిచిపెట్టి తిరిగి తన విషాదగాథ ప్రారంభించాడు.

గోపాలదేవుని అంతఃపుర వరారోహాలు క్రూర కిరాతకుల చేతులలో అనుభవించిన దుస్సహమయయాతనలన్నీ పూసగుచ్చినట్లు వివరించి చెప్పాడు. ఆ సమయంలో తనకు సంభవించిన ఆ శస్త్రాస్త్రవైఫల్యము, అక్షయతూణీర వైయర్థ్యముకూడా తెలియజేశాడు.

ఆ విషయం విన్నవించినంతసేపు అతడు వంచిన శిరస్సు పైకెత్తలేదు. ఆ ధీరవరేణ్యుని కపోలాలపై జలజల కన్నీరు నిరంతరధారగా ప్రవహించింది.

ఆ క్షణంలో వ్యాసభట్టారకుని కతని హృదయయాతన అంతా [illegible] అవగతమైపోయింది.


అలాగే నిశ్చల మందహాసంతో కనురెప్ప పాటు లేకుండా ఒక నిముషంపాటు అర్జునునివైపు చూచాడు.


గాండీవి కనుగొలుకులనుంచి కన్నీరింకా సంతతధారగా ప్రవహిస్తూనే ఉన్నది.

"అర్జునా! వాసుదేవుడు, ఆయన అంతఃపురసుందరీగణము, దారుణ మునిశాపాల మూలంగానే ఆవిధమైన యమయాతనల పాలైనారు! దీనిలో మరి విచారింపవలసినది ఏమి ఉన్నది!" అన్నాడు వ్యాసభట్టారకుడు.

అయినా అర్జునుని కించుకంతైనా మనశ్శాంతి లభించలేదు.

వేదవ్యాసుని పెదవులనుంచి అప్రయత్నంగా ఒక దీర్ఘనిశ్వాసం వెలువడింది. అయినా మహర్షి పెదవులపై చిరునవ్వులాగే అరుణోదయకాంతి రేఖలా మెరిసింది!





తిరుపతి కొండపైకి బస్సురోడ్డు.
ఫోటో : వి. కృష్ణరావు, మద్రాసు.

★ విధివైపరీత్యం ★

"నాయనా! అణువు మేరుపర్వతమై ఔన్నత్యం పొందడానికి, మేరుపర్వతం ఒక అల్పాల్పమైన అణువై నశించిపోవడానికి అమోఘ కాలపురుషుడే ప్రధానకారణం! లోకాతీతులైన మహామహితాత్ములు హీనాతిహీనమైన దుర్గతి పొందడానికీ హీనాతిహీనులు మహామహితాత్ములై జాజ్వల్యమానంగా వెలిగిపోవడానికీ మరి వేరే కారణం ఏమి ఉన్నది? అలౌకికములైన అష్టైశ్వర్యాలు, అత్యంత దుర్భరమైన యాతనాదికాలు కాలపురుషుని తోడవల్లనే సంప్రాప్తిస్తున్నవి.

ఇది తెలియని అజ్ఞులు అహంకారపూరితులై విర్రవీగుతున్నారు. కాలపురుషుని ఇచ్ఛామాత్రంచేత సంభవించే సుఖదుఃఖాలను దళించేవా రెవరుంటారని మానవులైన అజ్ఞానులు!"


ఈ ఉపదేశవాక్యాలతో అర్జునుడికి కొంత ఉపశాంతి కలిగింది. అతని ముఖం కొంచెం వికసించింది. అతనికి వేదవ్యాసు డిలాగ ఉపదేశించాడు.

"శ్రీకృష్ణభగవానుడు కేవలం అవతారి వల్లనే అత్యంతంబుపుల దుష్టులకి ప్రతీకారం చెయ్యకుండా ఉపేక్షించి పోతున్నావని భ్రమిస్తున్నావేమో! నాయనా! యాదవకులనాశనకాలంలోనే ఆయనకీ విధివైపరీత్యం యాదవులు అవగాహన అయిపోయింది. అవతారపు ప్రయోజనం సమాప్తమైపోయిన వెనువెంటనే గ్రహించినమరునాటికాలంలోనే ఆయనలో ఆ కైవల్యం ఆవహించింది. అనంతో ఆ పరమేశ్వరుని ఇచ్ఛామాత్రమే! స్వయంగా ఆ మహామహితాత్ముని ముఖతః నీతామృతం ఆస్వాదించిన నీకిక నేనేమి చెప్పగలను నాయనా!"

ఆ వాక్యంతో హఠాత్తుగా అర్జునుడి హృదయాంతరాళంలో ఒక దివ్యజ్యోతి మెరిసినట్లయింది. ఆ జ్యోతికాంతి అతని మనస్సుపై ఒక ప్రశాంతిని నింపుతూ ప్రసరించింది.

ఆశ్రమ హోమధూమమాలికల విరాళ వలితరుశాఖలలో అల్లిబిల్లిగా అల్లుకొని క్రమక్రమంగా అనంత నీలాకాశంలో విలీనమైపోయింది. ★





17

ఊరోళ్లోని అన్నదారాయ్‌గా రిప్పుడు మా పెద్ద ఆపదలో పడ్డాడు. ఊరికి 'సర్వే' వాళ్లు రావటంతో ఉత్తరపువైపు మైదానంలో డేరాలు లేచాయి. సర్వే అధికారులు నదివంచ నేమైదానంలో తమ ఆఫీసులు పెట్టుకున్నారు. చిన్న - పెద్ద ఉద్యోగులు, కమాస్తాలూ మొత్తానికి చాలామంది వచ్చారు. ఊళ్ళో పెద్దమనుషులందరూ అంతో యింతో భూవసతి ఉన్నవాళ్ళే. అంతా తమ జీవితనౌకలను తాత ముత్తాతలు సంపాదించిపోయిన నిరాపదములైన సంపత్ పులివాలకు పట్టించి, హాయిగా, పనిపాటల జోలికి పోకుండా కాలక్షేపం చేస్తున్నవాళ్లు. కాని ఇప్పుడిహ అందరికీ కొంప ముప్పువచ్చిపడింది. శ్యామా భూమి తనదే అని రామా బుకాయించి ఏ పేచీ రానీయకుండా అనుభవిస్తున్నాడు. యదు పది 'బిఘా'ల భూమికి మరో రెండుబిఘాల భూమిని అన్యాయంగా కలుపుకుని నిస్సంకోచంగా తిరుగుతున్నాడు. ఇన్నాళ్లనుంచీ ఇలాంటివన్నీ ఏ రభసా లేకుండా చలామణీ అయిపోతూనే ఉన్నాయి. కాని ఇప్పుడందరికీ, పట్టుకుంది అలజడి. ఈ ఆపద అందరికీ మొత్తంగా వచ్చిపడిందే అయినా అన్నదారాయ్‌కివచ్చిన ఆపద వేరు. అది మరోక మెట్టు పైది. మరోక పిసరు ఎక్కువది. అతని దాయాదిసోదరుడు చాలాకాలంగా పశ్చిమదేశంలో ఉంటున్నాడు. అతని తాలూకు మామిడి, పనస తోటలను, భూమినీకూడా అన్నదారాయ్ ఇన్నాళ్ళనుంచీ నిరాటంకంగా అనుభవిస్తూ వచ్చాడు. సర్వేసమయంలో నలుగుర్నీ కూడ కట్టుకుంటే కొంతకాకపోతే కొంతయినా తినపేర బదలాయింపు చేసుకోలేకపోతే మా అనే ధీమా ఉండేదతనికి. కాని ఆదాయాది సోదరునికి ఊళ్లోవాళ్లు ఎవళ్ళు ఏం ఉత్తరం రాశారో - ఆ అన్నకొడుకు సర్వేసమయంలో తమ ఆస్తిపాస్తులను కట్టుదిట్టం చేసుకోవటానికిగాను పదిరోజులక్రితమే ఈ ఊరువచ్చి పీఠం వేసుకుని కూర్చుని, తన వ్యవహారాలు చూసుకుంటున్నాడు.

నోటిముందు గ్రాసం ఎలాగో పోసే పోయింది. అది అలా ఉండగా మరోక కష్టంవచ్చిపడింది. ఆ యింట్లో తమ ఈ ఆత్మీయుని వాటాయే కొంతగట్టిగా ఉన్న భాగం. దాన్ని గత ఇరవై సంవత్సరాల

అనువాదం:
మద్దిపట్ల సూరి

నుంచీ అన్నదారాయ్ వాళ్ళు భుక్తం చేసుకుంటున్నాడు. ఇప్పుడా భాగం వాళ్లకి వదిలిపెట్టవలసి వచ్చింది. ఆ దాయాది సోదరుని కొడుకు - కొత్త నవనాగరికుడైన కాలేజీ విద్యార్థి. అతడికి చదువుకునేందుకు ఓగది. పడుకునేందుకు ఓగది, భోజనానికి ఓగది-అన్నీ విడివిడిగా వుండాలి. మిద్దెమీద గదులలోని ఇనప్పెట్టె, తాకట్టుసామానులు, కాగితాలూ-గట్రా తీసి ఖాళీచేసి ఇవ్వవలసి వచ్చింది వాటిని. ఎప్పుడో తలుపులూ-కిటికీలూ-కొయ్యలూ మొదలైన కలపసామగ్రి అంతా చవకగా కొని క్రింద గదిలో వేసి తాళం వేయించి ఉంచాడు. ఆ గదికూడా త్వరలో ఖాళీచేసి ఇవ్వాలి.

సాయంత్రం-వీ నాలుగో అయి ఉంటుంది. అన్నదారాయ్ గారి మంటపంలోకి ఇరుగుపొరుగువాళ్లు ఒక్కరొక్కరే వస్తున్నారు-రోజూ ఈపాటప్పుడే ఓప్రక్కన పులిజూదం, ఓప్రక్కన మూడుముక్కలాట ప్రారంభమవుతూ ఉంటాయి. కాని ఇవాళ ఇంకా పని తెమల్లేదు. అన్నదారాయ్ వచ్చిన బాకీదార్లదగ్గిర్నుంచి వసూళ్ళు చేసుకుని ఒక్కొక్కర్నే పంపించివేస్తున్నాడు.

మెల్లాలో దడిదగ్గిర 'వయసుమించని ఒక పాలికాపు భార్య, చంటివాణ్ని దగ్గిర పెట్టుకుని, చాలాసేపటినుంచి కూర్చుని ఉంది. ఇప్పుడిహ తనవంతువచ్చిందని తెలుసుకుని లేచినుంచుంది. రాయ్‌గారు కొంచెం తలవంచి కిందకు జారిన సులోచనాలోంచి ముఖం చిట్లించుకుని చూస్తూ "ఎవరది? నువ్వా? ఏంపనిమీద వచ్చావ్?" అని అడిగాడు.

ఆపాలికాపుభార్య కొంకుతున్న మాట విప్పుతూ "ఎంతో కష్టపడి కొంచెం సొమ్ము సంతిన చేసుకుని వచ్చాను-ఈ సొమ్ము తీసుకుని, ధాన్యం కొట్టు తాళం తీయించండి. ఎంత కటకటగా ఉందనుకున్నారు దొరా! ఏం చెప్పేది మాకష్టాలు-"అన్నది మెల్లగా.

అన్నదారాయ్ ముఖం ప్రసన్నమైంది. "ఊఁ! ఈసొమ్ము లెక్కపెట్టి తీసుకో. కొత్త పుస్తకం తీసి ఏ తేదీయో చూడు. వడ్డీ అదీ మరోకసారి సరిగ్గా లెక్కకట్టి చూడు" అన్నాడు.



పథేర్ పాంచాలి



పాలికాపు పెళ్ళాం కొంగు ముడి విప్పి మూడు తీసి, హరిహరుని ఎదుట పోసారాలో పెట్టింది. హరిహరుడు ఎంచి చూసి, "అయిదురూపాయలేనా?" అని అడిగాడు.

"సరే, సరే జమకట్టుకో, మరి మిగతా పాపుమాటో?" అని అడిగాడు అన్నదా రాయ్.

"ఇప్పటి కిది తీసుకోండి-తర్వాత ఇచ్చుకుంటాను. కష్టంచేసి మీ అప్పు తీర్చుకుంటాను. ఇప్పటి కిదితీసుకుని మా వడ్లకొట్టు తలుపులు తాళాలు తీయించండి. ముందు మా 'మాతో' తిండిసంగతి చూసుకోవాలి... అదీకాక ఇంటి తలుపులూ అవీ కూడా పగిలి పోయాయి. వాటికి——"

ఆ పాలికాపు భార్య తాళా లేమిటో తన చేతులోకి వచ్చేసినట్లే-దిలాసాగా మాట్లాడేస్తోంది. రాయ్‌గారితత్వం తెలుసుకోటాని కింకా వ్యవధి పడుతుంది మరి!...

రాయ్‌గారు ఆమెని మాట పూర్తిచెయ్యనీయకుండానే-"ఆఁ, మహామంకుపట్టు పట్టినట్లుందే చూస్తే ఇది! వడ్డీ అసలు అంతాకలిపి ఇంచుమించు నలభై రూపాయలు బాకీ- అయిదు రూపాయలు తెచ్చావు, తీసుకుని తాళాలు తీయమంటుంది మారు. అలాగా వాళ్ళే ఉన్నట్ల ఇంత. ఛీ, ఇప్పుడేం విసిగించకు నన్ను-" అన్నాడు.

పాలికాపు పెళ్ళాం ఆ మంటపంలో చేరిన పెద్దల కెవరికీ అపరిచితురాలు కాదు. దీనుభట్టాచార్యకి చూపు అంతగా ఆనదు. "ఎవరది అన్నదా?" అని అడిగా డతను.

"అదుగో, ఆ వీధినుండే త్రిమాజ్ పెళ్ళాం. త్రిమాజ్ నాలుగురోజుల క్రితం పోయాడు తెలుసుగా? వడ్డీ-అసలు అంతా కలిసి నలభైరూపాయలు బాకీ. వాడుపోయిన నాటి సాయంత్రంనుంచే ఆ కొట్టుకు తాళం వేయించి, చెవి దగ్గిర పెట్టుకున్నాను. ఇప్పుడు ఇదివచ్చి, అది తెరవండి అంటూ ఏమిటో పెద్ద రభస చేస్తోంది" అని చెప్పాడు.

కొళ్ళకింద నేల క్రుంగిపోయినా త్రిమాజ్ పెళ్ళాం అంత గతుక్కుమనేది కాదు. ఆమె ఇప్పటికి చాలావరకు అర్థం చేసుకుంది. ముందుకువచ్చి, అలా అకొద్దు దొరా: మా అబ్బాయికి తొడుతూ అవీ ఉన్నాయి- పోయిన సంవత్సరం చేయించింది. అవి కొంటానన్నాడికి తీసుకెళితే అయిదురూపాయ లొచ్చింది. చంటివాడి సొత్తు అమ్మటం ఇష్టంలేదసలు. ఏం చెయ్యమంటారు ముందు పొట్టగడిచే ఉపాయం చూసుకోవాలికదా! తర్వాత మళ్ళీ రేపు దయగల దొరలు వాకే నా బిడ్డకి చేయించి యిస్తార్లే అనుకున్నాను. దయగల దొరలు-తాళాలు ఇప్పించండి-" అన్నది.

"వెళ్ళు వెళ్ళు, సరేలే ఇళ్ళు ఇవీ. డబ్బుతోకూడిన వ్యవహారాలు ఇలా కళ్ళనీళ్ళు పెట్టుకోగానే కొట్టుకుపోతాయా? ఒక్క నాటికీ పోవు. నీ కేం తెలుసు, నీ మొగుడున్నట్లయితే వాడికి తెలుసు ఇలాంటి వన్నీ. ఇంక విసిగించకు నన్ను. ఆ అయిదు రూపాయలూ నీ కాతాను జమకట్టి ఉంచుతాం. మిగతా డబ్బుకూడా తీసుకువచ్చాక చూసుకుందాం——"

అన్నదారాయ్ సులోచనాలు తీసి, 'కేస్'లో పెడుతూ ఇంట్లోకి వెళ్ళిపోయే ప్రయత్నంలో ఉన్నాడు. త్రిమాజ్ పెళ్ళాం ప్రాధేయపడుతూ "నా మొర ఆలకించండి దొరా! నా బిడ్డ కేదైనా దారి చూపివెళ్ళండి. వాడిని ఏం పెట్టి పోషించను;

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లల కిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లోవేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టుపని చూసుకోవడం, కొట్టకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది కొట్లోకివచ్చే గ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్ద సముదాయం వెనక వాడికి ఏవో చిత్రవిచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దారికనుక్కుని అక్కడికి వెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు. ఒకసారి తండ్రి ఏదో ఊరు వెడుతూ అపూనుకూడా వెంట తీసుకువెళ్లాడు. ఎప్పుడూ ఊరు విడిచి వెళ్ళని అపూ ఏదో కొత్తదేశాన్ని కనుక్కోడానికి పోతున్నవాడిలాగ అపూర్వానుభూతి పొందాడు. కొత్తఊళ్లో వాడికి అమల అనే పిల్ల స్నేహితురాలైంది. ఆపిల్లమీద కలిగిన ఆపేక్ష మరోకొత్త అనుభూతి అయింది.

మురమురాలు కొనిపెట్టేందుకైనా కానీ లేదు. మా కొట్టు తాళాలు తీయించకపోతే నే నిచ్చిన సొమ్మయినా తిరిగి యిప్పించండి" అన్నది.

రాయ్‌గారు ముఖం కండలు బిగించుకుని, "ఛో ఛో, సందెవేళ తగాదా పెట్టుకు కూర్చోకు. దోసెడు రూపాయలు ఒకపక్క గంగలో కలిసిపోతూంటే దాని సంగతేం పట్టించుకోదు. కొట్టుతాళాలైనా తీయించండి, డబ్బు అయినా తిరిగి ఇవ్వండిట! ఏ ముంది ఆ కొట్లో 'మట్టి'! మా ఉంటే నాలుగుబస్తాల గింజలున్నాయేమో! మరి ఆ డబ్బు? ఆ అయిదు రూపాయలూ వసూలుచేసి ఉంచా కనుక ఇంక నా డబ్బు సంగతేం అక్కర్లేదన్నమాట! 'నా బిడ్డ ఏం తింటాడో చెప్పండిట'! ఏం తింటాడో, ఎలా తింటాడో నాకేం తెలుసు? చేతనయితే దావావేసి తాళాలు తీయించుకో—ఛో—" అన్నాడు.

రాయ్‌గారు ఇంట్లోకి వెళ్ళిపోగానే "అప్పుడే అమ్మా! తిర్నాళ్ పోయి ఎన్నాళ్లయింది? ఏం వచ్చి?" అని అడిగాడు దీనూభట్టాచార్య.

"—బుధవారం నాడండీ బాబుగారూ! సంతనుంచి నాలుగు చేపలు పట్టుకువచ్చాడండి. శుభ్రంగా మసాలా అదీ వేసి వండిపెట్టా. మామూలు మనిషిలాగానే తిన్నాడు. తిన్న తర్వాత 'నాకు చలివేస్తోంది, బొంత కప్పు' అన్నాడు. కప్పాను. అంతేనండి, గంట కూడా తిరిగేసరికల్లా—నన్నూ నా బిడ్డను నట్టేట్లో వదిలి—"

కళ్లల్లో నీళ్లు తిరిగి, కంఠం పట్టుకుపోయింది దా అమ్మికి...తర్వాత ఆయన్ని బతిమాలుతూ "మీరు కొంచెం చెప్పండి. చెప్పి, కొట్టుతాళాలు తీయించండి. కొంపలో చాలా కటకటగా ఉంది. నాకీ ఉంమరుంటామటండీ కేము! ఏ కష్టం చేసో—"

ఇంతలో ఆ క్రొత్తగా వచ్చిన దాయాదు లబ్బాయి అక్కడికి రావటంతో ఆ ప్రసంగం ఆగిపోయింది. "రండి, నీరేన్ బాబూ! రండి, వచ్చారా! అలా మైదానంపైపు షికారు వెళ్లి వచ్చినట్లున్నారే! ఇది మీ తండ్రులు తాతలు పుట్టినగడ్డ. తెలుసుగా! ఎలా ఉన్న దంటారు?" అని పలకరించాడు దీనూభట్టాచార్య.

నీరేన్ చిన్న వర్యోకటే వచ్చాడు. అతడికి ఇరవై ఒకటి, ఇరవైరెండేళ్లకంటె ఎక్కువ ఉండవు. పుష్టిగా, అందంగా ఉంటాడు. కలకత్తాలో 'ప్లీడరీ' చదువుతున్నాడు. చాలా మితభాషి. ఆస్తీ అదీ చూసుకుని రమ్మని తండ్రి ప్రేరేపించి పంపినా, ఆ పనులేం చూసుకోడు. రాత్రిం

★ పథేర్ పాంచాలి ★

జగళ్లు వనలు తొడుక్కుంటూనూ, కాదాఅంటే తుపాకీ ఒకటి పట్టుకు తిరుగుతూనూ కాలం గడుపుతున్నాడు. వచ్చేటప్పుడు తుపాకీ ఒకటి తెచ్చుకున్నాడు. వేటంటే మహా ఇష్టం.

నీరేన్ మేడమీద తనగదిలోకి వెళ్ళాడు. గోకుల్ భార్య ఏమిటో కింద పడ్డవి ఏరుతూ కూర్చుంది గదిలో. తలుపుదగ్గరకెళ్లి చూసే సరికి, తాను తెచ్చుకున్న సొగసైన టేబుల్ 'లాంపు' కిందపెట్టి ఉంచటం కన్పించింది. దాని చిమ్నీ కిందపడి బద్దలైపోయింది. గది నిండా పడ్డాయి గాజు పెంకులు. తలుపుదగ్గిర బూట్ల చప్పుడు విన్పించగానే గోకుల్ భార్య వెనక్కి తిరిగి చూసింది-ఆమె గాజు ముక్కలన్నీ గుడ్డతో తుడిచి పోగుచేస్తోంది. రోజూలాగానే గది తుడిచి లాంపు వెలిగించి పోదామని వచ్చింది. ఎలా తగిలి పడి పోయిందో, పడి పగిలిపోయింది. ఆ వస్తువు యజమాని వచ్చేలోపుగానే తాను చేసిన నేరం తాలూకు గుర్తులు అక్కడ లేకుండా చేసే ప్రయత్నంలో ఉన్నదేమో, చటుక్కున ఆ పగిలిపోయిన వస్తువుతో సహా పట్టు బడిపోవటంతో తెల్లబోయినట్లయింది ఆమె. వస్తువు నష్టపరిచానే అన్న ఆమె కించను తేలికపరిచేందుకై నీరేన్ నవ్వుతూ-"అదే మిటి వదినా! చిమ్నీ పగలకొట్టావల్లే ఉందే! ఇదుగో పట్టుపడ్డావు. నేను 'లా' చదువుతున్నవాడినని తెలుసుగా! — సరే ముందు కొస్త టీ చేసి తెచ్చిపెట్టు వదినా! తప్పని తెచ్చిపెట్టాలి. చూస్తా ఎంత బాగా చేసి తెచ్చిపెడతావో, ఆగు, దీపం వెలిగించనీ. పెట్టెలో మరొక చిమ్నీ ఉన్నది. ఇంతకీ అదృష్టం!" అన్నాడు.

"అగ్గిపెట్టె తీసుకురానా మరదీ?" అని అడిగిందామె సిగ్గుపడుతూ.

"అగ్గిపెట్టె తీసుకురాండే ఎలా వెలిగిస్తా ననుకున్నావ్ వదినా మరి?"

ఆమె ఈసారి కొంచెం నవ్వి—"కొస్త పొగచూరినట్లుంది, పోనీ తుడుద్దాం ఒక సారి అనుకున్నాను. చిమ్నీ తీసి ఎలా క్రిందపెట్టానో ఏమో, ఏమిటో ఇవన్నీ నీకు చిమ్నీలుకదా!—" అంటూ మాట పూర్తిచెయ్యకుండానే సిగ్గుతో నవ్వుతూ క్రిందికి పారిపోయింది.

నీరేన్ వచ్చి పదిపన్నెండురోజు లయింది, వరుసకి వదిన అయినా గోకుల్ భార్యతో అతడికి అంత చనువు ఏర్పడలేదు. 'లాంప్' చిమ్నీ పగిలిపోయిన సాయంకాలంనాటి నుంచి వారిద్దరిమధ్య క్రొత్త పరిచయపు సంకోచం తొలిగిపోయింది. నీరేన్ స్థితి మంతులబిడ్డ, పైగా బాంగ్లాదేశపు పల్లెటి దిక్కుకి రావటం ఇదే ప్రథమం. సన్నిహితు లేకుండా, సంతోషరహితంగా ప్రవాసంలో కాలంగడపాలని లేదతడికి. తనకి ఇంచుమించు సమవయస్కురాలైన వదిన దగ్గర కొస్త చనువు ఏర్పడినాక, ప్రొద్దున సాయంత్రం టీ త్రాగేవేళలు మామూలుగా కొస్త సంతోషంగా గడవసాగాయి.

ఆరోజున మధ్యాహ్నం దుర్గ పెత్తనాని కని వచ్చింది. వంటయింట్లోకి తొంగి చూస్తూ "ఏమిటి పిన్నీ వండుతున్నావ్?" అని అడిగింది. "రా అమ్మా, రా. కొస్త సాయంచేసి పెడుదూ, ఒక్కదాన్ని చేసుకో లేకుండా ఉన్నాను." అన్నదావిడ.

దుర్గ అత్యుత్సాహం వచ్చినట్లు పిన్నికి ఏదో పనుల్లో కొస్త సాయంచేస్తూనే ఉంటుంది. ఆ పిల్ల చేపలు తరుగుతూ "ఈ పీత లెక్కడ దొరికాయి పిన్నీ? వీటి నెవ్వరూ తినరు" అన్నది.

"ఎందుకు తినరే, పో వీటిని అందరూ తింటారని చెప్పిందా చేపలమ్మి."

"అప్పుడే కాని పిన్నీ, వీటిని నువ్వుకొనను కూడా కొన్నావా?"

"కొన్నదే. అవన్నీ అయిదు కాళ్లకి ఇచ్చేసిందా అమ్మి."

దుర్గ ఏమీ మాట్లాడలేదు. కాని మనసులో మాత్రం, పిన్ని అంత మంచిదే, కాని కొస్త అమాయకురాలు. ఇలాంటి పీతల్లాంటి చేపలు డబ్బులిచ్చి ఎవరు కొంటారు? ఎవరు తింటారు? అమాయకురాలిగా చూసి ఆ అమ్మి మోసంచేసి ఉంటుంది! అనుకున్నది. వెంటనే అనాయకురాలైన పిన్నిమీద తనకున్న అపేక్ష మరింత బలపడింది.

ఆరోజున గోకుల్ బాబాయ్ పిన్నిని పొంకోడు తీసుకుని తలమీద కొట్టాట్ట! పాలుపోసే స్వర్ణ తమ యింటికి వచ్చినప్పుడు చెప్పింది. ఆరోజున ఏటికి స్నానానికి తానూ వెళ్లింది. పిన్ని ఏటికి వచ్చింది కాని తలమీదిగాయం ఎక్కడ మంటపుడుతుందో అని తలారాస్నానం చెయ్యలేదు. ఆరోజున గుండెపగిలేటంత ఏడుపు వచ్చిందా పిల్లకి. కాని రేవులో అందరికీ ఈసంగతి వెల్లడయి నందుకు పిన్ని ఎక్కడ తెల్లబోతుందో అని ఏమీ మాట్లాడలేదు. అక్కడికి రాయ్‌గారింట్లో అవ్వగారు "స్నానం చెయ్యవేమే అమ్మాయ్?" అని అడిగేసింది. పిన్ని నవ్వుతూ "ఇవాళ స్నానంచెయ్యను లే అమ్మమ్మా! ఒంట్లో బాగాలేదు" అంది... తనను కొట్టినసంగతి ఎవరికీ తెలియదని అనుకుని ఉంటుంది పిన్ని. కాని పిన్ని రేవులోంచి వెళ్లగానే అవ్వగారు-"మాకారా, గోకుల్ ఎలా కొట్టాడో పాపం ఆ అమ్మాయిని; రక్తంతో తలంతా అంటుకట్టుకుపోయింది" అన్నది అందరితో. అవ్వగారిది మరీ అన్యాయం లే; తెలుసుకదా తనకు! తెలిసి అడగటం దేనికి? అది మళ్ళీ అందరితోనూ చెప్పటం దేనికి?

దుర్గ చేపలు తరిగి కడిగి ఇచ్చి వెళ్లబోయే ముందు—"మీ యింట్లో అటుకుల వడ్లున్నాయా పిన్నీ? అప్పూ అటుకులు కొట్టమని మారాం చేస్తున్నాడు. మేము యీ యేడు వడ్లు కొనలేదట. మా అమ్మ చెప్పింది" అన్నది. గోకుల్ భార్య రహస్యంగా "భోజనాలన్నీ అయినాక అనక రా" అని వసారాకేసి చూపిస్తూ-"అందరూ నిద్రోయాక రా అప్పుడు. యేం?" అన్నది.

"మీయింటికి ఎవరో వచ్చారుటే పిన్నీ! నేనెప్పుడూ చూడనేలేదే!" అన్నది దుర్గ.

"మా మరిదిని చూడలేదూ?... ఇప్పు డింట్లో లేడు. ఎక్కడికో వెళ్లాడు. సాయంకాలం రా చూడొచ్చు" అని గోకుల్ భార్య నవ్వుతూ "మరిదికి నిన్నిచ్చిచేస్తే అందక్కగా ఈడూ జోడూగా ఉంటారు" అన్నది.

సిగ్గుతో ఎర్రబడిన ముఖంతో "ఏ, ఫో" అన్నది దుర్గ.

గోకుల్ భార్య మళ్ళీ నవ్వుతూ-"ఎందుకే పోవటం? ఏం నువ్వేం అనాకారివా? చూస్తానుండు" అంటూ దుర్గ చుబుకాన్ని కొంచెం ఎత్తి పట్టుకుని, "మాకావా? దుర్గాదేవిముఖంలా ఎంత చక్కని ముఖమో! మీ నాన్న డబ్బులేనివాడైతే మాత్రం యేం!" అన్నది.

దుర్గ ఒక్క విసురుతో ఆమె చేతుల్లోంచి తప్పించుకొని ఇవతలికి వచ్చి, "పో పిన్నీ! నువ్వు ఏమిటి మరీ-" అంటూ దొడ్డిగుమ్మాన ఒక్క పరుగు తీసింది అక్కడినుంచి. వెడుతూ వెడుతూ- "పిన్ని అంతా మంచిదే! కాస్త అమాయకురాలన్నమాట కాని! లేక పోతే చూడరాదూ-ఫో-" అనుకుంది మనసులో.

దుర్గ వెళ్ళివెళ్లటంతోనే స్వర్ణ పాలు పితకటానికి వచ్చింది. గోకుల్ భార్య లోపల్నుంచి, "నా చేతులు ఊరుకోలేదు స్వర్ణా! దూడ, బయట ముందరివాకిట్లో పందిరి గుంజకి కట్టేసిఉంది. విప్పుకురా, వసారాలో పాలతప్పేలా తోమిపెట్టి ఉంది చూడు" అన్నది.

గోకుల్ అక్కగారు నఖీ ఠాకురన్ జపం ఇప్పటికి తెమిలింది. ఆవిడ బయటికి వచ్చి ఈ తెరపు ప్రక్కన ఉన్న కాళీగుడివైపుకి ముఖం త్రిప్పి, నమస్కరిస్తూ "తల్లీ, సిద్ధేశ్వరీ! కోటి నమస్కారాలు! రక్షించు. ఈ భవసముద్రాన్ని దాటించు తల్లీ! రక్షాకాళీ రక్షించు" అని రాగవరుసని ప్రార్థించసాగింది.

గోకుల్ భార్య వంటింట్లోంచి-"కొబ్బరి ఉండలు చేసిఉంచాను వదినా! రెండునోట్లో వేసుకుని కాసిని నీళ్లు త్రాగండి" అని కేకేసింది.

నఖీ ఠాకురన్ వసారాలోంచి హఠాత్తుగా "ఇలావచ్చి ఒకసారి చూసివెళ్లు" అన్నది.

ఆమె కంఠస్వరం విన్పించేసరికి గోకుల్ భార్యకి ప్రాణాలు పైన పోయాయి. యముణ్ణిచూస్తే ఎంతభయమో ఆవిణ్ణిచూస్తే అంతభయం ఆమెకి. భగవంతుడామెకి దయాదాక్షిణ్యభావాలు కల్గించటంలో పక్షపాతం చూపలేదనిమాత్రం నిస్సందేహంగా

★ పథేర్ పాంచాలి ★

చెప్పవచ్చు. వసారాలో దూలనున్న పాత్ర సామానులమీదికి వెళ్లి వంగి వ్రేలితో చూపిస్తూ "చూడు, కళ్లు పెట్టుకు చూడు ఒకసారి. కనిపిస్తోందా? అంటనీళ్ల చిందులు కనిపిస్తున్నాయా స్పష్టంగా? స్వర్ణ ఇక్కడినుంచేగా పాలతప్పేలా తీసుకువెళ్లింది! ఆ క్షుద్రది ముట్టుకున్న ఈ గిన్నెలూ అవీ వంటయింట్లోకి తీసుకువెళ్లి ఇల్లంతా అంటు ముంగలం, క్షుద్రకొంప చేసేశావ్; జాతిని మంటకలిపావ్!" అన్నది.

సఖీ ఠాకురన్ వసారాలో అక్కడే కూలపడిపోయింది. చేతికందివచ్చిన కొడుకు చనిపోయాడన్న కబురువిన్నా ఆవిడ ఇంతకంటె క్రుంగిపోదు అనుకోవచ్చు!

"దరిద్రపు కొంపల్లోని ఆడపిల్లల్ని తెస్తుకుంటే రాత ఇలాగే ఏలా తేలుతుంది. కులీనులయిళ్లలో ఆచారవ్యవహారాలు వాళ్లు ఎలా నేర్చుకుంటారు? వాళ్లకి ఎవరు నేర్పుతారసలు? అంటూ సోమించుకున్నాక అంటు ఉన్నదీ పోయిందీ చూసుకోవక్కర్లేదూ! చూసుకున్నానులెండి, చూడు మెతుకులు నోట్లో వేసుకుంటాం కదా అనుకున్నాను. క్షుద్ర—ఎంగిలి, తిన్నట్లయితే కంఠం బిగుసుకుపోయి చచ్చేదాన్ని; పుణ్యం బాగుంది. ముట్టుకోలేదింకా!"

గోకుల్ భార్య చిన్నబోయినముఖంతో—'నానవది మతిలేక స్వర్ణని వచ్చి ఎందుకు తీసుకువెళ్తున్నా నా,! నేనేవెళ్లి యిచ్చివస్తే తీరిపోయేదికదా!' అని పశ్చాత్తాప పడుతూ నుంచుంది.

సఖీ ఠాకురన్ ముఖం కందగా చిట్లించుకుని, "ఈరా మేకులా ఇంకా నుంచున్నావేం అలా? వెళ్ళి ఆ గిన్నెలన్నీ తిని అవతల పారెయ్ మళ్ళీ పోయి తోముకుని రా. వంటిల్లు ఆవుపేడతో అలికి వెళ్లు మళ్ళీ దరిద్రపుకొంపలో పుట్టినవాళ్లు గొరికితే సంసారమంతా మంటకలిసిపోవటమే—" అంటూ రుసరుసలాడుతూ లోపలికి వెళ్ళిపోయింది. బయట యెండ చిరెత్తుతోంది!

ఆవిడ ఆజ్ఞప్రకారం పనులన్నీ తెముల్చుకునేసరికి ప్రొద్దు యెటవాలిపోయింది. ఏటికి మళ్ళీ స్నానానికి వెళ్ళేసరికి, ఎండ, ఆకలి, చాకిరీలతో ఆమె ముఖం వాడిపోయి ఉంది.

సాయంత్రమప్పుడు రేవులో చాలా నీడగా ఉంటుంది. అవతలిగట్టున ఉన్న బూరుగుచెట్లు ఎండకి నిగనిగలాడుతున్నాయి. ఏటిమలుపులో తెరచాప ఎత్తిన పడవ నదిలో తెడ్లు వేసుకుంటూ మలుపు త్రిప్పుతున్నారు చుక్కాని దగ్గర ఎవరో మనిషి ఎండకి బట్ట ఆరపెడుతూ నుంచున్నాడు. గాలికి ఆ గుడ్డ జెండా గుడ్డలా రపరప కొట్టుకుంటోంది. ఏటి మధ్యన ఎక్కడో తాబేలు ఒకటి తలదూర్చి మళ్ళీ బుడుంగ్ మంది.

ఏటిమీదనుంచి ఓ చిత్రమైన వాసనతో కూడిన చల్లటి గాలి వస్తోంది. నీటికాకి ఒకటి నీళ్ళలో మునిగి చేపను కరుచుకుని వచ్చి అవతలిగట్టున గెడుగుమర్రిమీద వ్రాలింది.

ఇలాంటప్పుడెప్పుడూ ఆమెకి తన చిన్ననాటిరోజులు గుర్తుకువస్తూ ఉంటాయి.

నీటికాకి, నీటికాకి! అది మళ్ళీ ఏటి మధ్యనున్న లంకమీదికి ఎగిరింది.

గోకుల్ భార్య కాసేపు ఆ నీటికాకికేసి చూస్తూ నుంచుంది. తల్లి ముఖం గుర్తుకొచ్చింది. తనముఖం చూసేవాళ్ళెవరూ లేరు—పుట్టింట్లో! తల్లి—ఆవిడ నూరేళ్లా నిండిపోయిందా, ఏమన్నా నా? పుట్టింటివైపువారిలో గంజాయిదమ్ముగాడు తమ్ముడొక్కడున్నాడంతే! వాడు ఎప్పుడెక్కడుంటాడో ఎవరికీ తెలియదు. నిరుడు నవరాత్రికి ఇక్కడికి వచ్చి నాలుగురోజులున్నాడు. తాను చాటుగా అప్పుడప్పుడు పెట్టె అడుగున దాచుకున్న బేడా, పావలా అతడికిస్తూ ఉండేది. తర్వాత హఠాత్తుగా ఒకనాడు మాయమైనాడక్కడినుంచి వెళ్లే ముందు పట్టుకెళ్లలేక ఓ కాబూలీవాని దగ్గర పట్టు చీరియం, కొత్తపుస్తకంలో బాకీ గారిపేర వ్రాయించాడని వార్త తెలిసింది. అక్కకి పెద్దగ నెయ్యింది పుట్టింటివైపు నుంచి అన్నీ దిక్కులే అన్నీ తలవంపులు తెచ్చిపెట్టేవే! ఆ వెళ్లటం వెళ్లటం ఏమైపోయాడో మళ్ళీ అయిపులేడు తమ్ముడు.

సంధ్యవేళల కాసేపు పనిలేకుండా తీరుబడిగా కూర్చున్నప్పుడల్లా దేశాలపాలైపోయిన, నిస్సహాయుడైన తమ్ముడే ఆమెకి గుర్తుకొస్తూ ఉంటాడు. నిర్జనంగా ఉన్న మైదానంలోని దారివైపు చూస్తున్నప్పుడు ఇల్లూ వాకిలీ లేని తన తమ్ముడు ఒక్కడూ ఆ దారినే నీడల్లో ఎక్కడికైనా వెళ్లిపోతున్నాడేమో అనిపిస్తూ ఉంటుంది. రాత్రిళ్ళయినా తలదాచుకుందుకు తావులేదు. ముఖం చూసేవాళ్లెవరూ లేరు.

గుండెల్లో ఏదో గుబులు పుట్టుకొస్తుంది. కళ్ళలో నీరు నిండి, ఆ ఏటిలో నీళ్లూ, మైదానం కొస, బూరుగుచెట్ల మలుపులో తెరచాప ఎత్తిన పడవ—అన్నీ బూచులు బూచులుగా అస్పష్టంగా కనిపిస్తాయి.

[ఇంకా ఉంది]

అంతరాంతరాలు

యన్. ఆర్. నంది

ఒక్క చేతిసంచితో హడావిడిగా మెట్లెక్కి లోపలికివస్తున్న జానకిని చూసి పుస్తకం చదువుతున్నదల్లా చప్పున పరుపుదిగి ఆమెను రెప్పవెయ్యకుండా దిగ్భ్రమతో ఆపాదమస్తకం చూడ మొదలు పెట్టింది శారద. జానకి చిరునవ్వుతో తిన్నగా స్నేహితురాలిదగ్గరకు వెళ్లి—

"అ కేవిటే, అలా శిల్పపరీక్ష చేసేస్తున్నావ్? నేనే జానకిని" అంది.

శారద ఓ గుటక వేసి, కనుబొమలు ముడి పడుతుండగా అంది:

"అవును నువ్వేలే; కాని ఏవిటీ రావడమని?"

"ఏం మామూలుగానే వచ్చాను."

"చలపతి ఏడీ?"

"మూడు నాలుగురోజుల్లో వస్తారు కొత్త యిల్లూ గిల్లూ ఏర్పాటయాక" అంటూ పరుపుమీద కూచుని సంచిలో బట్టలు బయటకు తీయ మొదలుపెట్టింది.

"ఆ కేం? ఇక్కడఉద్యోగందొరికిందా?" అని తనూ జానకిపక్కన కూచుంది.

"ఆయనకొక్కడు; నాకు"

శారద ఆశ్చర్యపోతూ అడిగింది "నీకా! ఎక్కడ?"

"గర్ల్ స్కూల్లో."

"జీతం?"

"ఒక పెద్దనోటు."

"భేష్!" అంటూ శారద నవ్వడం మొదలు పెట్టింది.

ఈ వెకిలినవ్వు జానకికి అర్థంకాలేదు. స్నేహితురాలివైపు తేరిపారచూస్తూ అంది: "ఏవిటా నవ్వు?"

శారద ఆగకుండా ఆ నవ్వులోనే "నీ ఆదర్శాలకి కలిగినపాట్లు చూస్తూ వుంటే నవ్వురాక మరేం చేస్తుంది?" అంది.

"నా ఆదర్శాలకేం భంగం రాలేదులే— అవి అలానే వున్నాయ్."

"ఎక్కడో?"

"ఎవరెస్టుశిఖరాలమీద కొని తమరేం చేస్తున్నారని?" అని ఎదురు ప్రశ్న వేసింది జానకి.

శారద సగర్వంగా సమాధాన' మిచ్చింది: "పుస్తకాలు పఠిస్తున్నాం"

"కాలక్షేపానికా?"

"కాదోయ్; విజ్ఞానానికి."

"అయితే దానిని ఎప్పుడూ కూడబెట్టు కోవడమేకాని, సద్వినియోగంచేసే దెప్పు డైనా వుందా మరి?"

"చెయ్యాలి."

"ఎలా? ఈ విధంగా స్ప్రింగుపరుపుల మీద పడుకొని నావెల్సు చదువుతూనా?"

శారదకు సరైన సమాధానం చప్పున స్ఫురించలేదు. ఒక్కసారి పరికీలనగా జానకి వేపు దృష్టిని తిప్పి వెంటనే అసహాయంగా చేతివేళ్లమీదికి మరల్చుకొంది! చిన్నతనం నించి సోదరికంటె ఎక్కువ సన్నిహితంగా తిరిగిన జానకిదగ్గర పట్టుదలకైనా అబద్ధ మాడలేదు! ఈ మౌనం తన దౌర్బల్యాన్ని మరింత పట్టియిచ్చినట్టవుతుందని మెల్లగా అంది:

"నిజమే జానకీ! కాలేజీలో చదువు నేటప్పుడు ఎన్నో ఆదర్శాలు వుండేవి. ఎప్పుడూ మన సమస్యలగురించే చర్చించు కునేవాళ్ళం కాని ఆ 'ప్రపంచం'నించి బయటికి వచ్చాక ఏవిటో నేనూ మామూలు వ్యక్తుల్లాగే ఏదో బ్రతికేస్తున్నానా అనిపిస్తోంది."

జానకి విచిత్రంగా నవ్వి "రాసుల్లావున్న ధనం మనిషికి సోమరితనాన్ని నేర్పిస్తుం దంటారు"అంది.

"ఈడబ్బువల్లే నాకు బద్దకం ఏర్పడిం దంటే నేను నమ్మను" అని ఓ నిట్టూర్పు విడిచి అంది: "కాని ఎందుకో జీవితం నిస్సారంగా వున్నట్టుంటుంది! ఇంతకుముందు సాయంకాలమప్పుడలా గోదారొడ్డమ్మటే నడచిపోతూవుంటే ఎంతో హాయిగా వుండేది..."

"ఇప్పుడు?"

"...అందులో హాయంతా నేనే అనుభవించేశానా అనిపిస్తోంది"

"ఈ రెండేళ్ళల్లో జీవితం అంతి చప్పబడి పోయిందటే?"

"ఇలావుంటే కొన్నాళ్లకి పిచ్చెత్తేటట్టు కూడా వుంది."

"అప్పుడు 'విశాఖపట్నం' వెళ్లొచ్చులే గాని, మీ ఆయనేరి?"

జానకంత వేగంగా శారద తనమూడ్ ని మార్చుకొని ఆ ప్రశ్నకు సమాధానం యివ్వ లేకపోయింది. క్షణం మౌనం తర్వాత అటు చూస్తూ...

"బయట ఆఫీసుగదిలో వుంటారు" అంది.

"వ్యాపార మెలావుంది?"

ఈ రెండో ప్రశ్నతో శారదకు చిరాకే సుకొచ్చింది. "ఓ! దివ్యంగా! ఇరవైనాలు గ్గంటలూ ఆయన కదే ధ్యాసైన పుడు, వ్యాపారం దివాలా ఎలా తీస్తుంది?" అంది.

"ఛ! ఏవిటామాటలు!?"

"లేకపోతే ఏవిటే? తను రొంత వ్యాపారసుడయితేమటుకు పగలూ రాత్రీ ఒకటే కుస్తీయా దాంతో!?"

"బాగుంది! ఎవరి పనిపాటలు వాళ్లు చేసుకోకపోతే ఎలా సాగుతుందే మరి ఈ జగన్నాథరథం?"


"పని!" శారద కంఠం వొణికింది. జానకివేపు చూడకండా ఎక్కడో గోడల అవతలకి చూస్తూ—

"కనీసం ఒక్క క్షణమైనా యిలావచ్చి చూసేపాటి తీరుబాటు వుండదా, పోనీ? మొదట్లో ఓనెలదినాలు ఏం మాట్లాడారో అంతే! తర్వాత ఆయనా మహాసముద్రంలో, నేనీ ఒంటిస్తంభం మేడలో, ఇది మరింత క్రుంగదీస్తోంది నన్ను" అంది.

ఈ మాటలు వినడంతో జానకి, దంపతు లిద్దరిమధ్యా చిన్న చిన్న అడ్డగోడలు లేస్తున్నాయని వూహించింది. ఒకక్షణంసేపు శారదని పరీక్షగా చూసి ధైర్యం చెప్పే విధంగా అంది.

"అస్తమానం అదే ఊహించుకొంటూ కూచుంటే మరింత క్రుంగిపోతావ్ శారదా! నీ మనస్సు నీకుంది. దాన్ని నీమటుకి నువ్వే తృప్తిపరచుకోడానికి ప్రయత్నించు. అప్పుడు నీకిలాంటివూహాలే రావు..."

శారద ఈ మాటలతో మరింత చలించింది. ఆమె గుండెల్లో మండుతున్న అగ్నిపర్వతం బ్రద్దలయే సూచనలు ముఖంలో స్పష్టంగా అగుపించేసరికి, ఈ వాదనకి



రాజమండ్రివద్ద గోదావరి దృశ్యం.

(పన్నెండేళ్ళ కొకసారి వచ్చే పుష్కర పుణ్యకాలంలో గోదావరిలో కోటి ప్రజలు స్నానంచేసి పునీతులౌతూ ఉంటారు.
ఈ కాలంలో పుష్కరాలకు రాజమండ్రివద్ద గౌతమీవాహిని, తైర్థిక మహాజనవాహిని సంగమిస్తాయి.)

★ అంతరాంతరాలు ★

అక్కడికెళ్ళి షెల్ఫ్ తెచ్చి తను తెరిచి పోవడం ఉత్తమంగా తోచింది జానకికి. వెంటనే పరుపుమీదినించి లేచిపోతూ——

“పడ్డే సాయంకాలం మాట్లాడుకుందాం గాని, ప్రస్తుతం నేను త్వరగా స్కూల్‌కి వెళ్ళాలి” అంటూ టవల్, తీసుకొంటూ బాత్ రూమ్ వేపు వెళ్ళిపోయింది.

కొంత స్థిమితపడి నిశ్చలత్వాన్ని పొందుతున్న కొలనులో చిన్న చిన్న రాళ్ళుపడి అలలు లేచాక, మళ్ళీ పూర్వస్థితిని పొందేందుకు కొంతకాలం పడుతుంది. అయినా రాళ్ళుపడినప్పుడల్లా అలలు లేవడం దానికి సహజం. అదేస్థితిలోవున్న శారద మనస్సు జానకి రాకవల్ల పూర్వగాథలతో, బాధలతో కకావికలమైంది. పెళ్ళికాకముందూ అయాకా తనభావాలూ, వాటికి చేకూరుతుం డనుకొన్న సఫల్యత తల్చుకొంటూ కొంత సేపు అదేపనిగ ఆలోచించుకోవడం తప్ప మరోదారి లేకపోయింది. ఆలోచించే కొద్దీ బాధ ఎక్కువ, బలం ఎక్కువవుతుంది. నిమిషాలు గడిచాక, తన కర్తవ్యం ఏమిటో తను నిర్ణయించుకొంటూ, తనమీదతానే సానుభూతి చూపుకొంటూ, కళ్ళు మూసుకొంటూ పడుకుంటూ అనుకోకుండా అలాగే నిద్రపోయింది.

జానకి స్నానంచేసి స్కూల్‌కి వెళ్ళిపోయినా కూడా శారద అలాగే కదలకుండా పడుకొనేవుంది. అంతలో లోపల గదిలోనించి కృష్ణ వచ్చి——

“ఎవరు, శారదా వచ్చారు?” అనడిగాడు.

శారద ప్రశ్నకు జవాబివ్వలేదు. సిగ్గూ దుఃఖం నిండిన పరుపుమీదినించి లేచిపోతూ ముక్తసరిగా అంది:

“జానకి.”

“స్కూల్‌కెళ్ళిందా?”

“ఉందో వెళ్ళి. నాకింకా ఉద్యోగం దొరికిందట.”

“ఏమ్! నిన్న అనుకున్నాను, చిన్నదికదా అయితేనేం రానీ చెప్పుకుందామనుకున్నాను!” అని తేలిగ్గా “ఎందుకో మరి...”

అతని మాటలు పూర్తికాకుండానే అడ్డుపడి... “చేస్తున్నారుగా! యీ చిన్నదానికి ఉద్యోగం కొంతా యిస్తా?” అంది, చిరాకూ, కోపం ధ్వనించే స్వరంతో.

కృష్ణకి నవ్వొచ్చింది. “నన్నేమంది నవాబుగారికి కోపం” అంటూ మరింత నవ్వాడు.

శారదకు నిజంగా కోపం, దుఃఖం ముంచుకొచ్చాయి. ఎత్తిపొడుపుగా అంది: “అయ్యో! నాకెందుకు కోపం! ఏదో తేరి

గోరి లక్షాధికారిని పెళ్ళాడిన పేదదాన్ని. మా కొళ్ళదగ్గర పడుండటే కోపాలూ, తాపాలూనా యిహా?"

కృష్ణ నవ్వుకున్నాడు:

"[illegible] నిన్నేమన్నానని అంతగా [illegible], కావనా?"

"[illegible]! నా [illegible], [illegible] కను [illegible] ఉన్నారు, ఈ [illegible] కొంపలో[illegible]?"

కృష్ణ మళ్ళీ తన [illegible] పట్టాడు. [illegible] "[illegible]! [illegible] [illegible] ఈయింటికి [illegible]? అయితే [illegible] [illegible]!" అన్నాడు, [illegible] [illegible] ఉన్నాడు.

"[illegible]?"

కృష్ణ [illegible], [illegible] "[illegible]! [illegible], [illegible] [illegible] కల [illegible]. [illegible] [illegible]

మాంథ "డైమండ్ నెక్లెస్..." అంటూ చెప్పబోతున్న వాడిని మధ్యలో ఆపేసి—

"డైమండ్ నెక్లెస్! నాటికో నాకు సౌభాగ్యాన్ని కొనాలా?" అంది.

"[illegible]......[illegible] [illegible]?" అన్నాడు మంతగా [illegible] [illegible].

[illegible] అంది: "[illegible] [illegible]... [illegible] [illegible] [illegible]. [illegible]! [illegible], [illegible] [illegible]! [illegible] [illegible]..."

కృష్ణ [illegible] [illegible]. [illegible] [illegible]..." [illegible]! [illegible] [illegible] [illegible]. [illegible] "[illegible] [illegible]! ఈ అంతకప్పటంలో నాకు

బంగారుగొలుసులతో వేసే [illegible] సరించారా?" అని అరచింది.


కృష్ణ తమాయించుకున్నాడు. ఇలాంటి సంఘర్షణలు ఈమధ్య మరీ [illegible] [illegible] [illegible] [illegible] మరింత [illegible] కృష్ణ తెలుసుకున్నాడు. ఈ [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] [illegible] [illegible] [illegible]!

2

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]—

"[illegible] [illegible] -



పాపికొండల నడుమ ప్రవహించే గోదావరి దృశ్యం.



అంతరాంతరాలు



"మీదైనా కొత్తకథని పట్టే ప్రయత్నమా?" అంది నవ్వుతూ.

చలపతి లేచి కూచుని సన్నగా నిట్టూర్పు విడుస్తూ "కాదు, జీవితంగురించి ఆలోచిస్తున్నా" అన్నాడు.

జానకి చప్పున వెనక్కి తిరిగి విసురుగా అంది: "అబ్బ! ప్రతిక్షణం అదేజపమా? ఎందుకండీ మీర స్తమానం అలా బాధపడుతుంటారు? మనిద్దర్లో ఎవరు సంపాయిస్తే ఏముంది?"

"అది కాదు జానకీ! నేను మగాణ్ణయి వుండికూడా నిన్ను కష్టపెట్టి నేను నీ సంపాదనమీద బ్రతికడం—"

"నా సంపాదన మీ సంపాదన అని వేరెందుకు చేస్తున్నారు? మీకు నచ్చిన వుద్యోగం మీకు దొరకలేదు, మీరు కూచున్నారు. అంతవరకు ఇంటి బాధ్యత ఎవరు చూస్తే నేం?"

"అయితే నాకు ఉద్యోగం దొరికినవెంటనే నువ్వు మానేస్తావా?"

"ఎందుకు మానెయ్యడం?"

"నువ్వు కష్టపడ్డం..."

"ఏం నేను మనిషిని కానంటారా? అయినప్పుడు కష్టపడ్డంలో తప్పేముంది?"

"అయినా—" అంటూ నసిగాడు.

"ఏమిటో మీ వాదన! నాకు తెలుసు ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం మీరు భరించలేరు" అంది జానకి ఎత్తిపొడుపుగా.

"నా ఉద్దేశం అదికాదు జానకీ!"

"మీరామాటని ఉద్దేశపూర్వకంగా అని వుండకపోవచ్చు. కాని ఒక్కసారి ఆలోచించండి: మన ఆర్థికపరిస్థితి అంతంతలో వుంది. మన దగ్గర కొద్దో గొప్పో విజ్ఞానమనేది డిగ్రీరూపంలోవుంది. దాన్ని ఏదో విధంగా సద్వినియోగం చేస్తే ఇటు మనకి భుక్తి గడుస్తుంది. అటు ఉడతాభక్తిగా కొందర్ని విద్యావంతులుగా చేసినవాళ్లమూ అవుతాం..." ఈ మాటలు అంటూవుంటే చలపతి ముఖం వాలిపో మొదలుపెట్టింది.

ఇదికని పెట్టిన జానకి దస్తూరి మాటగుర్తి చేతిలోవున్న పైకాన్ని అతని కందిస్తూ "సరే...ఇది తీసుకోండి" అంది.

"ఏమిటి ?"

"ఈనెల జీతం."

చలపతి లెఖ్ఖ పెట్టుకున్నాడు. నూట పది. ఆ డబ్బుని చూడగానే అతని కెంతయినా చిన్నతన మనిపించింది. ఈ స్థితిలో తను బాధపడుతూ ఏమాట అన్నా జానకి మనసు కష్టపెట్టుకుంటుందని మౌనంగా వాటిని మడిచి టేబిలుమీద పెడుతూ బయట తోటపని చూసుకొనేందుకు వెళ్ళిపోయాడు.

తోటలోకూచుని మొక్కలకి గొప్పుతవ్వుతున్నాడేగాని అతని మనస్సు మనస్సులో లేదు. అస్తమానం ఇదే యోచన. తనలో ఏం గొప్పలున్నాయని జానకి తనని పెళ్లాడింది? ఆ వివాహం జరుగుతున్నప్పుడైనా ఎందరనుకోలేదు: 'ఆఁ! నాల్రోజులు అనుభవించాక దానికే తెలివొస్తుందిలే!' అని. కటిక దారిద్ర్యాన్ని అనుభవించాకకూడా జానకి తన అభిప్రాయాలు మార్చుకుందో లేదో ఆ స్నేహితులు అంతగా పట్టించుకోలేదు. తనలో ఏవో పెద్ద కవితాహృదయం వుందట, దానిని చూసి మూర్ఛిల్లి, సాష్టాంగపడి, సన్నిహితం కావాలనుకొంది. కాని శారదకీ, తను జానకికి కనిపించినట్టే కనిపించాడు. ఆమెకూడా తనని మొదట్లో జానకిలానే ప్రేమించి, ప్రణమిల్లి చివరికి తన లేమినిగూర్చి తెలుసుకొని తన ఛాయలకు రాలేదు. కాని జానకి తన బ్రతుకుని తెలుసుకొనికూడా—తనవైపున చేరింది. ఈ స్థితిలో తనని పోషిస్తోంది కూడా! ఇన్నాళ్ళ అనుభవంలోకూడా తనని అసహ్యించుకోవటం లేదంటే...నిజంగా ఆమెకు ఎలా కృతజ్ఞత చూపాలో అతనికి అర్థంకాలేదు! అతని కళ్ళలో అశ్రువులు తిరిగాయి. వాటిని ఒత్తుకొంటూవున్న సమయంలో దూరంగా ఎవరో వస్తున్నట్టు ఎండుటాకులు సందేశాన్ని మోసుకొచ్చాయి.

అతను తలెత్తేలోపునే శారద అక్కడ ప్రత్యక్షమయింది. చలపతి లేని నవ్వు తెచ్చుకొని, లేచి నిలబడుతూ—

"ఎవరు, శారదా!!...ఓహ్హో! ఏమిటీవాళ ఇలా వచ్చేశావ్?" అన్నాడు.

"ఏం రాకూడదా?" అంది నిండుగా భుజాలమీదికి పైట తీసుకుంటూ.

"అబ్బె! ఈ 'ఆనంద కుటీరం'లో సర్వులకీ నిత్యస్వాగతం" అని ఆమెను ఎగాదిగా చూస్తూ హేళనగా "అది సరేగాని, ఈ మధ్య...నీ...బరువు...ఎంత హెచ్చాయి వుంటుందంటావ్?" అన్నాడు.

శారద కిసుక్కున, తనూ హేళనగా నవ్వేస్తూ అంది: "బాబూ! ఏమియుండదోయ్! మనసులో దిగులు ఇలా చేసేస్తోందిగాని—!"

"దిగులా! లక్షాధికారి అర్ధాంగికి?" అన్నాడు మరీ వెటకారంగా.

"లక్షాధికారి అర్ధాంగి సైతంలో సుఖపడిపోతున్నాననా?"

"అదేం? ఏరి కోరి. చేసుకున్నావుగా?"

"అందుకే కొత్తనవ్వేటందుకు ప్రయత్నిస్తున్నాను."

"తప్పు! వెటేస్తున్నావను."

"సరే! అలా అనుకున్నా తప్పులేదు."

అంతలో జానకి లోపలినించివస్తూ స్నేహితురాలిని చూసి "ఇదేవిటే — నువ్వెప్పుడు వేంచేశావ్?" అంది.

"ఇప్పుడేగాని, ఇదేమిటి మీ రిద్దరూ తీరుబాటుగా కూచుని యిలా మహారణ్యాలు సృష్టించేస్తున్నారు?" అంది, తోటనంతటినీ కలియచూస్తూ.

"ఇది మహారణ్యాలు కావే: జీవితాలూ, పరిష్కారాలూనూ" అంది జానకి గర్వంగా.

"వెనకటికి ఎవరో అలానే అనేవారటలే! ఈ వంకాయలు పండించడం, చిక్కుడు పాదులు వెయ్యటం జీవితాలూ, పరిష్కారాలూనా? దాని బదులు నిజం చెప్పకూడదు?"

"నిజమేమిటి?" అంది జానకి అర్థంకాక.

చలపతి మధ్యను కలిగించుకున్నాడు.

"శారద భావం నీకు అర్థంకాదు జానకీ. మనం మన పేదరికాన్ని ఎందుకు ఒప్పుకోగూడదూ అని తన ఎత్తిపొడుపు.

"ఎత్తిపొడుపేముంది, నిజం చెప్పమంటున్నా.

"అది నిజమే. అయితే ఆ పేదరికాన్ని చూసి నీలా మేం జడిసి దూరంగా పరుగెత్తిపోం" అంది జానకి.

శారద, భుజాలు తడుముకొన్నట్టు "నాకు పేదరికమంటే ఏం భయంలేదు" అంది.

"అది నీ భ్రమ. కానిదబ్బుకు నేటప్పుడు నువ్వు చెప్పే అభిప్రాయాలకీ, కృష్ణగారిని వివాహమాడ్డానికీ ఎక్కడైనా సామ్యం వుందీ?"

"ఉంది. ఆయన్ని నేను హృదయపూర్వకంగా ప్రేమించాను."

"మరో భ్రమ."

మళ్ళీ చలపతి మధ్యకొచ్చాడు: "అబ్బ! ఇప్పుడా వాదనలెందుకు జానకీ! తనేదో సరదాగా కొంతసేపిక్కడ కాలక్షేపం చేద్దామని వస్తే నువ్వు—"

అతనిమాట పూర్తికాకుండానే జానకి

అంది: "రెండుమూడు రోజులలో ఇక్కడా దానికి సుఖం కనిపించదు."

"ఇప్పుడెంతో మహా కన్పిస్తున్నట్టు" అంది శారద హేళనచేస్తున్నట్టు.

జానకి దలపతి ఒకరిమొకరొకరు చూసు కున్నారు. తర్వాత దలపతి చిన్నగా నవ్వేస్తూ–"శారదకింత అతిశయం ఎలా పుట్టు కొచ్చిందో అర్థంకావటంలేదు" అన్నాడు.

"కృత్రిమ వాతావరణంలో యిమిడలేక దాని మనస్సలా వ్రతిలలేస్తోంది" అంది జానకి. శారద మాటమధ్యలో యేదో అన బోతూవుంటే ఆపి తనే తిరిగి మాట్లాడుతున్నట్టు "ఇక ఆర్గ్యుమెంట్ అనవసరంగాని, కృష్ణ గారుకూడా వస్తారన్నావే, ఏరీ?" అంది.

"రాలేదు" అంది ముక్తసరిగా శారద.

"ఏం?"

"మీ నిరాడంబర జీవితం చూసే తీరిక ఆయనకు లేదేమోమరి!"

జానకి మనస్సు చివుక్కుమంది. శారద ఈమాట హృదయపూర్వకంగా అనిపుండదు. కాని ఆ క్షణంలో తను ఓడిపోతున్నాననే భావంతో అలా అనేసివుంటుందని జానకి గ్రహించకపోలేదు. అందుకే ఆమెకు వివ రించేవిధానంలో–

"మాది నిరాడంబరజీవితమని ఎక్కడా దండోరా వేసుకోవడంలేదే! ఉన్న దాంట్లోనే పొందగలిగినంత సౌఖ్యాన్ని పొందుతూ, ఆత్మవికాసంకోసం జీవితాన్ని సద్వినియోగం చేసుకోవడం మన ధర్మం అందుకే నువ్వన్న ఆ మహారణ్యాన్ని చూసు కొని స్రష్టలుగా, ద్రష్టలుగా మా కెంతయినా మానసికతృప్తి కలుగుతుంది. అది కలిగినపుడే కృతకసౌఖ్యాలలో ఆనందించ బోతాం.. ఈ విషయం నీకు మరికొన్నాళ్ళ అనుభవంమీదగాని తెలిసిరాదు."

"గొప్ప సైకో–ఎనలిస్టువి నువ్వు జీవిత సత్యాలని నిర్వచిస్తూంటే నాలాంటి వాళ్ళకు విప్పవ్వద్దో కాదు యిప్పుడే తెలిసి వస్తోంది. వస్తా. వెళ్ళొస్తానోయ్ దలపతీ" అనుకుంటూ చరచర వెళ్ళిపోయింది.

శారదకు కోపం వచ్చిందని జానకి గ్రహిం చకపోలేదు ఆమె వెళ్ళిపోతూవుంటే నిస్సా రంగా ఒక్క నిట్టూర్పు విడవడం తప్ప మరేం చెయ్యలేకపోయింది.

"శారదతో నువ్వంత సీరియస్ గా మాటాడ కూడదు జానకీ. అవివి అనవి అర్థ్థక రాలు..."

జానకి సగంలో అందుకుని "అర్భకు లలా వుండరు. దానికి పిదరికమంటే తగని భయం కాలేజీలో చదువుకు నేటప్పుడు వివాహం గురించి ఎన్నెన్ని చెప్పేదనుకున్నారు! ఈ తెమసంస్కారంగల తన స్నేహితుల్లో ఎవరినైనా ఒకరిని పెళ్ళిచేసుకుంటాననేది–

నాళ్ళు కటకదరిద్రులైనా. కాని ఎక్కణ్ణుంచో వచ్చిన ఆఫీసర్ కృష్ణను చూడగానే మనస్సు మార్చుకుంది" అంది.

"ఆవిషకు బుద్ధి చెప్పాలనేనా నువ్వ నన్ను చేసుకున్నది?"

జానకి దలపతివేపు చూసి నవ్వుతూ "కాదు, దలపతిలో కొన్ని వెలుగులు కని పించాయి" అని లోపలికి వెళ్ళిపోయింది.

3

రోజులుగడిచేకొద్దీ శారదకు జీవితం మీద విరక్తి కలగనారంభించింది. ఈ విర క్తితో ఆమె ప్రతీవిషయాన్నీ అలక్ష్యం చేయ మొదలుపెట్టింది. పర్యవసానంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. అది తిన్నగా టైఫాయిడ్ లోకి దింపవలసింది కాని కృష్ణ సమయానికి సరైన చర్య తీసుకోవడంవల్ల బ్రతికి బయటపడింది. శారద యిదంతా కావాలని తెచ్చిపెట్టుకుంటుందని కృష్ణ గ్రహించకపోలేదు. ఆమెను ఎన్నోవిధాల సంతోషపెట్టబోయాడు. ఆమె కేం కావా లన్నా సమకూర్చేందుకు సిద్ధపడ్డాడు. కాని అతని ప్రయత్నాలనీ, ప్రేమనీ శారద నటనఅనికొట్టిపారెయ్యడంతో కృష్ణ మనస్సుకూడా కొంత కాలానికి విరక్తి చెందింది. అయితే ఈమధ్య పనుల ఒత్తిడివల్ల మరీ నిర్లక్ష్యం చెయ్య డంతో శారద అనిశ్చలస్థితి పరాకాష్ఠ నందుకొని ఎటో తేల్చేసుకోవా లన్నంత వరకూ వచ్చేసింది.

ఒకనాడు కృష్ణ ఆఫీసుగదిలో వ్యాపా రానికి సంబంధించిన విషయాలు ఏజంట్లతో మాటాడుతున్నప్పుడే సరిగా శారద ఒకసారి

★ అంతరాంతరాలు ★

యింట్లోకి వచ్చిపోమని కబురు పంపించింది. కృష్ణ కొంత విసుక్కుంటూనే లోపలికి వచ్చాడు. వస్తూనే గుమ్మంమీద నిలబడ్డట్టు—

"ఎందుకు పిలిచావట?" అన్నాడు.

"అవును, కూచోండి" అంది శారద, అతని వేపు తిరిగి చూడకుండానే.

"నాకు టైంలేదు; అవతల బోలెడు పనులున్నాయ్. చెప్పేదేదో త్వరగా చెప్పేస్తే—"

శారద ఒక్కసారి అతనివేపు చూసి ముఖం తిప్పేసుకొంటూ "మీకు జీవిత మంతా వుండే పని లేదేటో నాకు తెలుసు."

కృష్ణకి మండుకొచ్చింది.

"అందుకే చెప్తున్నా" అన్నాడు ఊర్ధ్వస్వరంలో.

"సరే మీకంత తొందరగావుంటె వెళ్ళిపోవచ్చు."

"మాటకి ముందుకోపం..."

"అయ్యో నాకెందుకు కోపం! ఏకో లక్షాధికారిని ఏరికోరి వివాహం చేసుకున్న పేదరాలిని" అంది హేళనగా.

"పోనీ అలా అని పడుండకూడదు? ఇలా ఎత్తిపొడుపు లెందుకు?"

"ఎత్తిపొడుపులు! అంత తెలివితేటలే వుంటే—"

ఆవిడ మాటలు పూర్తికాకుండానే అర్ధోక్తిలో అంగుకుంటూ—"నన్ను నీ పాదాక్రాంతం చేసుకొని వుండేదానవ్!... ఇదిగో శారదా! నీకు చాలాకాలంగా చెప్పాలనుకుంటున్నాను! జీవితంలో మనం చెయ్యవలసిన పనులు ఎన్నో వున్నయ్. అవి కొనసాగించడం చేతకాక నీ అశక్తతకు బాధపడుతూ, ఎదుటివాళ్ళను తప్పుపట్టడం మంచిదికాదు." అన్నాడు.

"నా కర్తవ్యమేమిటో నాకు తెలుసు. నాకు మీలా డబ్బే జీవితమనే భావం లేదు."

"ఉండని నేననలేదు; కాని ఆ సౌఖ్యాల కోసంచి మన బాధ్యతల్ని మరచిపోమంటావ్!"

"నే నలా అనలేదు."

"మరచిపోయావ్ పాపం! వేసవికి నీలగిరి వెడదామన్నావ్. నీ సంతోషాన్ని నేను కాదనలేదు. కాని వ్యాపారంలో కొన్ని అనుకోని చిక్కులు రావటంవల్ల నేను రాలేకపోయాను. దాన్ని భూతద్దంతో చూసుకొని బాధపడ్డం, ఎదుటివాళ్లని తప్పుపట్టడంలో అర్థం ఏమిటి?"

"ఇన్ని విపరీత అర్థాలు తీసే శక్తి మీకే వుంది."

"నాకేకాదు; అంధునికీ, చెవిటివానికి కూడా తెలుస్తుంది. నీ కోసం నేను నీలగిరి వచ్చేస్తే వ్యాపారం ఎంతో దెబ్బతింటుంది. నేను దివాలా తీసేస్తానని భయంలేదు. కాని నా మూలంగా కొన్ని వందలమంది సర్వ నాశనమైపోతారు. మన ఒక్క సుఖంకోసం అందర్నీ ఫకీరుల్ని చెయ్యటం నాకు యిష్టంలేదు."

"దాని వెనక భావమేమిటో? డబ్బుకీ మీ ప్రాణానికీ లంకె అని తెలీడం లేదు?" ఆవేశపూరితకంఠంతో అంది.

కృష్ణ ఈ మాటల్ని సహించలేక "శారదా!" అంటూ అరిచాడు.

"అలా గొంతుక చించుకోవడ మెందుకు?... నేను కళ్లు మూసుకొని ఆ నాడు ఈ గోతిలో దిగాను. మీ రింత డబ్బు మనుషులూ, రాతియుగం విగ్రహాలూ అని తెలిసుంటె—"

కృష్ణ ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు. "శారదా! నోర్ముయ్—" అని అరిచాడు.

"నా మీద మీకేం అధికారం లేదు. కాస్త మీరూ నోరు తగ్గించుకొని మాటాడండి. మీలో యింత పశుత్వం వుందని గుర్తించగలిగితే—"

"నోర్ముయ్! శారదా! వెళ్ళిపో యిక్కణ్నుంచి."

శారద కోపాన్నీ, దుఃఖాన్నీ నిగ్రహించుకోలేకపోయింది.

"మీకేం హక్కులేదు నన్ను పొమ్మనడానికి నా యిష్టం వచ్చినట్టు వెళ్లగలను" అంటూ వెనక్కి చూడకుండా చరచరా వెళ్ళిపోయింది.

ఆ వెళ్లడం వెళ్లడం తిన్నగా జానకి యింటికి వెళ్లిపోయింది.

స్కూలునించి ఇంకా జానకి తిరిగి రాలేదు. చలపతి బయట తోటలో మొక్కలకి నీళుపోస్తున్నాడు.


ఇదే తోటనీ, తోటమాలినీ చూసి ఒకానొకప్పుడు మహారణ్యమంటూ, కటికదరిద్రుల కుటీరమంటూ కసితో, కోపంతో చిన్న చూపు చూసిన శారదకు అదే పర్ణశాల ఈ క్షణంలో ఆనందనందనంలా అగుపించింది. మాసిన మాసికల ఖద్దరుబట్టతో నిరాడంబరంగా తన సృష్టి మొక్కల తిరుగుతున్న చలపతి అప్పుడు శాంత తొలక మహర్షిలా అనిపించాడు

'జానకి నిజంగా ధన్యురాలు' అనుకుంది.

అయితే ఏ ఓపికతో జానకిని మహత్తర వ్యక్తిగా మార్చగలిగిందో ఆ ఓపికను శారద గుర్తించలేకపోయింది. తన బ్రతుకులో విరక్తి, నిరాశ వుందని ఆమె భావం ఆ భావం కలిగినప్పుడల్లా జానకి నిరాడంబర జీవితంమీద ఆమెకు ద్వేషం కలిగి రకరకాలుగా విమర్శించింది కాని అదే శారదలో విరక్తి, నిరాశా అంత్యస్థితికి వచ్చేసరికి ఆమె, తను తప్ప మిగతా ప్రపంచమంతా సుఖిస్తుందేమో అనుకుంది కాని అప్పటికీ తన నిజస్వరూపాన్ని, నిజతత్వాన్ని తెలుసుకోలేకపోయింది. జానకి కుటీరాన్ని చూడగానే అందుకే ఆమె కళ్ళనించి నీళ్లు కాలవలై ప్రవహించాయి.

లోపలికి వెళ్ళాలని వెదురు కర్రల గేటు తెరిచింది. కాని తన కా అధికారం లేదని దస్వాన మూసేసింది. ఏ ప్రదేశాన్ని ఇంత వరకూ పరమాణువుగా భావించి త్రోసి

(56-వ పేజీ చూడండి)



రమణయ్యగారు ఇంట్లో అడుగుపెట్టగానే భార్య ఒక కవరు చేతికందించింది. పైన తపాలాస్టాంపు చూడగానే అది గుంటూరు నుంచి వచ్చిందని తెలుసుకుని చాలా సంతోషించాడు. గుంటూరులోనే అల్లుడు కూతురూ ఉంటున్నారు. ఆ అల్లుడంటేనూ ఆ కూతురంటేనూ ఆయనగారికి తగని ప్రేమ. అందువల్ల ముఖంమీద చెమటయినా తుడుచుకోకుండా ఆతృతతో కవరు చించాడు. ఆయన చదువుతుంటే భార్య ఆతురతతో గడ్డంకింద చేయి వేసుకుని ఆయనగారి ముఖంలోకే చూస్తూకూర్చుంది. ఆ ఉత్తరంలో ఇలా ఉంది:

"మామగారికి, మీకొక ఉత్తరం వ్రాయబోయేసరికి మీ అమ్మాయి శాంత (పేరుకు మాత్రమే లెండి)! అడ్డుకొని చించివేసింది. ప్రస్తుతం ఈ ఉత్తరం నా భార్య అయిన మీ అమ్మాయికికూడా తెలియకుండా రాయవలసివచ్చినందుకు చింతిస్తున్నాను. మీరు వెంటనేవచ్చి విషయమేమిటో తేల్చుకోకపోతే పరిస్థితులు విషమించగలవని తెలియజేస్తున్నాను.

ఇట్లు,
మీ అల్లుడు
"వెంకట్రావు"

అది చదవగానే ఆయనగారు ఒక్కసారి అగ్గిరాముడయ్యారు. "ఛీ?.. ఈ ఆడజాతికి బుద్ధిలేదు" అని ఉత్తరం నలిపి నేలకేసి కొట్టాడు. ఆయన భార్యకి చదువు రాదు. దానిలోని విషయమేమిటో ఆయన చెపితే గాని తెలీదు. ఎవరిచేతనైనా చదివించుకోటానికి ఇంటి గుట్టు రచ్చకెక్కుతుందనే భయం. కాని ఆయన్ని కోపంలో ఉన్నప్పుడు పలకరిస్తే అగ్గిమీద గుగ్గిలంలా, చిటపటలాడతాడు. అందువల్ల కోపం తగ్గేవరకు ఓపికపట్టటం ఆమె నేర్చుకుంది.

రమణయ్యగారు సర్వీసయిపోయిన డి యిడి. అసిస్టెంటు. ఆయనగారికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురికీ పెళ్లి చేసేశాడు. ముగ్గుర్లోకీ చిన్నమ్మాయి 'శాంత' చాలా మంచిదనీ తెలివయిందనీ ఆయనగారికి మొదటినుంచీ ఆమెమీద చాలా ప్రేమ. అదిచూచి తక్కిన యిద్దరూ అసూయపడేవారుకూడా నంటే అది ఎంత ప్రేమో ఊహించుకోవచ్చు. అందువల్ల శాంత పెళ్లికి ప్రత్యేకంగా 'స్పెషల్' శ్రమజేసి — తక్కిన అల్లుళ్లతో పేచీ వస్తుందనే భయంతో కట్నంమాత్రం ఎక్కువ ఇవ్వకుండా — వెంకట్రావుకిచ్చి పెళ్లిచేశాడు. ఆయన ఆశించినట్లుగానే వెంకట్రావు చాలా మంచివాడు పాపం! శాంతిస్వభావుడే కాక సరసుడుకూడాను. అందువల్ల మామగారికి అతనిమీదకూడా కూతురిమీదలాగే అనురాగం ఏర్పడి పెరిగిపోయింది. అంత తెలివయిందనుకున్న కూతురుకూడా; అంత మంచివాడనుకున్న అల్లుడికి ఎదురు తిరిగిందనగానే ఆయనకి అసలు స్త్రీజాతిలోనే నమ్మకమే పోయింది. తనంటే ఎంతో గౌరవం మా పెళ్లుడు ఉత్తరంలో కనీసం నమస్కారాలనికూడా రాయలేదంటే — కూతురు పేరుకుమాత్రమే 'శాంత' అని ఎత్తిపొడిచాడంటే—పాపం! అతని కెంత కష్టం కలిగించిందోనని ఆయన

"హీరాలాల్"

గారు మరీ యిదైపోయారు. కూతురుమీద కోపం పెరిగిపోతూంది. "ఛీ!...ఛీ... అన్యాయంగా ఆ గంగిగోవులాంటివాడి మెడకి యీ రాక్షసిని కట్టాను" అని కూతుర్ని,—అసలు విషయం తెలుసుకోకముందే — నిందించుకున్నాడంటే ఆయనగారికి అల్లుడిమీదనున్న ప్రేమ అపారమనీ, అనన్యసామాన్యమనీ చెప్పకతప్పదని ఒప్పుకోవాలి. ఆ ఉత్తరం మరీ మరీ చదువుకుని అల్లుడి మనస్సెంత బాధపడిందో ఊహించుకోవాలనిపించింది. విసిరికొట్టిన నేలకేసి చూసే అది కనపడలేదు. ఎలా కనపడుతుంది? అది అప్పుడే భార్య తీసి బొడ్లో పెట్టుకుంటేను! భార్యని పిలిచి ఆ ఉత్తరం మళ్లీ చదువుకుని 'ఎంత మంచివాడు కాకపోతే నాకు కబురు చేశాడు?' అని అనుకుని తనకు తానే సంతృప్తిపడ్డాడు. అల్లుడిమంచితనాన్ని తలుచుకుని కూతురిమీద కోపాన్ని దిగమింగాడు. ఆయనకి కోపం తగ్గిందని రూఢి అయింతర్వాత మెల్లగా అడిగింది భార్య: "ఏమిటండీ విశేషాలు?...అమ్మాయి బాగున్నదట్నా?" అని. ఇంకేముంది? అంతమంచివాడనుకున్న అల్లుణ్ని ఒదిలిపెట్టి, కూతురి విషయం అడిగేసరికి ఆయనకి మళ్ళీ కోపం వచ్చింది. రావటంలో ఇంతకుముందుకంటే రెట్టింపుకోపం వచ్చేసింది.

"ఆ(...ఉంటుంది...నువ్వు లేవూ?... మహమ్మారిలా...అమ్మాయిట...అమ్మాయి... సిగ్గులేకపోతేసరి," అని కసిరివేశాడు.

ఆయన గొంతసలే పెద్దది. కోపంతో గర్జించేసరికి సింహాసనంనుండు లేచిలా ఆమె గజగజ వణికిపోయింది. ఆమె మనసు పరిపరి విధాల పోయింది. ఎలాగైతేనేం ధైర్యంచేసి మళ్లీ అడిగింది. "ఏమయిందండీ......ఏం తెచ్చింది?" అని. "ఏమయినా తెస్తుంది బుద్ధిలేకపోతే సరి" అంటూ గదిలో అటూ యిటూ తిరగటం మొదలుపెట్టాడు. ఆమెకి మళ్లీ మాట్లాడానికి ధైర్యం చాలలేదు. కొంతసేపటికి ఆయనే మొదలుపెట్టాడు. "ఏ ఆడదయినా పుట్టింటికి ఉత్తరం రాయమని మొగుణ్ని బలవంతం పెడ్తుంది. అల్లుడు ఉత్తరం వ్రాస్తే చించివేసే కూతురుంటుందీ? ... వెంటనేవచ్చి విషయమేమిటో తేల్చుకోమని రాశాడు" అని గదిలో తిరుగు

★ ఉత్తరం ★

ఉన్నవాడల్లా తల చేతుల్లో పెట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు. 'పుత్రవాళ్లు! ఏం భేదాలు వచ్చినయ్యో'నని పాపం! ఆమె గారు మరీ ఇదైపోయింది. భర్తని వెళ్లమని బలవంతం చేయటం మొదలు పెట్టింది. ఆయన పనులున్నాయంటే నాలుగురోజులు పోయిదాకా వేయండని సలహాయిచ్చింది. ఆయనగారు మాత్రం ముందుచూపున్నవాడు గనక ఎందుకైనా మంచిదని ఒక యాభై రూపాయలు జేబులో వేసుకున్నాడు. 'ఈ బండి దాటిపోతే ఆలస్యమవుతుంది. మళ్లీ ఏం ముంచుకు వస్తుందో'నని ఆయనగారు ఆదుర్దాకొద్దీ పరుగెత్తినట్లుగా నడవటం మొదలు పెట్టాడు. 'పంతులుగారు పరుగెత్తుతున్నారేం?' అని ఎవరయినా అంటే, అది వినిపించుకోకుండా 'ఇంకో టైమెంతుంది?' అని అడిగి సమాధానంకోసం ఆగకుండానే గబగబా స్టేషనుకి చేరుకున్నాడు. ఎలాగైతేనేం మొత్తంమీద బండి అందుకున్నాడు. బండిలో కూర్చున్న దగ్గర్నుంచీ 'అల్లుడు అలా ఎందుకు రాశాడా?' అని ఆలోచిస్తూనే ఉన్నాడు. కాని ఆలోచనాజనవృత్తాంతం ఆయనకి అణుమాత్రమయినా అంతుపట్టలేదు. ఎలా పట్టుతుందిసలు? అదంతా ఒక నాటకమయ్యేన! ఆశ్చే నాన్నక అదేమిటో ఇప్పుడే తేల్చేస్తాను.

పాపం! శాంతకి ఒకనాడు ఏం పనిఒత్తిడి తగిలిందో, కూరలో ఉప్పువేయటం మర్చిపోయింది. ఏతత్కారణంగా అన్నం రుచించకపోవటంవల్ల — వెంకట్రావు అంతకు ముందు హోటలుకూడు రుచిమరిగినవాడవటంవల్ల — 'ఇంతకంటే హోటలుకూడే నయం' అని రిమార్కు వేశాడు. అంతేగాని, కూరలో అసలు ఉప్పు వేయలేదనే విషయం అతని జిహ్వకి తెలిసిందేకాదు. ఏదో రుచి తగ్గింది అంతే అతనికి తెలిసింది. ఆమెని ఉడికించటానికి, అందరూ బాగుండదనే హోటలుకూడే నయమన్నాడు. ఇక శాంతకి రకరకాల ఆలోచనలు రావటం మొదలు పెట్టేనయ్. ఆ రావటంకూడా ఎలా వచ్చినాయనీ — చీమలకన్నంలోకి నీళ్లు పోయినప్పుడు చీమలు బయటికివస్తాయే — అలా వచ్చినయ్. 'అందరూ బాగుండదంటుంటే ఈయనగారు హోటలుకూడే నయమంటారేమిటి?' అని ఆమె ఆలోచన. నిజమేమిటో తెలుసుకోవాలి. అంటే తనుగూడా ఒకసారి హోటలుభోజనం రుచి చూడాలి. ఈ నిశ్చయానికివచ్చేసరికి వెంకట్రావు ఆఫీసుకి వెళ్లనే వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చినప్పుడు చెప్పవచ్చుననుకుంది. కాని అతడు వెళ్లిపోయిం తరువాతగాని గుర్తురాలేదు మళ్ళీ. ఆఫీసు నుంచి అయిదింటికి బయటపడి స్నేహితులతో తిరిగి చీకటపడితేగాని యింటికిరాడు. అందువల్ల ఏదో ఒకటి తనకుతానే తేల్చుకోవాలనుకుంది. పోనీ ఇవాల్టికి వంటచేసి రేపు ఆయన్నడిగి క్యారియర్ తెప్పించవచ్చుననుకుంది. కాని వెంటనే 'ఇలాఅయితే రోజూ లేటే అవుతుంద'నుకుని అనాడే వంటమానుకుని సాయంత్రంకాగానే డబ్బులూ క్యారియరూ ఇచ్చి పనిమనిషిని హోటలుకి పంపింది. 'ఆయనేమీ అనరు చాలామంచివారేగా' అని తనకుతానే సమాధానం చెప్పుకుంది. సరే! మంచివారే నయ్యా! వచ్చేసరికి ఏ ముఖాన ఉంటాడో? చెప్పగానే కోపంవస్తుందేమో! అనుకుంటుండగానే అతగాడు వచ్చాడు. ఆమె మెల్లగా 'లయ' చేసి అతనిఒళ్లో చేరి చెవులో చెప్పింది ఈ ఘనకార్యం. అతగాడు పకపకనవ్వి ఊరుకోవాలా? పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు. "ఏదో 'పులివెన్న జాతిజున్ను' తెమ్మనటం సహజం. ఇంతచిన్న కోరికకోరావేం భామామణీ" అన్నాడు. ఎంత తక్కువ కోరికయితే మాత్రం అలా నవ్వితే ఆమెకి చిన్నతనంగాదూ? అయితే ఏం? కోపంరాలేదు. అంతే చాలుననుకుని ఆమె సంతృప్తిపడింది. ఆమెను ఉడికించటానికి ఆమెచేసిన వంటకంటే హోటలుభోజనమే బాగుందన్నాడు. అంతటితో ఊరుకుంటే కావునా? తెల్లవారగానే ఉత్తరం రాయటానికి ఉపక్రమించాడు.

"ప్రియమైన మామగారికి-ఇక్కడ అంతా క్షేమము. మీ అమ్మాయికి స్వయంపాకంకంటే హోటలుకూడే బాగున్నదట. వంట చేసే యిబ్బందికూడా తప్పుతుందనే ఉద్దేశంతో హోటలునుంచి క్యారియర్ తెప్పించుకుంటున్నాం. వంట చేయటం భార్యయొక్క 'విధి'అని నేననుగాని ఆమె కోరిక తీర్చటానికి అవుతున్నందువల్ల-ఈ ఖర్చు నేను భరించలేను గనుక-మీరే నెల నెలా పంపిస్తారని ఆశిస్తున్నాను. వంట లేదు కనుక తీరికసమయంలో శాంతి ఏదైనా అల్లికలాంటివి నేర్చుకుంటే వాటిమీద వచ్చే ఆదాయం పోను తక్కిన ఖర్చు పంపించండి. లేక ఆ తీరికసమయంలో ఏమీ తోచక పత్రికలేవయినా తెమ్మంటే ఆఖర్చు గూడా మీరే భరించవలసి ఉంటుందని ముందుగానే తెలియజేయడమయినది.

ఇట్లు,
మీ అల్లుడు.

పరా: వీలైతే మీరుగూడా ఈ భోజనం రుచి చూడటానికి వచ్చి పోవలసిందిగా ఆహ్వానించటమయినది."

అని రాసి కవరు అంటించేసి ఆఫీసుకి పోయేటప్పుడు పోస్టు చెయ్యవచ్చునని జేబులో పెట్టుకున్నాడు. అతడు స్నానం చేసేటప్పుడు చిల్లర డబ్బులకోసం వెతికే శాంతకు ఆ వుత్తరం దొరికింది. పైన చూస్తే తన తండ్రిగారి అడ్రసుంది "స్నేహితులకి రాసే ఉత్తరాలు కూడా చూపిస్తాడే, తండ్రిగారికి రాసే ఉత్తరం చూపించకుండా ఉండటానికి ఏముంటుంది?" అని శాంతికి ఆలోచన పడింది. భార్యగా తనకు హక్కున్నదని ధైర్యం తెచ్చుకుని కవరు తెరిపించింది. చదువుతుంటే తనకికూడా నవ్వు వచ్చిందిగాని చదవటం పూర్తికాగానే కోపం వచ్చింది. ఆ ఉత్తరం చేతులో పట్టుకుని గబగబా అతని దగ్గరికివెళ్లి "ఏమిటండీ ఈ వ్రాతలు? మంచీ చెడూ, గుట్టూ రట్టూ-ఏమీ తెలియక్కరలేదూ?" అంటూ రెండు ముక్కలుచేసి నేలకేసి కొట్టింది. ఆ ఉత్తరం ఆమె చేతిలో పడిందని గ్రహించి తేలు కుట్టిన దొంగలాగా ఊరుకునేసరికి ఆమె కోపం మరీ ఎక్కువయింది. "ఏదో దుర్బుద్ధి పుట్టి ఒకపూట తెప్పిస్తే, ఎప్పుడూ తెప్పించమన్నానా?... తెప్పిస్తే మాత్రం రాయాలిటండీ..." అని ఏమేమిటో సాగదీసింది.
"ఏదో ఇలాంటి కోరికలే కోరుతుంటావనుకో! కాదనటానికి ఒట్టిమనిషిని కాదుగదా! నాదగ్గర డబ్బుల్లేవు గనక.."

"అంత భరించలేనివాళ్లు పెళ్లెందుకు చేసుకోవాలి?" అన్నది శాంత.

"భార్యని భర్త భరించాలి అన్నప్పుడు

భర్తకీ భార్యకీ తప్పకుండా వంటచేసి పెట్టాలి."

"మీ తర్కానికి సంతోషించాంలే ఊరుకోండి" అని గట్టిగా మందలించి విసవిసా వెళ్ళిపోయింది. ఆ కోపానికి మనవాళ్లు ప్రత్యేకంగా పేరుపెట్టి 'ప్రణయకోపం' అన్నారు. ఆ కోపం వచ్చినప్పుడు కాంత అందం రెట్టింపు అవుతుందంటాడు వెంకట్రావు. అందుకేనట మరీమరీ ఉడికించటం. ఇప్పటికిదయిందా? ఆఫీసుకుపోతూ పోస్టాఫీసుకివెళ్లి మామగారికి గాభరాపత్తి వెంటనే బయల్దేరేటట్లుగా మూడుముక్కల్లో ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరమే రమణయ్యగారిని అంత గాభరాపెట్టింది. ఇది సంక్షిప్తంగా ఆ 'లేఖా జననవృత్తాంతం.'

ఆ ఉత్తరం రాసినవిషయం కాంతకి తెలియనివ్వలేదు. అందువల రమణయ్యగారు ఈ బండికి వస్తారనేవిషయం వెంకట్రావు ఒక్కడికే తెలుసు. ఆయనగారు వచ్చేసరికి తనింటిదగ్గ రుండకూడదు. ఏకాంతంలో కాంతని ఆయన గట్టిగా మందలిస్తాడు. కాంత బెదరిపోయి నిజం చెప్తుంది. మామగారు ఆశ్చర్యపోతాడు. ఇలా ఆలోచించుకుని బండివచ్చే వేళకి ఏదో పనిఉన్నట్లుగా స్టేషను దగ్గర తిరుగుతూ మామగారికి కనబడ్డాడు. ఆయనగారు కొంచెం సమయస్ఫూర్తి గలవారు; అల్లుడు బజార్లో కనబడగానే పలకరించకుండా (ముఖంకూడా చెల్లక) అతడింట్లో లేనప్పుడే వెళ్లి కూతుర్ని గట్టిగా మందలించి, అసలువిషయం తేల్చుకోవాలనుకున్నాడు. వెంకట్రావుకి కావలసిందికూడా అదే! మామగారు ఇంటికివెళ్లటం తను చూస్తూనేఉన్నాడు.

అనుకోకుండా ఆ సమయంలో తండ్రిగారు వచ్చేసరికి కాంత నివ్వెరపోయింది. ఆయనగారు మాత్రం కూతురిమీద లోపలోపల కోపాలు మిరియాలు నూరుతున్నాడు. అందువల్ల కూతురు చాలా మారిపోయినట్లూ, ఇదివరకటి లక్షణాలేమీ లేనట్లూ కనపడింది. 'తను ఉత్తరం చించివేసినా తండ్రిగారెందుకు వచ్చినట్లు?' అని కాంత ఆశ్చర్యపోయింది. అసలు వచ్చింది వేరేపనిమీద కాబోలనుకుని స్థిమితపడి, మర్యాదలు చేసింది. కుర్చీలో కూర్చున్న తరువాత "ఏమిటి నాన్నా! పనిమీద వచ్చావు?" అని నవ్వు తెచ్చుకుంటూ అడిగింది. ఆయనగారొక్కసారిగా "ఏమిటా?....కర్మ...బుద్ధిలేకపోతే సరి" అని అరిచాడు. పాపం! కాంత నిజంగా కంగారుపడింది. చిన్నప్పట్నుంచీ అక్కయ్యలందరికంటే ప్రేమగా పెంచినతండ్రి అంత కటువుగా మాట్లాడేసరికి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగివచ్చాయి. ఎలాగైనా ప్రేమతో పెంచిన తండ్రి. ఆయనగారు కోపం కొంత తగ్గించుకుని "ఏంచేశానో చెప్పు. ఎందుకు రాశావీ ఉత్తరం?" అంటూ జేబులోనుంచి ఉత్తరం తీసి యిచ్చాడు. అది చూచేసరికి కాంతకి నవ్వాలో ఏడవాలో తెలిసిందికాదు అయినా అనవసరంగా తన తండ్రికి తనమీద కోపం తెప్పించినందుకు భర్తమీద నిజంగా కోపం వచ్చింది. ఇంతలోకే వెంకట్రావు వచ్చి మామగార్ని 'ఎప్పుడొచ్చారు?' అని ఎరగనట్టు అడగబోయాడు. నోట్లో మాట నోట్లో ఉండగానే కాంత నిజంగానే తన స్వభావాన్ని విడిచిపెట్టినదై "ఏమిటండీ యీ వ్రాతలు?" అంటూ మీది కెగిరింది.

"ఏమిటిది? ముక్కు అర్థంరాకపోతే మింగేసేదానివే నే!" అన్నాడు ఏమీ ఎరగనట్టు వెంకట్రావు. కాంతకి దుఃఖం (అంటే కోపం పట్టలేక) ముంచుకువచ్చి గదిలోకి వెళ్ళిపోయింది. వెంకట్రావుకి యిప్పటికి ఈ ఆగడం చాలనుకున్నాడు. పకపకా నవ్వుతూ ఆమెను వెంబడించాడు. రమణయ్యగారికి అల్లుడినవ్వు అర్థంగాక ఆయనకూడా గది దగ్గరికి వెళ్ళేసరికి, వెంకట్రావు కాంతను బుజ్జగిస్తున్నాడు. "అదేమిటి? గమ్మత్తుచేస్తే ఏడుస్తావెందుకు?" అంటున్నాడు. రమణయ్యగారికి గుండె లాగినంతపనయింది. తనింతవరకు 'చిట్టితల్లి'ని తిట్టుకున్నదంతా అనవసరంగా భ్రమపడేనన్నమాట! అయ్యో! అనవసరంగా కాంత మనసు కష్టపెట్టానే, అని నొచ్చుకున్నాడు "దానికయినా హద్దూ పద్దూ ఉండక్కర్లేదూ! మొన్న రాసిందిచాలక యిదిరాసి ఆయన్ని గాభరా పెట్టి యిక్కడిదాకా రప్పించటమెందుకు?" అన్నది కాంత ఏడుపు దిగమింగుతూ "మొన్నటిది మీ నాన్న చూడకుండానే చించేశావుగా. ఇప్పుడు నిజం చెప్పు ఏమంటాడో?" అంటూ అతడు బయటికి వచ్చేశాడు. రమణయ్యగారు "యేమి"టన్నట్టు కొశ్చెన్‌మార్కు ముఖం పెట్టి అతనివంక చూశారు. "ఏముందిలెండి. ఇంతకూ అసలు 'ఆ ఉత్తరం' చూచే అదృష్టం మీకు లేకుండా చేసిందికాంత" అన్నాడు నవ్వుతూ. కాంత చించివేసిన ఉత్తరాన్ని ఉద్దేశించి కాని, కాంత ఆ ఉత్తరం పారవేయటానికి మనసొప్పక దాచివేసింది. "ఇదుగో అల్లుడుగారి ప్రతాపంచూచి సంతోషించండి" అంటూ ఆ ముక్కలు తెచ్చి తండ్రికిచ్చివేసింది. "చూశావా! నీకూడా పారవేయ బుద్ధిగాలేదుగదూ!" అన్నట్లు నవ్వాడు వెంకట్రావు ఆమెవంక చూచి. రమణయ్యగారు రెండుముక్కల్ని ఒకచోటచేర్చి చదువుకుని "తప్పదయ్యా! ఇదా అసలు సంగతి. అనవసరంగా గాభరా పెట్టాకే మమ్మల్ని" అన్నాడు నవ్వుతూ. "అనవసరమేముందండీ. అది లేకపోతే మీ రిప్పుడొచ్చేవారా మా యింటికి?" అన్నాడు వెంకట్రావు.

"నిజమే-నేను వచ్చేవాణ్ణిగాను. ఈ శుభవార్త తెలిసేదికాదు" అన్నాడు కూతురువంక చూస్తూ. అప్పటికప్పుడే కాంతముఖం సిగ్గుతో ఎఱ్ఱబడి, సిగ్గుబరువుతో తల వాలిపోయింది. జేబులోనుంచి యాభై రూపాయలు తీసి అల్లుడికందిస్తూ "మరి అమ్మాయి నెపుడు తీసికెళ్ళమంటావు?" అన్నాడు. అతగాడు నసుగుతూ "ఇప్పుడెందుకండీ" అని చివరికి ఆలస్యం చేయటానికి ఉపాయం ఆలోచించి "మీరు అత్తగార్ని తీసుకువచ్చి ఇక్కడే ఒకనెల ఉండండి. తర్వాత మీ యిష్టం" అన్నాడు. ఇప్పుడు కూతురువంక చూచేసరికి ఇదివరకు పోయినాయనుకున్న లక్షణాలన్నీ మళ్ళీ తిరిగి వచ్చినట్లనిపించింది రమణయ్యగారికి.

ఆయనగారు వెళ్లింతరువాత వెంకట్రావు కాంతతో అన్నాడు: "చూశావా! మామగారు మంచి సరసులు నా ఉత్తరానికి నిలువన్నపళంగా యాభైరూపాయలు బహుమతిచ్చారు" అని. ఆ యాభై రూపాయలు ఎందుకిచ్చారనే విషయమై వాళ్లిద్దరూ ఆనాడు రాత్రివరకూ జగడమాడుకున్నారు.





మట్రికా



ప్రవాసం

చిత్రాలి : కుమారస్వామి గాంధర్వ-కళ



బౌద్ధమత ప్రబోధాలు ఆధారంగా హిందీ, ఇంగ్లీషు భాషలలో చేతన్ ఆనంద్ నిర్మిస్తున్న చిత్రం "అంజలి"లో శీలా రామాని.



ఏ. వి. ఎం. వారి హిందీ చిత్రం "భాయ్ భాయ్" లో శ్యామ.



ఆర్. కె. ఫిలింస్‌వారి అబ్ దిల్లీ దూర్ నహీలో మోతీలాల్.

ఎ. వి. ఎం. వారి "భాయీ భాయీ" లో నిమ్మీ, అశోక్‌కుమార్.

లక్ష్మీ ప్రొడక్షన్సు వారి "ఇలవేలుపు" లో "పంచకళ్యాణి" నాటకం రిహార్సల్సు చేస్తున్న కృష్ణకుమారి, పద్మనాభం, రేలంగి.

ఫ్రెంచిభాషలో మంచి చిత్రం

రె[illegible] బల్ ప్రొడక్షన్సు" [illegible] అనే మంచి ఫ్రెంచి చిత్రం [illegible] మద్రాసు[illegible]లో [illegible] అయింది. [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కూడా, [illegible] [illegible] [illegible] స్త్రీ ప్రవర్తించ వలసిన అవస్థలూ, అక్కడి [illegible] వాటిగా, [illegible] ప్రతిష్ఠ [illegible] [illegible]


యీ జాఁపాల్ సార్త్రే వ్రాసిన నాటకం దీనికి ఆధారం. [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible] ఈ చిత్రం, [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]ంది.

[illegible] చిత్రంలో ఏ ఒక్క చోటు అసంగతం కనబడదు. [illegible] [illegible] ప్రతి అంశం ప్రయోజనాత్మకంగా ఉంది.

కథానాయిక ఒక పతిత. [illegible] దేశం. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] 'లిజి' [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] ప్రపంచంలో [illegible] [illegible] 'నాగరిక' ప్రపంచంలో [illegible], [illegible]

★ ఫ్రెంచిభాషలో మంచిచిత్రం ★

[illegible]



జూపిటర్ పిక్చర్సువారి "ఉమాసుందరి"లో నృత్య సన్నివేశం.

ఇప్పించడానికి ప్రయత్నించేసే సెనేటర్ క్లార్క్ వాదం ఇందుకు విరుద్ధం. తన మేనల్లుడు తెల్లవాడు, గొప్పవాడు, వాడితో దేశానికి చాలా పని ఉంది. నీగ్రో నల్లవాడు దౌర్భాగ్యుడు, వాడివల్ల దేశానికేం ప్రయోజనం లేదు. అందువల్ల నల్లవాడిప్రాణం కన్న తన మేనల్లుడిప్రాణం విలువ ఎక్కువ.

సెనేటర్ క్లార్క్ చాకచక్యంతో వాదించి, కొద్దిక్షణాలసేపు వెర్రికంటికి పొర అల్లగలుగుతాడు. ఆమె వాఙ్మూలం మీద సంతకం చేస్తుంది. అది జరిగిన కొద్దిసేపటిలోనే, అసలు ఈ గొడవలో ఏ ప్రమేయం కాని మరో నీగ్రోని, పొరపాటున, తీసుకెళ్ళి జనం ఉరేస్తారు.

పొరపాటు గుర్తించగానే, వీధుల వెంటబడి అసలు పారిపోయిన నీగ్రోని వేటాడుతారు. ఆ నీగ్రో ప్రాణభీతితో ఈమె ఇంటికివచ్చి శరణుకోరుతాడు. అంతక్రితమే, దొంగవాఙ్మూలంకోసం ఆమెని లాలించిన వ్యక్తి (హంతకుడి సోదరుడు) ఆక్షణంలో వచ్చి, నీగ్రోతో సంపర్కం పెట్టుకున్నదని ఆమెని నిందిస్తాడు.

హింసావాదంతో, రోడ్లవెంట తిరుగుతున్న జనంలో చెలరేగిన అమానుషప్రవృత్తి, 'చదువు సంస్కారం' ఉన్న ఈ వ్యక్తి అభిప్రాయం, ఆమెలో అసహ్యభావం కలిగిస్తాయి. తన ఎదుట ప్రాణభిక్షకోసం నిలచిన నీగ్రో పైన కరుణ కలుగుతుంది. ఆమెకి వర్ణవిచక్షణసిద్ధాంతం అంటే ఏవగింపు పుట్టిందనేమీ లేదు. "నన్ను ముట్టుకోకు, నాకు నీగ్రోలంటే చిరాకు" అని సూటిగా చెప్పేస్తుంది. ఆమె నీగ్రోని, మనిషిగా చూడగలిగింది. ఏమనిషి అయినా అంతే. ఇట్లా చుట్టుముట్టిన ఆవేశపరులబారినుంచి నీగ్రోని తప్పించడానికి, నిజం చెప్పి అతన్ని కాపాడడానికీ, నిశ్చయించుకుంటుంది. అతి మెలకువతో, మేడదిగి, అప్పుడే వచ్చిన పోలీసు కారు దగ్గరికి అతన్ని లాక్కుపోయి ముందర జనంవలన ముప్పు తప్పిస్తుంది.

ఇదీ కథ.

పోలీసుల రక్షణక్రింద, 'వాన్'లో నీగ్రో పక్కన కూర్చొని లాకప్పుకు వెళ్తూ ఉన్నప్పుడు, ఆమెలోని మానవతే ఆ పతితురాలిని దేవతగా చూపిస్తుంది. ఉప్పొంగే, కరుణతో, వాత్సల్యంతో అభిమానంతో ఆమె నీగ్రో చెయ్యి పట్టుకుని, బాధ తెలిసిన భావంతో, "నీకు ఫరవాలేదు. నేను నీ అండన ఉన్నాను" అని ధైర్యం చెబుతుంది.

ఈ కథ ఒక్క అమెరికా పరిస్థితులకే కాదు. విద్వేషం అనే దుర్గుణానికి నిలయమైన ప్రతి దేశానికీ, ప్రతి మనిషికీ ఒక విజ్ఞప్తి. భాష లేని ప్రబోధం. ★



ఇటీవలే వివాహం చేసుకున్న హాలీవుడ్ తార గ్రేస్ కెల్లీ, మొనాకో ప్రభువు మూడవ రెయినర్ లు.

పథేర్ పాంచాలీ

సత్యజిత్ రాయ్ నిర్మించిన బెంగాలీ చిత్రం "పథేర్ పంచాలీ"ని విశిష్టమైన చిత్రముగా భారత జాతీయతను వాస్తవంగా ప్రతిబింబించేదిగా ప్రశంసిస్తూ అంతర్జాతీయ విద్యార్థి సంఘం పత్రిక "వరల్డ్ స్టూడెంట్ న్యూస్" మొన్న ఈ చిత్రం గురించిన విశేషాలు ప్రచురించింది.

పారతంత్ర్యం వదలిన తరువాత ఏ దేశమైనా సాధించగల అభివృద్ధికీ, వికాసానికీ ఇది చిహ్నమని ఆ పత్రిక వ్రాసింది. ఇందులో, ఈ చిత్రం దర్శకుడు, శ్రీ సత్యజిత్ రాయ్, కెమెరామన్ సుబ్రతా మిత్రాలతో ఇంటర్వ్యూను కూడా ప్రచురించారు.

తొలిసారిగా సినీ కెమెరాను చేతబట్టిన సుబ్రతా మిత్రా మాట్లాడుతూ అసలు కథలో పేర్కొనబడ్డ గ్రామం నిశ్చిందిపురంలోనే చిత్రం నిర్మించినట్లు తెలియచేశారు. కథలోని శిథిలగృహం, సినిమాకోసం వేసిన సెట్ కాదు. కథ చాలవరకూ ఆరుబయటే, ఆ ఇంటి ఆవరణలోనూ, ఆ ఇల్లు ఉన్న తోటలోనూ జరుగుతుంది. దీన్ని చిత్రించడానికి కృత్రిమ సాధనాలు ఏవీ ఉపయోగించకుండా సహజమూ, స్వచ్ఛమూ అయిన కాంతినే సద్వినియోగం చేసుకున్నామని మిత్రా వివరించారు.

ఆఖరికి ఆ యింటిలోపల దృశ్యాలు తీసినప్పుడు కూడా, విద్యుద్దీపాలజోలికి పోక, 'రిఫ్లెక్టర్స్' సహాయంతో, సూర్యకాంతిని ఆ చీకటి ఇంట్లోకి ప్రసరింపజేశారు. దీపాలు ఉపయోగించినదల్లా, ఇంట్లో రాత్రివేళ దృశ్యాలు చిత్రించినప్పుడే.

వస్తు స్వరూప స్వభావాలను గౌరవించి వాటి మేరకు చిత్రంలో కూడా వాస్తవికతను అన్నివిధాలా పోషించడానికి ఈ విధముగా ప్రయత్నించినందువల్ల కొన్ని కొన్ని సందర్భాలలో, ఛాయాగ్రహణ కళా దృష్ట్యా అవలంబించవలసిన పద్ధతులకు, సన్నివేశాన్ని ఒప్పించే వాస్తవికత సాధించడానికి అనుసరించే పద్ధతులకు రాజీ కుదరదు. ఇందులో కూడా అదే జరిగింది అని శ్రీ మైత్రా చెప్పారు.



కె. అమర్‌నాథ్ చిత్రం 'నయా అందాజ్'లో ప్రాణ్.

పథేర్ పాంచాలీ

ఆఖరికి సూర్యకాంతిని వినియోగించుకోవడం కూడా, ఆయా సన్నివేశాల స్వభావం, సూర్యకాంతి ప్రభావం కూడా ఆలోచించి, అవసరాలనుబట్టి లేత ఎండ, ముదర ఎండ ఛాయలవారీగా విభజించి మరీ వ్యవహరించినట్లు ఆయన తెలియచెప్పారు. కథలో, హరిహరుడి కుమార్తె దుర్గ చనిపోయినపుడు, విషాద వాతావరణాన్ని స్వాభావికమైనంత సమగ్రంగా చూపించడం కోసం, అందుకు తగిన ఛాయలో సూర్యకాంతినే ఉపయోగించారు తప్ప ఫొటోగ్రఫీ కళ పేరిట కన్ను చెదరగొట్టే ఎంపికను వాడుకోలేదు.

దర్శకుడు శ్రీ సత్యజిత్ రాయ్ ఈ చిత్రం నిర్మించడంలో తాము ఎదుర్కొన్న వివిధ సమస్యలను వివరించారు. డబ్బు లేక నిర్మాణం ఆగిపోయిన దశలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆదుకుని పెట్టుబడి పెట్టిందని చెప్పారు.

ఈ చిత్రాన్ని ప్రథమంగా 'విడుదల' చేసినది మన దేశంలో కాదు. న్యూయార్కులోని 'మాడర్న్ ఆర్ట్ మ్యూజియం'లో భారతీయ కళాప్రదర్శనం జరిగింది. 1955, మే నెలలో ఈ చిత్రాన్ని అక్కడ చూపించినట్లు శ్రీ రాయ్ చెప్పారు.

ఈనాడు భారతీయ చిత్రాలు అనేకం విదేశీయ చిత్రాల అడుగుజాడలలో తయారవుతున్నవని, వాటిపై ఆయా చిత్రాల ప్రభావం కనబడుతుందని, అయితే 'పథేర్ పాంచాలి'పై మాత్రం ఏ విదేశీయ చిత్రాల ప్రభావము అవకాశం లేదని తాము గట్టిగా చెప్పగలమనీ శ్రీ రాయ్ అన్నారు.

బొంబాయి సినిమా లేఖ

సెన్సార్ నిబంధనలను కఠినతరం చేయించడానికి కాంగ్రెసు నడుంకట్టినందుకు చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులు నిరసన వెలిబుచ్చుతున్నారు. చలనచిత్ర నిర్మాతల సంఘ అధ్యక్షాసన మండలి అధ్యక్షుడు శ్రీ వి. శాంతారాం, చలనచిత్ర పరిశ్రమపట్ల కాంగ్రెసు అవలంబించిన ఈ వైఖరిని బహిరంగంగా విమర్శించారు. ఆయనతోపాటు, పలువురు నిర్మాతలూ కూడా, సర్వతోముఖంగా వికసించి విస్తరిస్తున్న ఈ పరిశ్రమపట్ల కాంగ్రెసు అభివృద్ధి నిరోధకమైన ఇటువంటి చర్యలు అవలంబించదలచడం వాంఛనీయం కాదని అన్నారు.

* * *

ఇటీవలి చిత్రాలలో ఎ. వి. యం. వారి 'భాయీ భాయీ' జనాన్ని బాగా ఆకర్షిస్తోంది. బాక్సాఫీస్ చిత్రం కావడానికి కావలసిన హంగులన్నీ ఉన్న ఈ చిత్రంలో రాణించదగినది శ్రీ యం. వి. రామన్ దర్శకత్వం. ఒకటే చిత్రం పొడుగునా పాటలూ, నృత్యాలూ పుష్కలంగా ఉన్నాయి. ఆ ఉన్నవన్నీ బాగున్నాయి. అశోక్ కుమార్, కిశోర్ కుమార్, నిమ్మి, శ్యామ, ఓంప్రకాశ్ మొదలైనవాళ్లంతా మంచి నటన ప్రదర్శించారు. అనవసర సన్నివేశాలు మాత్రం చాలా ఉన్నందువల్ల, చిత్రం విసుగెత్తడమే కాక, కథ కృత్రిమంగా తయారైంది. పాటలు అన్నీ మనోహరంగా ఉన్నాయి. కిశోర్, నిమ్మిలు చేసిన వీధినాట్యం చాలా బాగుంది.

* * *

మైత్రి ఐక్యత పెంపొంది, సహజీవన విధానం విశ్వవ్యాప్తం కావాలనీ, శాంతి సుస్థిరం కావాలని పలుదేశాల ప్రజలు ఘోషిస్తున్న ఈ కాలంలో ఫ్రాన్సు వీటిని ఆలంబనం చేసుకొని అద్భుతము, అపూర్వమూ అయిన చలనచిత్రం ఒకటి నిర్మించింది. ఈ చిత్రాన్ని ఇటీవల మాస్కో, పారిస్, న్యూయార్క్, రోమ్, బెర్లిన్, ఆస్లోనగరాలలో ప్రముఖులకు చూపించారు.

కథ జరిగేది ఒక ఫ్రెంచి ఓడలో. అది చేపలఓడ. ఆ ఓడ నార్వేజియన్ సముద్రమధ్యంలో ఉంటుంది. హఠాత్తుగా ఒక దారుణమైన వ్యాధి ప్రబలి ఆ ఓడలో జనాన్ని అంతంచేసే విపత్కరపరిస్థితి ఏర్పడుతుంది. వెంటనే, ఓడ కెప్టెన్, సహాయం కావాలని సూచిస్తూ రేడియో సిగ్నల్ పంపుతాడు కాని, అది నిష్ప్రయోజనం అవుతుంది. ఆపైన రేడియో ప్రసార యంత్రం సహాయంతో సిగ్నల్స్ ప్రసారం చేస్తాడు. ఆఖరికాలో ఒక వైద్యుడు రేడియో ద్వారా వాటిని విని, కెప్టెన్ చేసిన సూచనలు ఆధారంగా నార్వేజియన్ సముద్రంలో ఉన్న ఆ ఫ్రెంచి ఓడలో జనానికి సోకిన వ్యాధి స్వరూపస్వభావాలు నిర్ణయించగలుగుతాడు. అది ఒక విషవ్యాధి అని తేలుతుంది. ఆ వ్యాధి సోకినవారికి ఒక ప్రత్యేకమైన 'వాక్సిన్' (టీకాలమందు) 12 గంటలలో ఇంజెక్టు చేయవలసి ఉంటుంది. ఈ వైనాన్ని ఆ డాక్టరు రేడియో ద్వారా తిరిగి ప్రసారం చేస్తాడు. వివిధదేశాల ప్రధాననగరాలలో జనం ఆ సంగతి తెలుసుకొని, ఫ్రెంచి ఓడలో జనాన్ని కాపాడడానికి శాయశక్తులా కృషి చేయ పూనుకొంటారు. పారిస్, బెర్లిన్, స్టాక్‌హోం, ఆస్లోనగరాల ప్రజలు, అనేకతరహాల వారు, సామాన్యప్రజలు, ఈ బృహత్కార్యంలో పాల్గొని, అంచెలమీద ఆ మందును ఓడలోనివారికి అందచేయడాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చిత్రించారు. ఇందరి కృషి ఫలితంగా ఆ టీకాల మందున్న చిన్నపెట్టె సకాలంలో గమ్యస్థానం చేరుకుని, అక్కడి వారి ప్రాణాలు కాపాడుతుంది.

చిత్రం ప్రదర్శించిన తరువాత, ఆరు మహానగరాలనూ రేడియో ద్వారా కలుపుతూ, ప్రత్యేక కార్యక్రమం ఒకటి ఏర్పాటు

చాప్లిన్‌కు రష్యా ఆహ్వానం

చార్లీచాప్లిన్‌ను రష్యా రావలసిందని సోవియట్ నాయకులు క్రుశ్చేవ్, బుల్గానిన్‌లు ఆహ్వానించారు. ఏప్రిల్ 26 న ఈ నాయకుల గౌరవార్థం లండన్‌లోని సోవియట్ రాయబారి కార్యాలయంలో విందు జరిగినపుడు చాప్లిన్‌ను వారు కలుసుకున్నారు.

ఈనాటి కళాకారులలో చాప్లిన్ ఉత్తమోత్తముడని క్రుశ్చేవ్ ఈ సందర్భంలో ప్రశంసించారు. విందుకు వచ్చిన చాప్లిన్‌కు వారు అగ్రస్థానం ఇచ్చి తమ గౌరవాభిమానాలను వెల్లడించారు. 

చేశారు. ఒక ఫ్రెంచిపోలీసు, మూర్ఖుని సతి, ఒక అమెరికన్ నాకాదళోద్యోగి, మొదలైనవారు మాట్లాడారు. చిత్రనిర్మాత క్రిస్టియన్ జాక్వే మాటాడుతూ మైత్రి సమైక్యత, ఒకరికొకరు తోడ్పడి ఆదుకోవాలన్న సద్భావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ చిత్రానికి జాక్వే రెమీ సి సెరిరియో వ్రాశారు. దీనికి 'సి తూ లేజార్ దు మోండ్' (ప్రపంచ ప్రజలంతా కలిస్తే) అని పేరుపెట్టారు. ఈ చిత్రం మనదేశంలో ప్రదర్శింపచేయడానికి ప్రభుత్వం పూనుకోవడం వాంఛనీయం. ★

ఈ నెల ఆరు కొత్త చిత్రాలు

ఈ నెల తెరకెక్కే కొత్త తెలుగు చిత్రాలు ఇప్పటికి తెలిసిన వార్తల ప్రకారం, ఆరు ఉంటాయి. వాటిలో ఒకటి రాజశ్రీ వారి "జయం మనదే" మొన్న 4న విడుదల అయింది. పోతే, జూపిటర్ వారి "ఉమాసుందరి" జి. వి. ఎస్. వారి "సొంత వూరు" రాజ్యంపిక్చర్స్ వారి 'హరిశ్చంద్ర,' శంకర్ ప్రొడక్షన్స్ వారి 'సదారమ,' లక్ష్మీ ప్రొడక్షన్స్ వారి 'ఇలవేల్పు' ఈ నెలలోనే విడుదల కావచ్చు. ఒక నెలలో ఇన్ని కొత్త చిత్రాలు విడుదల కావటం తెలుగు పరిశ్రమకు ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. పోటా పోటీలుగా ఇన్ని చిత్రాలు ఈ నెలలోనే విడుదల కావడానికి గోదావరి పుష్కరాల మాహాత్మ్యం, కూడా కొంత వరకు కారణం కావచ్చుననుకుంటున్నారు. ఏప్రిల్ నెలాఖరువరకు విడుదల అయిన చిత్రాలు పది. వీటిలో తెలుగు సంస్థలు నిర్మించినవి, ఆరు ఉన్నాయి. తమిళ సంస్థలు నిర్మించినవి, మాడర్న్ థియేటర్స్ వారి "అలీబాబా, 40 మంది దొంగలు" ఎ. వి. ఎం. వారి 'నాగులచవితి' మరిరెండు డబ్ చేసిన చిత్రాలు. వాటిలో ఒకటి శివశంభవ యూనిటీ పిక్చర్స్ "ఎదుర్ పారాదదు" అనే తమిళ చిత్రం దీన్ని "విధి విలాసము" అన్న పేరుతో విడుదల చేశారు. రెండోది నీలా ప్రొడక్షన్స్ వారి "సి. ఐ. డి." అనే మలయాళ చిత్రం. ★

సినిమా వార్తలు

రాజశ్రీ సంస్థ పేరిట శ్రీ సుందర్ లాల్ నహతా నిర్మించిన చిత్రం "జయం మనదే" ఈ నెల 4న ఆంధ్రలో విడుదల అయింది. శ్రీ టి. ఎ ఎస్. ప్రకాశరావు దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో అంజలి, రామారావు, రేలంగి, జానకి, సి. ఎస్. ఆర్, గుమ్మడి, ఆర్. నాగేశ్వరరావు ప్రభృతులు నటించారు.



రాజశ్రీవారి 'జయం మనదే'లో జానకి.

* * *

ఈ నెలలోనే విడుదల కానున్న మరో చిత్రం జి.వి.ఎస్. ప్రొడక్షన్స్ వారి 'సొంత ఊరు.' రాజసులోచన, జానకి, రామారావు, సి.ఎస్. ఆర్, అమర్ నాథ్ మొదలైనవారు పాల్గొన్నారు. దర్శకుడు శ్రీ ఇ. ఎస్. ఎన్. మూర్తి. రచన శ్రీ రావూరు, సంగీతం ఘంటసాల.

* * *

వాహినీ పేరిట పొన్నలూరు బ్రదర్స్ నిర్మిస్తున్న 'భాగ్యరేఖ' చిత్రం సాటుకు రీళ్ళ వరకూ పూర్తి అయింది. జమున, రామారావు ముఖ్యభూమికలు నిర్వహిస్తున్న ఈ చిత్రానికి శ్రీ బి. యన్ రెడ్డి దర్శకుడు. రేలంగి, రమణారెడ్డి, సి ఎస్ ఆర్, నాగభూషణం ఇతర నటులు. సంగీత దర్శకుడు పెండ్యాల.

శంభూ పిక్చర్స్ వారి 'సౌభాగ్యవతి' శ్రీ జంపన చంద్రశేఖరరావు దర్శకత్వాన రేవతీ స్టుడియోలో చురుకుగా తయారవుతోంది. సావిత్రి, రామారావు, రంగారావు, రేలంగి, సూర్యకాంతం, హేమలత నటిస్తున్నారు.

* * *

జంపన దర్శకత్వాన తయారవుతున్న మరో చిత్రం రాజ్యం పిక్చర్స్ వారి 'హరిశ్చంద్ర' చంద్రమతిగా లక్ష్మీరాజ్యం, హరిశ్చంద్రుడుగా రంగారావు, నక్షత్రకుడుగా రేలంగి నటిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెలలోనే పూర్తి కావచ్చునని తెలుస్తోంది.

* * *

పారమౌంట్ పిక్చర్స్ విలియం వైలర్ దర్శకత్వాన నిర్మించిన 'సస్పెన్స్' చిత్రం 'డెస్పరేట్ అవర్స్' త్వరలో విడుదల కాబోతున్నది. విస్టావిజన్‌లో తెలుపు నలుపులో తయారైన తొలిచిత్రం ఇదే. హంఫ్రీ బొగార్ట్, ఫ్రెడరిక్ మార్చ్, మార్తాస్కాట్ ఆర్థర్ కెనడీ ఇందులో నటించారు.

* * *

హామ్లెట్ నిర్మించిన సుప్రసిద్ధ బ్రిటిష్ దర్శకుడు, నటుడు సర్ లారెన్స్ ఒలీవియర్ ఇపుడు 'మాక్‌బెత్'ను వర్ణచిత్రంగా నిర్మింప నిశ్చయించారట. ఇందులో సర్ లారెన్స్ భార్య, వివియన్‌లీ 'లేడీ మాక్‌బెత్' భూమిక నిర్వహిస్తుందట. 'మాక్‌బెత్'ను సుప్రసిద్ధనటుడు, అయిన ఆర్సన్ వెల్స్ లోగడ తెలుపు నలుపులో చిత్రం నిర్మించడం విదితమే. ★

నాగుల చవితి

సూర్యుడు పడమటికొండలచాటునుండి మాయమైపోతున్నాడు. పక్షులు కలకలమంటూ తిరిగి గూళ్లకు చేరుకొంటున్నాయ్. తల్లులకొరకు దూడలు 'అంబా' అని అరుస్తున్నాయి. గోధూళి పొగమంచువలె కమ్ముతోంది. ఆ సంజ చీకటిలో ఊరిబైటనున్న దెయ్యాల కొంపలో ఇద్దరు అభాగ్యులు తమ దురదృష్టాలను తలచుకుంటూ దుఃఖిస్తున్నారు.

"మధ్యాహ్నం ఒక్క మెతుకుకూడ దొరకలేదు. నీకేమైనా దొరికిందా?" మెల్లగా ప్రశ్నించాడు నారాయణ.

వీరయ్య భారంగా నిట్టూర్చాడు.

"ఒక తల్లి దయతలచి పిడికెడుకూడు పడేసింది. అది తిని కాసిన్ని మంచినీళ్లు తాగేను."

"అదృష్టవంతుడివి. నీవు చిన్నవాడవవటంచేత దయతలచి బిచ్చం పెడుతున్నారు. నాకెవరు పెడతారు? అడిగితే కూలి చేసుకోలేవా అంటూ విరుచుకు పడ్తున్నారు. అందరూ కూలి చేసుకోమనటమే కాని కూలిచ్చేవారొకరూ కనిపించలేదు" అంటూ మోకాళ్ళకు తలనానించి కళ్లు మూసుకున్నాడు నారాయణ.

"అయితే ఉదయంనుండి నీవేమీ తినలేదా సారీ?"

"లేదు...ఉంటేగా తినటానికి?"

"నావద్ద కొంచెం బియ్యం ఉన్నాయి సారీ! నేను వంటచేస్తాను. నీవు వెళ్ళి స్నానం చేసిరా. కొంత బడలిక తగ్గుతుంది" అని తనవద్దనున్న చిన్నమూట విప్పేడు.

నారాయణ ఓసారి వీరయ్యముఖంలోనికి చూసి అతను విప్పిన మూటవైపు చూశాడు.

"ఇద్దరికీ అవెలా సరిపోతాయి వీరయ్యా?" నీరసంగా అడిగాడు.

"నేను మధ్యాహ్నం తిన్నాగా...అందువలన రాత్రికి నేను పస్తున్నా పరవాలేదు. నీవీరాత్రికి తింటే మళ్లీ రేపు రాత్రివరకు బాధ ఉండదు."

వీరయ్య మాటలు విని నారాయణ ఆశ్చర్యపోయాడు.

"వీరయ్యా! నా అనేవారెవరూ లేని ఈ లోకంలో నువ్వొక్క ఆప్తుడిలా ఆదుకుంటున్నావు. ఈనాటినుండి నువ్వు నాకు స్నేహితుడివి కావు, తమ్ముడివి. ఇప్పటినుండి నువ్వు నన్ను "అన్నా" అని పిలుస్తుండు. ఏం! అలా పిలుస్తావా?"

"అలాగే పిలుస్తాలే సారీ... స్నానానికి పద" అంటూ మూలనున్న చిన్నచట్టి తీసి పట్టుకుని తనకూడ చెఱువుకు బయలుదేరాడు.

చెఱువులో స్నానం చేయటంవలన నారాయణకు సగం బడలిక తగ్గి ఉత్సాహం వచ్చింది. కడుపునిండా నీళ్ళు త్రాగి స్నానం ముగించుకున్నాడు. వీరయ్య చట్టిని ఇసుకతో తోమి శుభ్రంగా కడిగి దానినిండా నీళ్లునింపాడు. ఇద్దరూ తిరిగి కొంపకు చేరుకున్నారు.

దగ్గరలోనున్న గుడిసెవద్దకు వెళ్ళి వీరయ్య నిప్పు పట్టుకొనివచ్చాడు. ఈలోగా నారాయణ ఎండిన ఆకులు, పుల్లలు ఏరి పొయ్యిదగ్గర కుప్పగా పెట్టేడు.

కొండపల్లి సాంబమూర్తి

ఎట్లాగైతేనేం పావుగంటలో అన్నం ఉడికింది. అప్పటికిగాని ఉప్పులేదని వారిద్దరికీ జ్ఞాపకంరాలేదు.

"అన్నం ఉడికింది కాని ఉప్పో?" అన్నాడు నారాయణ.

"అరె! నాకింతవరకు జ్ఞాపకమేలేదు. ఉండు... బజారుకు వెళ్ళి ఉప్పూ... నంజు కుందుకుకూడ ఏమైనా తెస్తాను" అని పరుగెత్తి వెళ్లిపోయాడు వీరయ్య. కొంపలో నారాయణ ఒక్కడే మిగిలాడు.

"తనగురించి వీరయ్య రాత్రికి పస్తుండ దలచుకున్నాడు. దాంతో సరిపెట్టక అన్నం వండి ఇప్పుడు ఉప్పుకొరకు బజారుకు వెళ్లాడు. తనేదైనా పని చూసుకుని వీరయ్యను చదివించాలని నిశ్చయించుకున్నాడు. మెల్లగా లేచి ఉడికిన అన్నం చూశాడు.

అన్నం తక్కువైనా గంజి ఎక్కువగా ఉంది. ఇద్దరికీ సరిపోతుందనుకున్నాడు. మూలనున్న ఇంకో చట్టి తీశాడు. దానికి చిల్లుఉంది. చట్టి పట్టుకుని మళ్ళీ చెఱువుకు వెళ్లి దానిని శుభ్రంగా కడిగాడు. ఆకుఒకటి త్రుంచి మడిచి చిల్లిలో పెట్టి కొంపకు చేరుకున్నాడు.

పావుగంట గడిచింది. మసకగా చీకటి కూడ పడింది. వీరయ్యరాలేదు. రోడ్డువైపు చూస్తూ కూర్చున్నాడు నారాయణ.

కొంతసేపటికి వీరయ్య మెల్లగా వచ్చాడు. వీరయ్య ఆకారం కన్పిస్తోంది

కాని అతని చేతిలోనున్న వస్తువులు నారాయణకు కన్పించలేదు.

"నూనె ఇదుగో అన్నయ్యా! ప్రమిదలో పోసి దీపం వెలిగించు" అంటూ ఆకు దొప్పతో నూనె అందించాడు వీరయ్య. "అన్నయ్యా" అనే మధురమైన పిలుపు విని నారాయణ ఆనందంలో తేలిపోయాడు. నూనె అందుకుని ప్రమిదలో పోశాడు. పొయ్యివద్దకు వెళ్ళి కొన్ని ఎండుటాకులు దానిలో వేసి, ఊది, మంటచేసి దీపం వెలిగించాడు. వీరయ్య వొడిలో వేసుకొని తెచ్చిన వస్తువులు నేలపై పెడుతున్నాడు.

కొన్ని ఉల్లిపాయలు, కొన్ని పచ్చిమిరపకాయలు, నాలుగు నాగిమార్కు సిగరెట్లు, కొన్ని బీడీలు ఇవి వీరయ్య తెచ్చిన సామానులు.

"ఇవన్నీ ఎక్కడివి?" అన్నాడు ఆశ్చర్యంతో నారాయణ.

"బజార్లో దుకాణాలదగ్గర ఉల్లిపాయలు, మిరపకాయలు, ఉప్పు బిచ్చమెత్తాను. ఇంకా కొంతసేపుంటే బాగుంటుందని వచ్చిపోయేవారినందరిని అడుగుతూ నిలుచున్నాను
అదృష్టవశాత్తు తేనెవరకు దొరికింది. కాని నూనె, అర్ధణా సిగరెట్లు, నాలుగు కానుల బీడీలు కొని తెచ్చాను. రేపటివరకు మనకేమీ పరవాలేదు. మహారాజులా ఉండొచ్చు. రెండు కానులు నిలవకూడా ఉంది" అన్నాడు ధీమాగా వీరయ్య.

"సిగరెట్లు, బీడీ లెందుకు కొన్నావ్? డబ్బు లుంచలేకపోయావా, రేపటిదియ్యాలకైనా పనికివచ్చేవి."

"రేపటిసంగతి ఇప్పుడెందుకులెద్దూ. నేను తెచ్చానని ఇష్టపడుతున్నావు కాని ఒకవేళ తెచ్చి ఉండకపోతే నేనేం చేయగలను? అనే నాతీరు. పోనీ దానికలించి బాధపడెందుకు? నేను భోంచేశాక. ఉల్లిపాయలే నంజుకుంటావో, లేకపోతే ఉప్పులో నంజుకొని మిరపకాయలే నంజుకుంటావో నీ ఇష్టం."

"నువ్వుకూడా తే.. వీరయ్యా! ఇద్దరం కలసే భోంచేద్దాం."

"ఉహూ......నాకాకలిగా లేదు" అన్నాడు వీరయ్య.

వీరయ్యకు ఆకలి ఎందుకులేదో నారాయణ గ్రహించుకొన్నాడు.

"గంజి ఎక్కువగా ఉంది. నే నొక్కణ్ణి అంత గంజి తాగలేను, కాబట్టి నువ్వు సగం గంజైనా తాగు."

వీరయ్య దానికి ఒప్పుకున్నాడు. నారాయణ చిల్లి ఉన్న సత్తిలో సగం గంజిపోసి వీరయ్యకు ఇచ్చి మిగిలినది తను తీసుకున్నాడు.

ఆకలి బాధ తీర్చుకున్నాక, చెరొక సిగరెట్టు ముట్టించి తీరిగ్గా కూర్చున్నారు.

"ఈవేళ బజార్లో కోడిగుడ్లు విపరీతంగా అమ్ముడు పోతున్నాయి" అన్నాడు వీరయ్య.

"రోజూ అమ్ముడవుతుంటాయి. ఈ దినం కొంచం ఎక్కువ కాబోలు"

"అది కాదన్నయ్యా! రేపు నాగులచవితిగా...పుట్టలో వేయటానికి అందరూ కొంటున్నారు."

"హా... మనలాంటి నిర్భాగ్యులకు పండుగ లెక్కడా?"

"రేపు మనకి కూడా పండుగేనన్నయ్యా."

"నీకేమైనా మతి చలించలేదు కదా!"

"నిజమే నన్నయ్యా! మా అయ్య నాగుల చవితి వచ్చిందంటే పదిహేను రోజుల బత్తెం సంపాదించేవాడు. మనిద్దరం కలసి రేపు నెలరోజుల బత్తెం సంపాదించవచ్చు" అన్నాడు వీరయ్య ఉత్సాహంగా.

"ఒక్క రోజుకి సరిపడే బిచ్చం పెట్టని వారు, నెలరోజులకు సరిపడే బిచ్చం రేపు వేస్తారా? వుద్ద తెలివితక్కువ."

"బిచ్చమెత్తి సంపాదించడం కాదన్నయ్యా! రేపు పుట్టలో బంగారునాగు, వెండినాగు, డబ్బులు, గుడ్లు మొదలగునవి వేస్తారు. పుట్టలో వేసి వాళ్ళు వెళ్ళిపోగానే మనం తీసుకుంటాం...అంతే...ఆ బంగారం, వెండి, గుడ్లు అమ్మితే బోలెడు డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో కోటలోనికి వెళ్ళి మంచిమంచి సరుకు కొని బజార్లో అమ్మితే బోలెడు లాభం వస్తుంది. ఇంక మనకే బాధ ఉండదు"

వీరయ్య తెలివికి నారాయణ ఆశ్చర్యపోయాడు. కొత్తగా ఆశకూడ కలిగింది.

"కాని వాటిని తీయడమెట్లా?" మెల్లగా అడిగాడు నారాయణ.

"చేయిపెట్టి తీసుకుంటాం."

"పాములుంటాయేమో?" అనుమానపడ్డాడు నారాయణ.

"నాగులచవితినాడు పాములు కరవవని నీకు తెలీదూ?" అంటూ నవ్వాడు వీరయ్య.

నిజమే నాగులచవితినాడు పాములు కరవవని తన తల్లి చిన్నప్పుడు చెప్పింది. తనకు జ్ఞాపకమే లేదు. వెధవబుర్ర మట్టిబుర్ర.

"అలాగే చేద్దాం వీరయ్యా! కాని ఈ సంగతి ఇంకెవరితోను చెప్పకు. చెప్పావంటే మనకన్నా ముందు వాళ్ళు తీసేస్తారు."

"అబ్బే! నే నెవ్వరితోను చెప్పను" అన్నాడు వీరయ్య.

ఇద్దరూ మాట్లాడుకుంటూ పడుకొని కళ్ళు మూసుకున్నారు. కాని నిద్ర పట్టలేదు. తనకు ఎక్కువ డబ్బు దొరికినట్లు, ఆ డబ్బుతో పెద్ద వ్యాపారం చేసి అధిక ధనం ఆర్జించినట్లు, తాను ధనవంతుడై మేడలలో విహరిస్తున్నట్లు, ఇంకేవేవో తియ్యని కలలు కంటూ నిద్రపోయారు.

తెల్లవారుతూంది. సూర్యుణ్ణి రమ్మని పక్షులు పిలుస్తున్నాయి. తూర్పు దిక్కున చిన్న ఎరుపురంగుతో మేఘాలు కన్పిస్తున్నాయి. పక్షులగోల విని వీరయ్య లేచి నారాయణను మేల్కొలిపాడు.

ఇద్దరూలేచి చెరువుకువెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని, తలంటుకుని, తడిసిన బట్టలు కట్టుకున్నారు. నాగేంద్రుణ్ణి మనసారా ప్రార్థించారు. చెరువుకు దగ్గరిలోనే పెద్ద

★ నాగులచవితి ★

పుట్ట ఒకటి ఉంది. ఇంకా దాంట్లో ఎవరూ పాలుపోయలేదు. తిరిగి అక్కడికే చేరుకోవాలని నిర్ణయించుకొని చెరొకవైపు ఊరి బయటనున్న పుట్టలను వెతుక్కుంటూ బయలుదేరారు.

నారాయణ కొంతదూరం వెళ్ళేసరికి ఒక పుట్ట కనుపించింది. దానిచుట్టూ పదిమంది స్త్రీ పురుషులు పూజ చేస్తున్నారు. డబ్బున్న వాళ్లలా కన్పించారు. వారికి కొంచందూరంలోనున్న చెట్టుక్రింద వాళ్ళను గమనిస్తూ కూర్చున్నాడు నారాయణ.

"అబ్బాయ్! బంగారునాగేది?" అడిగాడు ఇంటిపెద్ద ప్రక్కనున్న కొడుకుని.

"పళ్లెంలో ఉంది నాన్నా" అన్నాడా కుర్రవాడు.

ఇంటాయన పళ్లెంలోనుండి చిన్న పొట్లం తీసి విప్పి, వెండినాగుని కుర్రవాడికిచ్చి, తనొక కన్నంలో బంగారునాగుని వేశాడు. నారాయణ ఇదంతా గమనిస్తూ కూర్చున్నాడు. పూజ ముగించుకొని వాళ్లందరూ వెళ్ళిపోగానే పుట్టదగ్గరకు చేరాడు.

ఇంటిపెద్ద బంగారునాగు వేసిన కన్నంలోనికి చూశాడు. ఏమీ కనుపించలేదు. చేయిదూర్చి తడిమాడు. చేతికి ఓ గుడ్డు దొరికింది. దాన్ని తీసి బైటపెట్టి, మళ్ళీ చేయిపెట్టి మట్టినితీశాడు. మట్టిలో బంగారు నాగు మిలమిల మెరిసింది. అతని కళ్ళు జిగేలుమన్నాయి. అన్నికన్నాల్లోను వెతికాడు. కొంత చిల్లర, మూడు గుడ్లు, బంగారునాగు, వెండినాగు, చలిమిడిముద్ద, నువ్వులముద్ద మొదలైనవి దొరికాయి. వాటినో గుడ్డలో కట్టి ఇంకో పుట్టదగ్గరికి సాగిపోయాడు.

పదిగంటలయింది. గాలికి చెట్లుచేస్తున్న శబ్దం తప్పించి చెరువుదగ్గర అంతా నిశ్శబ్దముగా వుంది. ఉండుండి అక్కడక్కడ కొన్ని పక్షులుమాత్రం గానంచేస్తున్నాయి.

వీరయ్య తనకు దొరికిన వస్తువులు మూటకట్టి, ఆ మూటను పట్టుకొని చెరువుదగ్గరకు చేరుకున్నాడు. నారాయణ దూరంలో కనిపించాడు. నారాయణ దగ్గరకు రాగానే వీరయ్య సంతోషంతో కేకవేసి ఎగిరి గంతేశాడు.

"ఏమాత్రం?" అన్నాడు నారాయణ.

"చిల్లర, గుడ్లు, బంగారం అన్నీ కలిపి పదిహేను రూపాయ లుంటుంది" అన్నాడు వీరయ్య.

"నాగికూడ ఇరవై రూపాయల వరకుంటుంది. మనం బిచ్చంమాని వర్తకం చేసుకుంటూ హాయిగా జీవించవచ్చు" అన్నాడు నారాయణ.

"ఆ పుట్టలో ఎంత దొరికింది. చాలపెద్ద పుట్ట; దానిలోనే చాలమంది పాలు పోస్తారు" అన్నాడు వీరయ్య దగ్గరలోనున్న పుట్ట చూపిస్తూ.

"ఆపుట్టలో నువ్వు వెతికావనుకున్నాను నేనింకా చూడలేదు" అన్నాడు నారాయణ.

"అయితే ఫరవాలేదు. వందరూపాయలకు భర్తీ అయిపోతుంది...లే.. నువ్వొక ప్రక్క నేనొకప్రక్క వెతుకుదాం" అంటూ తనమూటను చెట్టుక్రింద పెట్టాడు వీరయ్య. నారాయణకూడ తన మూటను చెట్టుక్రింద పెట్టి పుట్టదగ్గరకు వెళ్ళాడు.

పుట్టమీద ఎనిమిది ప్రమిదలు ఆరిపోయిన వత్తులతో ఉన్నాయి. వాటినిచూసి,

"ఎనిమిది కుటుంబాలీ పుట్టలో పోశారు. చాల ఎక్కువగా దొరకవచ్చు" నన్నాడు వీరయ్య. నారాయణకుకూడ హుషారు హెచ్చింది. ఇద్దరూ చెరొకకన్నంలో చేతులుదూర్చి వెతికారు. చెరొక కోడిగుడ్డు దొరికాయి. వాటిని బైటపెట్టారు.

వీరయ్య ఇంకో కన్నంలో చేయిదూర్చి వెతుకుతున్నాడు. నారాయణకూడ ఇంకొక కన్నంలో చేయిదూర్చాడు. చేతికేదో మెత్తగా తగిలింది.

"మొదట వెన్న చలిమిడిముద్ద దొరికిందీ కన్నంలో" అన్నాడు దానిని పట్టుకుని బైటకు తీస్తూ.

చేయి బైటకుతీస్తుంటే, చేతికేదో చుట్టుకుంటున్నట్లుగా అనిపించింది. కొద్దిగా గాబరాపడుతూ బైటకు తీశాడు. చేతికి చుట్టుకున్న నాగుపామును చూసి 'కెవ్వు' మని కేకవేశాడు నారాయణ. వీరయ్య గతుక్కుపడి నారాయణవంక చూశాడు. నారాయణచేతికి చుట్టుకున్న త్రాచుకోడెని చూసి భయంతో కంపించిపోయాడు వీరయ్య.

"వదిలేయ్ అన్నయ్యా...వదిలేయ్" అంటూ భయంతో కేకలు వేశాడు. నారాయణ భయంతో గజగజ వణికిపోయాడు. వదిలేద్దామని ఎంత ప్రయత్నించినా అతని వేళ్లు విడవలేదు. త్రాచుపాము తన పడగ విప్పి, ఓసారి నారాయణ మొగంవైపు చూసి, అతని చేతిపై "బుస్సు" మంటూ ఓకాటు వేసింది. నారాయణ చేతివ్రేళ్ళకు పట్లు తప్పాయి. పామును వదలేశాడు. పాము పుట్టలోనికి వెళ్ళిపోయింది. నారాయణ నేలపై కూలిపోయాడు. "అన్నయ్యా" అంటూ వచ్చి కూలిపోతున్న నారాయణను పట్టుకున్నాడు వీరయ్య. తన కమీజు చింపి కాటుకిపైగా గట్టిగా కట్టుకట్టి,

"నువ్విలాగే ఉండన్నయ్యా! నేనువెళ్ళి మంత్రగాడిని తీసుకువస్తా"నంటూ లేచాడు వీరయ్య.

నారాయణ వీరయ్యచెయ్యి గట్టిగా పట్టుకొని, "వద్దు తమ్ముడూ... నేనింక బ్రతకను నీవటు వెళ్ళగానే నేను చనిపోతాను."

"వీల్లేదన్నయ్యా! ఇప్పుడు దొరికిన డబ్బంతా ధారపోసైనా నిన్ను బ్రతికించుకుంటాను"

నారాయణ కన్నులనుండి బొటబొట కన్నీరొలికింది. అంత్యకాలం సమీపిస్తున్నట్లు గ్రహించుకున్నాడు.

"నా ఆఖరిగడియల్లో నీవు నాదగ్గర లేకపోతే నా మనస్సుకు శాంతి ఉండదు. తమ్ముడూ.. వృథా శ్రమపడకు. దొరికిన వన్నీ అమ్మి నగదురూపంగా మార్చి పట్టుకొని వర్తకం మొదలుపెట్టు. వచ్చే లాభం అంతా ఖర్చు చెయ్యకుండా గుప్తంగా డబ్బుని దాచుకో. ఏం! అలా చేస్తావా?"

"అలాగే చేస్తానన్నయ్యా" అన్నాడు వీరయ్య గద్గదస్వరంతో.

"నన్ను మర్చిపోవు...కదూ...త...మ్ము...డూ..." నారాయణ నోటినుండి మరి మాట రాలేదు. చొంగలు కక్కుకుంటూ ప్రాణాలు విడిచాడు. "అన్నయ్యా"అంటూ గొల్లుమని శవంపై పడ్డాడు వీరయ్య.

అతని ఘోష విని నాగేంద్రుడు పుట్టబైట కోసారి తొంగిచూసి మళ్ళీ లోనికి వెళ్ళిపోయాడు. 



నేటి మహిళా సమస్యలు

భారత మహిళాభ్యుదయోద్యమం శీఘ్ర వేగంతో సాగిపోతున్నదనీ, అతి శీఘ్రకాలంలోనే భారత మహిళలు ఎంతో ముందుకు వచ్చారనీ, నాగరక దేశాల్లో ఏ దేశ స్త్రీలకు లభించనంత సులభంగా శీఘ్రంగా భారతమహిళలకు అనేక హక్కులు బాధ్యతలు చేకూరినవనీ భారత రాజ్యాంగచట్టము స్త్రీలకు పురుషులతోబాటు సమానహక్కులు ప్రసాదించి అత్యంత ఉదారత చూపిందనీ, ప్రతివారూ ప్రశంసిస్తున్నారు. మనము నిజమేనని సంతోషిస్తున్నాము. కుల సంఘ రాజకీయ ఆర్థిక విద్యా ఉద్యోగాది సమస్త విషయాల్లోనూ స్త్రీ అనే కారణముచేత ఎట్టి విభేదము చూపకుండా సమానహక్కులు ప్రసాదించినప్పుడు భారత రాజ్యాంగ చట్టమును అభినందించకుండా ఎవరుగానిఎట్లుండగలరు. అయితే ఇది ఆచరణలో ఎట్లున్నదనేది విచారించవలసినమాట. దొంగతనమును రాజశాసనము గట్టిగా నిషేధిస్తున్నది. కాని దొంగతనాలు ఉండనే ఉన్నవి. అట్లాగే స్త్రీలకు ప్రసాదితములైన హక్కులు అనుభవంలోకి వచ్చి వారు సుఖిస్తూ ఉంటేనే నిజానికి వాటి ప్రయోజనం ప్రశంసించవలసి ఉంటుంది.

* * *

భారతస్త్రీలకు సకల స్వాతంత్ర్యములు చేకూరిన యీ స్వర్ణయుగంలో కూడా స్త్రీలకు కౌటుంబికపు బాధలు, భర్తలు వదలిపెట్టడాలు, ఈ దుర్భరకష్టాలు భరించలేక స్త్రీలు అసంఖ్యాకంగా ఆత్మహత్యలు చేసుకోవడాలు జరుగుచున్నవంటే భారత స్త్రీలు పురోభివృద్ధి గాంచుచున్నారని భావించడము భ్రాంతిగాని స్వప్నముగాని కాదుగదా అనిపిస్తున్నది

సౌరాష్ట్రంలో ఆత్మహత్యలు విపరీతంగా ఉన్నవని తెలిసి దానిని పరిశీలించుటకు రాష్ట్రప్రభుత్వంవారు నియమించిన అధికార సంఘమువారు తెలిపిన ఉదంతములు చూస్తే కౌటుంబికములవల్ల ఆ ప్రాంత స్త్రీలు పడుచున్న కష్టము లెంత దుస్సహమైనవో, ఎంత భయానకమైనవో విశదమవుతున్నది.

ఆ సంఘమువారు గత నాలుగు సంవత్సరముల పోలీసు రికార్డుల సహాయముతోను సంఘ సేవకుల నివేదికల తోడ్పాటుతోను 1300 వందల సంఘటనలను పరిశీలించినారట. ఈ పరిశీలనవలన ఆత్మహత్య చేసుకున్నవారు పురుషులకంటె స్త్రీలు రెట్టింపు ఉన్నారనీ, ఆ రెట్టింపు స్త్రీల్లో అత్తలుపెట్టే కౌటుంబికపు బాధలు భరించలేక ప్రాణాలు తీసుకున్న వాళ్ళే ఎక్కువ మంది ఉన్నారనీ ఆ ప్రాణాలు తీసుకున్న వాళ్ళందరూ చదువురానివారేననీ, వారిలోన యొక్కువ మంది పల్లెటూళ్ళ వాళ్ళేనని తేలిదట. ఆ ఆత్మహత్య లనబడేవి అనేక సందర్భాలలో హత్యలని చెప్పడానికి తగిన ఆధారములు కనిపించినవనీ, వెంటనే దర్యాప్తు చేసి ఉంటే వారిని బలవంతముగా చంపి తమ నేరము తప్పించుకోడానికి ఆత్మహత్యలుగా నిర్ణయింపబడిన సందర్భములే ఎక్కువగా వెల్లడయ్యేవని గూడా ఆ సంఘము అభిప్రాయపడినదట. ఆత్మహత్యలను తగ్గించుటకు సూచనలు చేయునప్పుడు ఈ విచారణ సంఘము స్త్రీలకు శరణాలయాలు స్థాపించాలనీ విద్య నేర్పే ఏర్పాట్లు చేయవలెననీ తెలుపుతుం

★ నేటి మహిళా సమస్యలు ★


ప్రభుత్వం శాసనరీత్యా ఈ అత్యాచారాలను తగ్గించేందుకు ప్రయత్నము చేయవలెనని ప్రభుత్వము తెలుపుతుండుట. ఈ హత్యలకు కారకులైన అత్తలను భర్తలను శిక్షించవల సిందిగా కూడా సూచిస్తుండుట. మంచిదే. పరిశీలన సంఘము వారు గట్టిగా సిఫార్సు చేయవచ్చును. బహుశా ప్రభుత్వము గూడ ఇట్టివారిపై చర్య తీసుకొనవచ్చునుగాని ఈ పరిశీలన కందని హత్యా నేరములు దీనికి రెట్టింపుగా ఉండవచ్చును అనుటకు సందేహం లేదు. ఈ నాగరిక యుగములో స్త్రీల అభ్యుదయానికి కోట్లు వెచ్చించి బహుముఖాల పనిచేయుచున్న ఈ రోజుల్లో, వందలకొలది స్త్రీలు కేవలం కట్నాలవల్ల బలవన్మరణాలపాలై పోతున్నారంటే ఇంతకంటె దారుణమైన విషయము వేరొకటి లేదు. ఆ సౌరాష్ట్ర స్త్రీలలో ఎంత మూర్ఖత ఎంత అజ్ఞానము ఎంత దయాశూన్యత ఘనీభవించి ఉన్నదో ఎట్టి సాంఘిక దురాచారములు వారిలో వ్యాప్తమైయున్నవో ఊహించడానికి సాధ్యం కావడం లేదు. ఎంత దుర్భరకష్టం లేకపోతే ఒక స్త్రీ తన నిండుప్రాణమును కోల్పోవడానికి ఒడికట్టుతుంది? ప్రాణికి ప్రాణంమీద తీపి మెండంటారుగదా. అటువంటి తియ్యని ప్రాణం విడవడానికి ఆ స్త్రీ కష్టమెంత దుర్భరమైనదై ఉండాలి! ఈ దుర్భరపరిస్థితిని అతినిశితంగా పరిశీలించవలసి ఉన్నది. స్త్రీసంక్షేమసంఘము స్త్రీలఅభ్యుదయానికి చేస్తున్న వివిధ కార్యకలాపాలకంటె సౌరాష్ట్ర దేశంలో కోడళ్ళను బలిగొంటున్న ఆ నారీరూప రాక్షసులైన అత్తలబడే వ్యక్తులబారినుండి ఆ అసహాయస్త్రీలను ఉద్ధరించుటకు విశేషముగా కృషి చేయవలసి ఉన్నది. అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యల నుంచి పెద్దలు నిర్ణయించకుండా కోడం ప్రతీకమునకు బలిపెట్టుటను ప్రోత్సహించే ఆ భర్తలను కూడా కర్తవ్యబోధ చేయవలసి ఉన్నది. స్త్రీలు స్వయంసేవకులై సౌరాష్ట్రదేశంలోకి వెళ్ళి ప్రభుత్వ తోడ్పాటును పొంది వివిధప్రచార సాధనములద్వారా స్త్రీలలో ఉద్యమ ప్రబోధం చేయటం అత్యవసరం. స్త్రీల కష్టగాథలను పాటలుగానో బుర్రకథలుగానో నాటికలాంటి ప్రదర్శనలద్వారానో ప్రదర్శించడం అత్యంతముఖ్యమైన విషయం. నేటి మహిళాసంఘాలు ఈ అబలాసముద్ధరణ ప్రథమకర్తవ్యంగా భావించునని ఆశిద్దాము.

కాలిదారిని ఎవరికి వారు నడిచే రోజులు, ఎద్దుబండ్లమీద ఎవరి కుటుంబానికి వారు ప్రయాణంచేసే రోజులూ పోయి రైళ్లూ, బస్సులూ, స్టీమర్లూ, విమానాలు, ప్రయాణ సాధనాలుగా ఏర్పడిన తరువాత వివక్షతా రహితంగా స్త్రీపురుషులు కలిసి ప్రయాణం చేయడం విధాయకమైపోయింది. నామ కార్థంగా స్త్రీలకు ప్రత్యేక వసతులు కొన్ని చోట్ల ఉన్నప్పటికీ ఇందువల్ల స్త్రీలు పడుతున్న కష్టాలు స్వల్పంగా, ఉండటం లేదు. ఇది పురుషులకు తెలియక పోవచ్చును గాని తెలియని స్త్రీలు మాత్రము లేరు. ఇందువల్లనే అప్పుడప్పుడు స్త్రీలు ప్రత్యేక సౌకర్యాలు ఆశిస్తూ ఉండడమూ పురుషులతో సమానహక్కులు ఒకవంక కోరుతూ మరల ప్రత్యేక సౌకర్యాల కోరడమేమిటని మగవారు అవహేళన చేస్తూ ఉండటమూ తటస్థిస్తూ ఉన్నది. కాని ఈ రక్షణలు స్త్రీలు కోరుటకు కారణమేమిటో ఉదారహృదయంతో యోచించిన సహృదయులు కనిపించడం లేదు. లోక్ సభలో శ్రీమతి యిలా పాల్ చౌదరి నిశీథసమయాల్లో స్త్రీలు విమాన ప్రయాణాలు చేసేటప్పుడు స్త్రీలకు ప్రత్యేక సీట్లు యేర్పాటు చేయాలెననీ, అట్లా చేయడం సాధ్యం కాకపోతే ఆమె తన ప్రక్కగా తన సామానులు పెట్టుకొని కూర్చోడానికి అనుమతించాలని కోరింది. పరపురుషుని ప్రక్క కూర్చోడంకంటె సామానుల ప్రక్క కూర్చోడానికి స్త్రీలు యిష్టపడతారని ఆమె అన్నది. ఇది సభ్యులకు కష్టంగా తోచింది. 'మొగవారు సామానుల మాత్రం చేయరా' అని వారు ప్రశ్నించారు. ఎప్పుడూ కాకపోయినా రాత్రిళ్లు విమానాల్లో ప్రయాణం చేసేటప్పుడు పురుషులకంటె సామానులే మేలని ఆమె నొక్కిపల్కింది. శ్రీమతి యిలాపాల్ చౌదరివంటి సంస్కారం గల వ్యక్తి స్త్రీలకు ప్రత్యేక వసతుల కోరడం ఏమిటో అర్థం కావడం లేదని రవాణామంత్రి జగజ్జీవనరాము ఆశ్చర్యపోయినాడు. విడిగా సీట్లు కోరినందుకు మహిళాసంఘానికి పాల్ చౌదరిపై కోపం వస్తుందేమోనని ఆక్షేపణగా పలికాడు. ఆడపిల్లలు కాలేజీకి పోవడానికి పోలీసుల బందోబస్తు కావాలని వచ్చిన సందర్భాలను అప్పుడప్పుడు స్త్రీలను గురించిన విషయములు ప్రస్తావింపబడినప్పుడు రాష్ట్ర శాసన సభలోను, లోక్ సభలోను రాజ్యసభలోను సభ్యులు మాట్లాడే మాటలు గమనిస్తున్నది కనుకనే యిలా పాల్ చౌదరి అట్లా మాట్లాడి ఉంటుందనుకుంటాను. ధైర్యంగా భారత మహిళల మనస్తత్వాన్ని వెల్లడించిన యిలాపాల్ చౌదరి అభినందనీయురాలు.

* * *

చెంగల్పట్టుజిల్లా కలెక్టరు వెంకటేశ్వరన్ గారు తిరువళ్లూరులో ప్రసంగిస్తూ యువతులకు గావించిన హెచ్చరిక గమనార్హంగా ఉన్నది. ఈ కాలపు యువతులు నాగరికత పేరుతోను ఫ్యాషన్ పేరుతోను, చేసుకుంటున్న వస్త్రాలంకారాలు ఆయనకు అసహ్యకరంగా తోచినవి. 'యువతులు సరిగా ఉంటేనే దేశం బాగుపడుతుంది. సినిమా తారలను అనుకరించి మన బాలికలు చెడిపోతున్నారని ఆయన విచారపడ్డారు. ఒడలు కనిపించే అతి పల్చని చీరలు కట్టడమూ, కట్ బనియన్లు చోళీలతో వగవగలు తొడుగు వికారంగా సింగారంతో శరీరాన్ని చూపిస్తూ ఉండుకోడమే సభ్యతగా నేటి యువతులు భావిస్తున్నారనీ ఇందువల్ల మనదేశపు విలువ నశించిపోతున్నదనీ గృహిణులైనవారు ఎల్లప్పుడు అక్కరమాలిన కబుర్లతో కాలక్షేపం చేయకుండా తమ పెరట్లో కాయగూరలపాదులు పూలమొక్కలు పెంచుతూ గృహకృత్యములన్నీ స్వయంగా నెరవేర్చుకుంటూ ఉండవలెననీ వారన్నారు. ఇందువల్ల ఇంటి ఖర్చు తగ్గడమూ, ఇల్లాలి గౌరవము హెచ్చడమూ జరుగుతుందని వారు వాక్రుచ్చారు.

శ్రీ వెంకటేశ్వరన్ గారి సూక్తులు ఉత్తమోత్తమంగా ఉన్నాయి. వస్త్రాలంకారాల్లో సినిమా తారలను అనుకరించడం యువతులకు ఉచితమైన పని గాదు. స్త్రీలను చక్కని చీర రవికలను ధరించవలదనీ, చక్కని నగలు పెట్టుకోవద్దనీ, ఎవరూ చెప్పరు. కాని ఆ సింగారింపులు స్త్రీల మర్యాదకు భంగకరమైనవి గాను, కుటుంబనాయకునకు మించినవి గాను ఉండే మాత్రము కుంచితత్వము కారాదు. సినిమా నటుల ఆచారాలు వేరు. వారి వృత్తి ధర్మము వేరు. వారి స్వేచ్ఛ వేరు. వహించవలసిన సందర్భమునుబట్టి దుస్తుల విషయంలోను తగిన అలంకారములను చేసుకొనుటలోను గోప్యంగాను అగోప్యంగాను కూడా వారు వ్యవహరించవలసి వచ్చుట తప్పనిసరి కావచ్చును. సామాన్య స్త్రీలకుమాత్రమది కొంతమాత్రము తగదు. ఏ విషయంలోను ఒకరు ఆక్షేపించుటకు వీలుకానివిధంగా యువతులు ప్రవర్తించినప్పుడే తమకు కావలసిన విషయములలో కూడా నాల్గుమూలలా అర్హతను సంపాదించగలుగుతారు. ★



పూర్వం ఓ రైతు కుటుంబం వుండేది. రైతు భార్య ఎంత అతివాగుడుమనిషంటే, ఆమెనోట్లో నువ్వుగింజయినా దాగదు. ఆవిడ ఓ కొత్త విషయం విన్నక్షణానే, అది ఆ వూళ్ళో అందరికీ తెలిసిపోయిందన్నమాటే!

ఒకనాడా రైతు అడవిలోకెళ్ళాడు. తోడేలు బొరియలు తవ్వుతూండగా అతనికి గుప్తధనం కనిపించింది. అతను తనలో తాను యిట్లా అనుకున్నాడు: యిప్పుడు నేనేం చేసేట్టు? యీ ధనంవిషయం నా భార్యకు తెలిసినట్టయినా, ఊరంతా పొక్కిందన్నమాటే! భూస్వామికే గనక యీ సంగతి తెలిస్తే, అతనే యిదంతా కాజేస్తాడు. మరి మార్గమేమిటి?

...ఇట్లా ఆలోచించగా ఆలోచించగా అతనికో మెరుపులాంటి ఊహ తట్టింది. గుప్తధనాన్ని అట్లానే వుంచి, ఆ చోటు గుర్తుంచుకుని, యింటివైపు నడిచాడు. నదీ ప్రాంతానికి రాగానే వలవైపు చూసుకున్నాడు, దారాలనుపట్టుకు వేళ్ళాడుతూ ఓ చేప కనిపించింది. దాన్ని బయటికి లాగి, మరోచోట వేసిన బోనుదగ్గరికెళ్ళాడు. ఓ కుందేలు చిక్కుకుంది! కుందేలును బయటికి తీసి దానిస్థానంలో చేప వుంచాడు. వలలో కుందేలును పెట్టాడు! చీకటిపడ్డాక యింటికి చేరాడు.

'ఇదిగో, బాగా ఆకలవుతోంది గాని, నిప్పుచేసి రొట్టెలు కాల్చు' అన్నాడు.

"ఏం, ఎందుకేమిటి? యింత రాత్రప్పుడు నిప్పుచెయ్యడమేమిటి? యింత అర్ధరాత్రి నీకు రొట్టెలెవరు కాలుస్తూ కూర్చుంటారు?-యింకేం కావాలో నీకు."

"ఊరికే వాదనకి దిగక నేను చెప్పినట్టల్లా చెయ్యి. నాకు గుప్త ధనం దొరికింది. దాన్ని యీ రాత్రే యింటికి తెచ్చుకోవాలి!"

~~~~*~~~~~~~~~~*~~~~

శ్రీ 'విరించి'

~~~~~~~~~~~~~~~~~~

ఆమె ముఖం చేటంతయింది. అయిదు నిముషాల్లో నిప్పుచేసి రొట్టెలు కాల్చి భర్తకిచ్చింది.

రైతు ఒక రొట్టె తినటం, రెండు మూడు తన భార్య చూడకుండా సంచిలో వేసుకోటం-చేస్తున్నాడు.

'యివాళ నువ్వు రొట్టెలు ఊరికే ఊదేస్తున్నావు. అంత తొందరగా నేను కాల్చలేను.'

'మనం చాలదూరం వెళ్ళాలి. నేను కడుపునిండా తినాలి.'

అతను సంచినిండా రొట్టెలు వేసుకుని-'ఆ! నా కడుపు నిండింది. నువ్వుకూడా తినెయ్యి. యిక బయల్దేరి వెడదాం. తొందరగా తెమలాలి!'

ఇద్దరూ కలిసి బయల్దేరారు. అప్పటికిచాలా చీకటిపడింది. రైతు ముందు నడుస్తున్నాడు. తన సంచిలోంచిరొట్టెలు తీసి ఒక్కొక్క చెట్టుకొమ్మకూ ఒక్కొక్కటి తగిలిస్తూ పోతున్నాడు.

అతని భార్య రొట్టెలు చూసి గట్టింది.

'చూడు, ఆ చెట్లకు రొట్టెలు!'

'అదేం వింత! యివ్వాళేకదా రొట్టెల వర్షం పడింది!'

'ఊహు, చూళ్ళేదు, నేను కిందికే చూస్తూ నడుస్తున్నాను-లేకపోతే పడిపోతానని!'

'ఇక్కడ నేను కుందేలుకోసం బోను పెట్టాను. ఏమున్నా పడ్డదేమో చూదాం పద!'

ఇద్దరూ బోనుదగ్గరికి వెళ్ళారు. రైతు చేపని బయటికి తీశాడు.

'ఇదేమిటి, బోనులో చేప ఎట్లా పడింది?' అనడిగింది భార్య.

'నీకు తెలీదా? నీటిలోనే కాకుండా, భూమ్మీద కూడా వుంటాయి చేపలు.'

'తమాషానే! సాక్షాత్తూ చూడబట్టి గాని, లేకపోతే నేను నమ్మగలిగివుండేదాన్ని గాదు!'

వాళ్ళు నదిదగ్గరికొచ్చారు! 'యీ ప్రాంతాల నువ్వు వలవేసే
~~~~



ఉపాయం



'వుంటావు-ఏదీ చూదాం' అంది భార్య.

వలలో కుందేలు చిక్కుకునుంది.

'ఇవాళ యిదేమిటీ చిత్రాలు! చేపల వల్లో కుందేలా?' అంది భార్య

'యిందులో నీకు ఆశ్చర్యమేమిటో నాకర్థం కావటం లేదు. నీటికుందేళ్ళని ఎరగవా యేమిటి?'

'ఊహు'—ఈసరికి వాళ్లు గుప్తధనంవున్న చోటుకు జేరుకొన్నారు. రైతు తవ్వాడు. వాళ్ళు మోయగలంత బంగారాన్ని తీసుకుబయల్దేరారు.

రోడ్డు భూస్వామి ఇంటిమీదుగా వెడుతుంది. ఆ యింటికి దగ్గరసా వచ్చాక, వాళ్లకు 'బా, బా, బా, అంటూ మేక అరుపు వినవచ్చింది.

'ఓ! యేమిటది! నాకు భయమేస్తోంది' అన్నది భార్య

'పద తొందరగా వెడదాం. భూతాలు గగ్గోలు చేస్తున్నయ్. యజమానిని పీక్కు తింటున్నై,' ఒక్కదాటున వాళ్ళు యిల్లు జేరుకున్నారు. రైతు బంగారాన్ని భద్రంగా దాచి పడుకున్నాడు.

'యీ విషయం, ఎవరికీ చెప్పకేం—మూడోవాడికి తెలిసిందంటే చిక్కులో పడతాం.'

'ఊహు, ఎవరికీ చెప్పన్లే!' అంది అతని భార్య.'

మర్నాడు వాళ్ళిద్దరూ ఆలస్యంగా లేచారు.

రైతు భార్య లేచి పొయ్యి అంటించి, నీళ్ళకు బావిదగ్గరికి వెళ్ళింది.

పొరుగింటామె రైతు భార్యని పలకరించింది:

'యింత ఆలస్య మయిందేం-' అని.

'మెలుకువ రాలేదు. రాత్రంతా నిద్ర లేదు.'

'ఏం?'

'మా ఆయన గుప్తధనాన్ని చూచారు. మేం వెళ్ళి రాత్రికి రాత్రే యింటికి తెచ్చుకున్నాం.'

—ఆరోజల్లా గ్రామంలో యిదే కబుర్లు ఫలానా రైతుదంపతులు గుప్తధనం కనుక్కున్నారు, రెండు బస్తాలనిండా యింటికి తెచ్చుకొన్నారు, అని. సాయంకాలమయ్యేటప్పటికల్లా యీ కబురు భూస్వామికి చేరింది. ఆయన రైతుకు కబురంపాడు.

'నీకు గుప్తధనం కనిపించినట్లు నాకెందుకు చెప్పలేదు?' అనడిగాడు.

'గుప్తధనం? నాకేం తెలీదే!'

'నిజం చెప్పు. నాకంతా తెలిసింది. నీ భార్యే స్వయంగా అందరికీ చెప్పింది.'

'అదా! దానికి మతి సరిగ్గా లేదండీ. కలలో గూడ జరగని సంగతులు చెబుతోంది!' 'ఆ సంగతి విచారించాలి!' అని భూస్వామి రైతుభార్యని పిలిపించాడు.

'నీ భర్త గుప్త ధనాన్ని కనుక్కున్నాడుకదూ?'

'అవును.'

'రాత్రి మీ రిద్దరూ కలిసి వెళ్ళారు కదూ, దాన్ని యింటికి చేర్చేందుకు?'

'అవును బాబూ'

'ఆ సంగతంతా పూర్తిగా చెప్పు-'

'మేం ముందు అడవిలోకి వెళ్లాం. చెట్లనిండా రొట్టెలున్నాయి.'

'రొట్టెలా?'

'అవునండీ. అక్కైన కుందేటి కోసంకోసం చూచాం, దాన్లో చేప పడ్డది. ఆ తరవాత చేపలవల లాగాం, దాన్లో కుందేలు పడ్డది. కుందేటిని చేపని యివతలకి తెచ్చుకున్నాం. గుప్తధనం వున్నచోట ఆమాయన తవ్వాడు. రెండు సంచులనిండా బంగారం యింటికి తెచ్చుకున్నాం. మీ ఇంటిమీదుగా వెళుతుండగా, లోపల పిశాచాలు పోట్లాడుకుంటున్నాయి. మిమ్మల్ని పీక్కుతింటున్నై.'

—ఈ ఆఖరుమాటతో భూస్వామికి అరికాలుమంట నెత్తికెక్కింది.

'ఛీ, అవతలికి పో, తెలివితక్కువదానా!'


'చూచారండీ, దీని మతి ఎంత చలించిపోయిందో. దీనివల్ల నాకు జీవితం దుఃఖభాజన మవుతుంది' అన్నాడు రైతు అతి వినయంగా.

అవును, నాకు నమ్మకం చిక్కింది లే! సరే, నువ్వు వెళ్ళిపో అన్నాడు భూస్వామి.

రైతు తను భూస్వామి మీద ఉపయోగించిన తమాషాకి మనసులో నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.



('రష్యన్ జానపదసాహిత్యం'-నుంచి)



[గత సంచిక తరవాయి]

జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒక రోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్న చిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండ గుట్ట కావచ్చుననీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయిఉంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకా ప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్లవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా మరి కొందరితో సహా సముద్రంలో పడిపోతాడు.

అనువాదం: "వినాయక"

అటుపిమ్మట మా పరిస్థితి క్రమక్రమంగా అధ్వాన్నమై పోయింది. బహుశః మేము మునిగిపోయిన సంగతి ఓడలోనివారెవరు గమనించి ఉండకపోవచ్చును. గమనించినా ఓడ చుక్కాని ధ్వంసమై పోవడంవల్ల ఓడలోనివారేమి చెయ్యడానికీ వీలులేక మాట్లాడకూరుకొని ఉండవచ్చును. మేము బతికి బయటపడడానికి ఒక్కటే మార్గం! మాకోసం సముద్రంలోనికి చిన్న చిన్న నావలు దింపించాలి.

రాత్రి 11 గంటలకు మా నౌకకా ఆఘాతం తగిలింది. ఒంటిగంట అయ్యేసరికి నేను బాగా అలిసిపోయాను. నా ఒళ్ళంతా కొంకరలు పోవడం ప్రారంభమైంది. నా సంత రుణభారం అంతా కాన్సెల్ భుజాల మీదే పడింది. చివరికి అతడు

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

కూడా బాగా అలిసిపోయాడు. ఇక ఆట్టే కాలం ఈదడం అసాధ్యమని అతనికి తెలిసిపోయింది.

నేనీ విషయం గ్రహించి— "కౌన్సెల్! నన్ను వదులు! నామాన నన్ను పోనీ!" అని గట్టిగా అరిచాను.

"మిమ్మల్నా! విడిచిపెట్టడమా? అది ఎన్నటికీ జరగదు! మీతో పాటు నేను కూడా మునిగి పోతాను!" అన్నాడు కౌన్సెల్.

ఇంతలో తూర్పుదిశగా గాలి వీచింది; ఆ గాలికి చెదిరిపోయిన మేఘశకలం చిట్టచివర చంద్రబింబం ప్రత్యక్షమైంది. చంద్రకాంతిలో సముద్రతరంగాలు తళతళా మెరిశాయి. నేను తల పైకెత్తి చూచాను. కొంచెందూరంలో మా యుద్ధనౌక అబ్రహామ్ లింకన్ కనిపించింది. మా కది ఇంచుమించుగా అయిదు మైళ్ళ దూరంలో ఉండవచ్చును. అది మా కొక నల్లని భూతంలామాత్రమే కనిపించింది. దానిదగ్గర చిన్న చిన్న నావలు సముద్రంలోనికి దింపిన జాడ లేవీ కనిపించలేదు.

ఒక పెద్ద కేక వేద్దామని బుద్ధి పుట్టింది గాని అంతదూరంలో ఆ ఓడ ఉన్నప్పుడు దానివల్ల ప్రయోజన మేమీ లేదని అనిపించింది. అదీగాక నా పెదవులు ఉప్పునీటిలో నాని బాగా వాచిపోయాయి. కౌన్సెల్ కింకా కేకలుపెట్టేశక్తి పోలేదు. అతడనేకసార్లు రక్షించ వలసిందని కేకలు పెట్టాడు.

కొంతసేపు తర్వాత అతని సమాధానం ఏదైనా వినబడుతుందేమోనని ఎదురుచూచాను. కౌన్సెల్ పెట్టిన కేక కేదో సమాధానం వచ్చినట్లే అనిపించింది.

"నీ కేమైనా వినిపించిందా?" అని అడిగాను.

"అవునవును! వినిపించింది!"

కౌన్సెల్ మళ్ళీ శాయశక్తులా గట్టిగా కేకపెట్టాడు. ఈసారి తప్పకుండా ఎవరో సమాధానం ఇచ్చినట్లే వినిపించింది. ఆ సమాధానం ఎవరిచ్చారో మాత్రం స్పష్టంగా వినబడలేదు! మాలాంటి మంద భాగ్యులెవరైనా ఆవిధంగా కేకలు పెట్టేరేమో! లేకపోతే ఏదైనా ఒక నావ మావైపు వస్తూన్నదేమో!

కౌన్సెల్ అతికష్టంమీద ఒక అడుగుమేరవరకు నీటిపైకి లేచి శాయశక్తులా చప్పట్లు కొట్టాడు. తరవాత నేను బాగా అలిసిపోయాను! ఇంక ఊపిరి విడవడానికి కూడా శక్తిలేదు! ఆ పరిస్థితిలో మెల్లిమెల్లిగా నీటిలో మునిగిపోయాను.

ఆ సమయంలో నే నొక గట్టి వస్తువుతో ఢీకొన్నాను. ఇక గత్యంతరంలేక వెంటనే దాన్ని నా రెండు చేతులతోను గట్టిగాపట్టుకున్నాను. నీటిలోనించి నన్నెవరో పైకి లేవదీసినట్లయింది. తరవాత నాకు కొంచెం స్పృహతప్పినట్లయింది. పిమ్మట నా శరీరంమీద ఎవరో మర్దనా చేస్తున్నట్లనిపించింది. కొంతసేపటికి మెల్లిగా కళ్ళు తెరిచాను. నెమ్మదిగా—"కౌన్సెల్!" అని పిలిచాను.

"పిలిచారా?" అన్నట్లు సమాధానం వచ్చింది.

తరవాత-వెన్నెలలో ఆ సమాధానం ఇచ్చిన వ్యక్తికేసి చూశాను. అతడు కౌన్సెల్ కాడు. కాని ఆ వ్యక్తి నాకు పరిచితుడే!

"నెడ్ లాండ్! నీవా?"

"అవును నేనే సార్!"

"ఓడకు దెబ్బ తగిలినప్పుడు నీవు కూడా సముద్రంలో పడిపోయావా?"

బాలగేయం:

పిల్ల - పళ్లు

బి. రాజేశ్వరమూర్తి


దారిప్రక్క
జామచెట్టు
చెట్టు చాల
పెద్ద చెట్టు.

చెట్టుమీద
తీపి పళ్లు
పళ్లమీద
పిల్ల కళ్లు!

కళ్లు రెండు
జాలి కళ్లు.
కాళ్లు పాపం!
అవిటి కాళ్లు!

బాలులార!
రారండి!
చెట్టుకొమ్మ
ఎక్కండి.

పళ్లు కోసి
పిల్ల కిచ్చి
చల్లగ
ఇళ్లకు రండి!



జంతర్ మంతర్ - ఢిల్లీ

ఫోటో: నిమ్మగడ్డ దసరత్న ప్రసాద్, విజయవాడ.

"పడిపోయాను గాని అదృష్ట వశాత్తు ఒక తేలే ద్వీపంమీద పడ్డాను."

"తేలే ద్వీపమా?"

"అవును! అంటే అది మన తిమింగిలగిల మన్నమాట!"

"నువ్వు చెప్పేదేమిటో నాకు తిన్నగా బోధపడటం లేదు!"

"నేను చెప్పేదాన్లో విస్తారం ఏమీ లేదు! నేను బల్లెం విసిరినప్పుడు ఆ జంతువు ఎందుకు గుచ్చుకో లేదో నాకిప్పుడు బోధపడిపోయింది"

"ఎందుచేత గుచ్చుకోలేదు?"

"ఎందుచేతా? ఆ జంతువు చర్మంఅంతా గట్టి ఇనపకవచమే!"

తరవాత నెమ్మదిగా ఆ జల జంతువు మూపుమీదికి జేరుకొన్నాను. కాళ్ళు దానిమూపుమీద పెట్టి నిలబడ్డాను. దాని శరీరం గట్టి ఉక్కుకవచంలాగే తగిలింది. అంతేగాని అది సామాన్యంగా కనిపించే జలజంతువుల చర్మంలా లేదు. దాని చర్మం నల్లని ఉక్కులాగే నున్నగా తగిలింది. అందుచేత ఆ జలజంతువే వర్గానికి చెందినదో బోధపడ లేదు.

దానిమీదికి బల్లెం విసిరినప్పుడు లోహానికి తగిలినట్టుగా చప్పుడైంది. అందులో అనుమానం కేమీ లేదు. ఆ జంతువు సర్వాంగాన్నీ వాలునిండుకుని ఉన్నది. ప్రపంచంలో ఎన్నో ఊహాగానాలు బయలుదేరాయి. కాని అది ఆ ఊహాగానాలన్నిటిని తలదన్నిన అత్యద్భుత జలచరంలా కనబడింది!

మేమిద్దరము అలాగే కొంతసేపటి వరకు ఆ జలజంతువు మూపుమీదే కూర్చున్నాము. అదేదో ఒంటరి ద్వీపంలాగే ఉన్నది గాని దాని ఆకారం అంతా సముద్రపు తిమింగిలమే. నిజానికి మాత్రం అది ఒక పెద్ద జలాంత

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

గ్గామి అయిఉండాలని అన్నాడు. మా ఇద్దరికీ అతని అభిప్రాయంలో ఏకీభవించక తప్పలేదు.

"దీనికి లోలోపల కొన్ని ఇంజనులు, కొంతమంది నావికులుకూడా ఉండితీరాలి!" అన్నాను.

"నిజమే! కాని నేను మూడు గంటలనించీ దీనివీపుమీద కూర్చున్నానుగాని దీనిలో చైతన్యసూచన లేవీ కనిపించడంలేదే!" అన్నాడు నెడ్ లాండ్.

"అయితే ఇది కదలడంలేదా?"

"లేదు! కెరటాల్లో ఉయ్యాల లూగుతూంది. అంతే!"

"కాని ఇది మహావేగంతో వెళ్లిపోవడం మనం అంతాకళ్లారా చూచాముగదా! అంత వేగం రావాలంటే దీని లోలోపల ఏదో ఒక ఇంజను ఉండితీరాలి. 'దానితో పాటు దానినినడిపే యంత్రశాస్త్రజ్ఞుడు కూడా ఉండితీరాలి. అందుచేత మనకి పూర్తిగా ప్రాణభయం తప్పిందనే అనుకుంటున్నాను."

సరిగా అదే సమయంలో—నా వాదానికి భరవాసా ఇవ్వడానికే కాబోలు—ఆ జంతువు పూర్వ భాగంలో పెద్ద సవ్వడి చెలరేగింది. క్రమ క్రమంగా కొంచెం కదలిక కూడా ప్రారంభమైనది. మేము అతి కష్టంమీద దాని వీపు గట్టిగా పట్టుకు కూర్చున్నాము. నీళ్ళు నీటి మీద ఒకగజం దాకా పైకి లేచి ఉండడం వల్ల మాకంతగా ఇబ్బంది కలగలేదు. అదీగాక అది కొంచెం నెమ్మదిగా పోవడం కూడా మా కుపయోగించింది.

"ఇది ఇలాగే హాయిగా పోతే బాగానే ఉంటుంది గాని నీటిలో ముణిగిందంటే మాత్రం మన పని అయిపోతుంది!"

అతడంతగా తన అభిప్రాయా లంత స్పష్టంగా వ్యక్తంచేసి ఉండక పోతే ఇంకా బాగుండేది. ఏది ఏమైనా జలాంతర్గామి లోలోపల దాగిఉన్న జనంతో మాట్లాడడం తప్పనిసరిగా తయారయింది. నేనా జలాంతర్గామిలోలోపలికి వెళ్ల డానికి టాపుమీదనుంచి దారి ఏదైనా ఉన్నదేమోనని వెదకడం మొదలు పెట్టాను. ఎక్కడా ఏమీ దారి కనబడలేదు.

అదీగాక చంద్రబింబం అస్తమించడంతో ఆ ప్రాంతం అంతా మసక మసకగా తయారయింది. అందుచేత తెల్లవారేదాకా వేచి ఉండడం తప్ప మాకిక వేరే గత్యంతర మేమీ కనబడలేదు.

మొత్తంమీద మా భవిష్యత్తంతా ఆ జలాంతర్గామి నడిపించే ఆసామీమీదే ఆధారపడిఉంది. అతగాడు కనక అది సముద్ర గర్భంలో నడిపిస్తే మా అందరి పనీ అయిపోయిందన్న మాటే! కాని ఆ జలాంతర్గామిలో ఉన్న జనం అప్పుడప్పుడు గాలి పోసుకోవడానికి పైకి రాక తప్పదు. అందుచేత ఆ జలాంతర్గామికి బాగా గాలి పోసుకోవడాని కనువైన మార్గమేదో ఉండితీరాలన్నమాటే!



ఇక మమ్మల్ని కెప్టెన్ ఫరాగూ రక్షిస్తాడనే ఆశ ఏమాత్రం కనబడలేదు! మేము క్రమక్రమంగా పశ్చిమ దిశగా ప్రయాణం సాగించాము. ఎంత నెమ్మదిగా పోతున్నా మేము ఎక్కి కూర్చున్న జలాంతర్గామి గంటకు పది పన్నెండు మైళ్ళ వేగంతో కదిలిపోతున్నదని చెప్పవచ్చును.

తెల్లవారగట్ల 4 గంటలవేళ జలాంతర్గామి వేగం బాగా ఎక్కువైంది. అయినా ఎల్లాగో అలాగ దాని మూపు పట్టుకుని మేమంతా మా ప్రాణాలు దక్కించుకొన్నాము.

చిట్టచివరి కలి కష్టంమీద ఆ రాత్రిఅంతా గడిచిపోయింది. రాత్రి చివరిభాగంలో ఏమి జరిగిందో అంత స్పష్టంగా జ్ఞాపకం లేదు గాని ఒక్క చిన్నసంగతిమాత్రం బాగా జ్ఞాపకం ఉంది. నా కప్పుడప్పుడు లోలోపలినుంచి ఏవేవో సంగీత ధ్వనులవంటి ధ్వనులు వినిపించినట్లయింది. ఈ జలాంతర్గామిలో ఎలాంటి అత్యద్భుత వస్తువులున్నాయో ఎవరు చెప్పగలరు? దీని లోలోపల ఎలాంటి వింత మనుష్యులున్నారో! ఇంత వేగంగా కదిలిపోవడానికి దీనిలో ఎలాంటి చిత్ర, విచిత్రమైన యంత్రాలమర్చారో ఎవరు చెప్పగలరు?

తెల్లవారిన తరవాత మాచుట్టూ దట్టంగా మంచుముసు గావరించుకొన్నది. క్రమక్రమంగా అది అంతా పూర్తిగా విడిపోయింది. వెంటనే నేను జలాంతర్గామి టాపంతా అతిజాగ్రత్తగా పరిశీలించాను. అలాగ కొంతసేపయ్యేసరికి జలాంతర్గామి నెమ్మది నెమ్మదిగా మునిగిపోతున్నదని అనిపించింది.

"దెయ్యాల్లా లోపల కూచున్నారా? తెరవండయ్యా తలుపులు!" అని గట్టిగా అరిచాడు నెడ్ లాండ్. తరవాత ఆ టాపుమీద గట్టిగా తన్నడం మొదలుపెట్టాడు. ఆ దెబ్బలతో టాపు ఖంగుఖంగున మారుమోగింది.

అయితే ఆ బ్రహ్మాండమైన సముద్రం రణగొణధ్వనిలో ఎంత గట్టిగా కేకలు పెట్టినా మాట వినబడడం చాలాకష్టం. అయితే కొంత సేపటికి జలాంతర్గామి లోలోపలికి మునిగిపోవడం ఆగిపోయింది.

అంతలో ఓడ లోలోపలిభాగం నించి తలుపులు తెరిచిన చప్పుడు వినబడింది. హఠాత్తుగా టాపు పైతలుపు తెరుచుకొని ఒక విచిత్ర వ్యక్తి పైకి వచ్చాడు. మమ్మల్ని చూచి హడిలిపోయి ఒక పెద్ద గావుకేక పెట్టాడు! వెంటనే జలాంతర్గామి లోపల అదృశ్యమైపోయాడు!

అటు పిమ్మట కొంత సేపటికి 8 గురు ముసుగుమనుష్యులు పైకి వచ్చారు. వాళ్ళంతా ఉక్కుముక్కల్లాగున్నారు.

జబ్బలుచ్చుకొని మమ్మల్ని అందరినీ బరబరా ఆ జలాంతర్గామి లోపలికి లాక్కుపోయారు.

—ఇంకా ఉంది.

దారి తప్పిన ఈగలు

కోమటి కోటయ్యగారి మిఠాయి కొట్టు ఆ ఊళ్లో చాలా పేరు పడింది. లడ్డులు, మైసూర్ పాక్‌లు, జాంగ్రీలు, బాదుషాలు మొదలైన నాగరిక పదార్థాలు, బెల్లపుమిఠాయి ఉండలు, జీడిపప్పు, గవ్వలు, పేలాల ఉండలు మొదలైన నాటుదినుసులు-ఒకటేమిటి ఆ కొట్లో దొరకని తీపి వస్తువే లేదు!

ఆ కొట్టును ఆశ్రయించుకొని, తరతరాలుగా ఒక ఈగ కుటుంబం తామరతంపరగా వృద్ధి చెందుతూ వచ్చింది. ఇప్పటితరంలో పెద్ద ఈగయొక్క తాత, కోటయ్య తండ్రి కాలంనుంచీ ఆ కొట్టునే ఆశ్రయించుకొని అక్కడి తీపిపదార్థాల మీద-స్వేచ్ఛగా వాలుతూ కడుపు నిండుగా మిఠాయి ఆరగిస్తూ, హాయిగా కాలక్షేపం చేస్తున్నది. మిఠాయిదినుసులు పెట్టే అద్దాల బీరువా అడుగు అరక్రింద మసిపి. కంటి కగపడకుండా ఇన్నేళ్ళు గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుతూ, ఆ ఊళ్ళోని ఈగకుటుంబాలలో కెల్లా గొప్పవారనే పేరుకూడా సంపాదించుకున్నాయి. మురుగు కాల్వల్నీ, పేడకుప్పల్నీ, రొచ్చు గుంటల్నీ, చేపలకొట్లనీ ఆశ్రయించుకున్న ఈగకుటుంబాల వారు, కసాయి దుకాణాలలో కాపురం ఉంటున్న ఈగజాతివారు, మిఠాయి ఈగ కుటుంబంవారంటే ఎంతో గౌరవంగా చూస్తుండేవారు.

మిఠాయివారి యింట చిన్న ఆడ ఈగ పుట్టింది. ఆ ఈగపిల్ల పుట్టిన రోజు పండగకి ఆ ఊళ్ళో ఉన్న ఈగలకన్నింటికీ విందుజరిగింది. ఆరోజున కోటయ్య మిఠాయికొట్టుమీద పడి, ఈగలన్నీ కొల్లగొట్టాయి రకరకాల మిఠాయిల రుచిచూసిన ఈగలు లొట్టలువేసుకొంటూ, మిఠాయికుటుంబం వారిఅదృష్టాన్ని పొగడుతూ, తమ ఇళ్ళకు వెళ్ళిపోయాయి.

మందరపు
వెంకటేశ్వరరావు

ఈ విందులో పాల్గొనడానికి వచ్చిన కసాయివారికుటుంబం కూడ ఆ ఊళ్ళో చాలాకాలంగా స్థిరనివాసం ఏర్పరచుకొన్న ఈగల కుటుంబాలలో ఒకటి. ఈ కుటుంబంలోని ఈగలలోనే పెద్దపెద్ద వస్తాదులు పుట్టి మక్షికలోకంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొన్నాయి. నూర్ ఖాన్ సాయిబు మాంసం కొట్టును చిరకాలం ఆశ్రయించుకొని ఉండడం చేత ఈ కుటుంబం వారికి కసాయివారనే పేరు సార్థకమైపోయింది. మిఠాయివారి విందులో పాల్గొనడానికి కసాయివారి ఈగలన్నీ వచ్చాయి. ఆనాటినుంచీ కసాయివారికీ, మిఠాయివారికీ స్నేహం కలిసి ఎక్కడైనా తారసిల్లినప్పుడు 'ఓహో!' అంటే 'ఓహో!' అనుకొంటూ ఒకర్ని ఒకరు పలకరించుకొనేవారు.

'కసాయివారి మగ ఈగపిల్లకూ, పుట్టినరోజు పండగ చేసుకొన్న మిఠాయివారి ఆడ ఈగపిల్లకూ, ఆ రోజునుంచీ జతకలిసి ఆడుకొంటూండేవి. అప్పుడప్పుడు కసాయివారి ఈగ అబ్బాయి మిఠాయివారి ఈగ అమ్మాయి యింటికి వెళ్ళినప్పుడు మిఠాయివారి అమ్మాయి కొత్త కొత్త మిఠాయి దినుసుల్లోంచి తొండంతో చిన్న చిన్న పలుకులు పెకలించుకువచ్చి ఫలహారంపెట్టి గౌరవిస్తుండేది.

క్రమక్రమంగా ఈ రెండు పిల్ల ఈగలు పెద్దవి అయ్యాయి. మిఠాయివారు తమ ఈగ అమ్మాయికి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ కసాయివారి అబ్బాయితో కలిగిన చనువు, స్నేహంగా మారి ప్రేమగా బలపడిపోయింది. అందుచేత పెద్దలు చూస్తున్న సంబంధాలు, చేస్తున్న ప్రయత్నాలు ఆ ఈగ అమ్మాయికి నచ్చలేదు. ఆ పక్కఊళ్ళోని 'కాఫీ అండ్ భోజనహోటలు'లో కాపురం ఉంటూన్న 'హోటలు'వారని పేరు పడిన ఈగ కుటుంబం పెద్దలు వచ్చి ఈ ఈగ అమ్మాయిని చూసుకొని



ఎంత దాహం

ఫొటో: జి. వి. రామమూర్తి—మచిలీపట్నం.

వెళ్ళారు. వీరికీ వారికీ సంబంధాలు వచ్చాయి. ఈ ఈగ అమ్మాయి ఉండబట్టలేక తల్లి ఈగ దగ్గరకు వెళ్లి 'ఇప్పుడు నాకీపెళ్లి వద్దమ్మా' అని చెప్పింది. తల్లి ఈగ ఆశ్చర్యపోయి, 'ఇదేవిటే చిన్నీ! ఈ విడ్డూరం! మీ నాన్న రెక్కలు ముక్కలయ్యేలాగ ఊళ్ళన్నీ ఎగిరి ఎగిరి, మన హోదాకు తగిన ఎంతక్కటి సంబంధం తెస్తే పెళ్లే వద్దంటావు. నీకేమైనా మతిపోయిందా ఏమిటి?" అంది. ఈగపిల్ల ఏడుపు ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ-"కసాయి వారి అబ్బాయినయితే చేసుకుంటాను" అని మనసులో మాట వెళ్లగక్కి బైటికి ఎగిరి వెళ్ళిపోయింది. పిల్లమాటలకు కలిగిన ఆశ్చర్యం నుంచి కాస్సేపటికి తేరుకొని, తల్లి ఈగ తండ్రి ఈగ దగ్గరకు వెళ్లి పిల్ల ఈగ చెప్పిన సంగతి చెప్పింది. తండ్రి ఈగ కోపం పట్టలేక ఇటూ, అటూ ఎగిరి, తిరిగివచ్చి [illegible] తల్లి ఈగతో ఇలా అంది-"మన హోదా ఎక్కడ? వాళ్ళ హోదా ఎక్కడ? వెధవ మాంసపు ముక్కలు, రక్తపు గడ్డలు కొరుక్కుతినే ఆ కసాయి వాళ్ళెక్కడ? మనమెక్కడ? ఈ పెళ్లి జరగడానికి వీలు లేదు."

అక్కడ కసాయివారి ఈగ అబ్బాయికి కూడా వాళ్ళ ఈగపెద్దలు ఆ సమయంలోనే పెళ్ళి తలపెట్టారు. ఆ ఈగ అబ్బాయి తల్లిదండ్రులతో తాను మిఠాయివారి అమ్మాయిని తప్ప ఇంకెవ్వర్నీ పెళ్లాడనని కచ్చితంగా చెప్పాడు. కసాయి ఈగ పెద్దలు ఈగ అబ్బాయికి పరిపరి విధాల నచ్చచెప్పారు-"నాయనా, వియ్యానికీ, కయ్యానికీ సమఉజ్జీ ఉండాలి. మనలో మిఠాయివారు గొప్పవారని పేరుపడ్డారు. నిత్యం మిఠాయి తప్ప మరొకటి ముట్టుకోరు. వాళ్ళ తాతతండ్రులదగ్గ

★ దారితప్పిన ఈగలు ★

క్నించీ అలాగే జరుగుతుంటూ గర్వించి ఉన్నారు. మనమంటే వాళ్ళకు మొదటినించీ లోకువే. పోటీజాతివాళ్ళమని గౌరవిస్తున్నట్టు కనిపిస్తారే గాని నిజానికి మనల్ని లోలోపల తక్కువ చూపు చూస్తూనే ఉన్నారు. ఆ యింటి పిల్లను తెచ్చుకొని మనం నిగ్రహించుకోలేం నాయనా, పెద్ద బజారు చేపల మార్కెట్టువారి చిన్న అమ్మాయిని ఇస్తామంటున్నారు. 'తర్వాత నీ యిష్టం!" అని చెప్పారు.

ఇక్కడ మిఠాయివారి ఈగ అమ్మాయి, అక్కడ కసాయివారి ఈగ అబ్బాయి పట్టినపట్టు విడవకపోవడంవల్ల పెద్ద ఈగలకెంత యిష్టంలేకపోయినా ఆ రెండు ఈగలకూ పెళ్ళిచేయక తప్పింది కాదు.

పెళ్ళి అయిన తర్వాత మిఠాయివారి అమ్మాయి కసాయివారి యింటికి కాపరానికి వెళ్ళింది. అత్తవారిల్లు అంతకు ముందెప్పుడూ చూడలేదు. అత్తఈగ నేలమీద పడిన రక్తపుముద్దలమీద ప్రాలి గడ్డకట్టిన రక్తాన్ని గోలుకుతూంది. మాావ ఈగ, ఇతర ఈగలు కలిసి వేలాడగట్టిన మాంసపు ముక్కల మీదకు జుమ్మని ముసురుతూ, లేస్తూ కనిపించాయి. ఆ దృశ్యం చూడగానే మిఠాయివారి ఈగకు వాంతిపర్యంతం అయింది. "అయ్యబాబో...! ఈ యింట్లో నే నెలా ఉండను?" అనుకొంది. కసాయివారి ఈగ అబ్బాయి వచ్చి భార్యఈగను లోపలికి తీసుకువెళ్ళాడు. "ఏవిటీ వెధవవాసన? ఎలా ఉంటున్నారు మీరిక్కడ?" అంటూ భర్తఈగతో లోపలకు వెడుతూ అంది. "రెండు రోజులుంటే నీకే అలవాటవుతుంది లెద్దూ" అన్నాడు ఈగ అబ్బాయి.

మాంసపు ముక్కలు, రక్తపు మరకలు చూస్తేనే వాంతిచేసుకొంటున్న మిఠాయివారి ఈగమ్మాయి ప్రతిరోజు భర్తను పుట్టింటికిపంపించి మిఠాయి పలుకులు తెప్పించుకొని కాలం గడుపుతోంది. ఈ ఈగ అమ్మాయి ఆ యింట్లో శ్లేష్మంలో పడినట్టు కొట్టుకొంటూంది. అక్కడ నుంచి ఎప్పుడు ఎగిరిపోవడమా అనే ఆలోచిస్తూవుంది. ఈవిడ అతిశయం చూస్తే కసాయివారికి చాలా అసహ్యంగా వుంది.

ఆరోజున మిఠాయివారి ఈగ చిన్నది నిద్రలేస్తూండగానే భర్త ఈగ వచ్చి—"ఇదుగో చూడు, ఇవ్వాళ సంతరోజు. మేమందరం చేపల మార్కెట్టుకు వెళుతున్నాం. సాయంత్రంలోగా తిరిగి రావడం పడదు. మా తమ్ముణ్ణి మీ ఇంటికి పంపి అన్నం తెప్పించుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు. మగ ఈగ చెప్పినప్రకారం మిఠాయివారి అమ్మాయి, కసాయివారి చిన్న ఈగపిల్లవాణ్ణి పిలిచి, పుట్టింటికివెళ్ళి మిఠాయి తెమ్మని పంపింది.

వెళ్ళిన ఈగపిల్ల ఎంతకూ తిరిగి రాలేదు. ఇక్కడ ఈవిడకు ఆకలి ముండుకుపోతోంది. ఇంకా వస్తాడు, వస్తాడు అని చూస్తూండగా వెళ్లిన ఈ కసాయివారి ఈగచిన్నవాడు మిఠాయివారి యింట్లో స్పృహ తప్పిపోయాడనే కబురు వచ్చింది. కబురు తెలియగానే ఈవిడ రివ్వున పుట్టింటికి ఎగిరివెళ్లింది. ఈ సంగతి చేపలమార్కెట్టుకు వెళ్లిన కసాయివారి కుటుంబానికి తెలిసి ఆ ఈగలన్నీ జుమ్మని వచ్చి ప్రాలాయి. పాపం ఆ చిన్న ఈగ తెలివితప్పి మిఠాయిపళ్లెం దగ్గరపడి గిలగిలతన్నుకొంటున్నదీ కాస్సేపు అలా తన్నుకొని ప్రాణం వదిలింది. మిఠాయివారి పెద్ద ఈగ విచారంగా కసాయివారిని చూస్తూ—"ఏం చెయ్యం? చిటికెలో ఈ ఆపద విరుచుకుపడింది. నిన్న మా కోటయ్యసెట్టి కొట్టును హెల్త్ ఇనస్పెక్టరు తనిఖీ చేస్తున్నప్పుడు మేమందరం ఆ దుష్టుడికళ్ళ పడ్డాం. ఆ ఇనస్పెక్టరు మమ్మల్ని చూపిస్తూ కోటయ్యతో - "ఇలా ఈగలు ముసురుతున్న సరుకు ఇకముందు అమ్మేవంటే కేసుపెట్టి జుల్మానా వేయిస్తాను. జాగ్రత్త?" అని భయపెట్టి వెళ్ళాడు. ఇవ్వాళ మన అబ్బాయి వచ్చేసరికి మేం ఇంట్లో నక్కి ఉన్నాం. కోటయ్య ఇవ్వాళ మా పని పట్టిస్తాడని మేం ముందే గ్రహించి, పైకి రాకుండా అణిగి మణిగి కూర్చున్నాం. వచ్చిన మన అబ్బాయి తిన్నగా యింట్లోకి రాక, ఈ పళ్లెంమీద, ఆ పళ్లెంమీద

వ్రాలుతూ గొంతులేస్తూన్నట్టున్నాడు. ఘుమఘుమలాడే మిఠాయి చూస్తే ఎవరికైనా నోరూరుతుందనుకోండి. ఇంతలో కోటయ్య అలమారులోంచి "ఫ్లిట్ స్ప్రేయర్" తీసి బీరువా అంతా జల్లడం ప్రారంభించాడు. వాసన తగిలేసరికి మేం ఇంకా లోపలికిపోయి కూర్చున్నాం, కాస్సేపటికి బైటకువచ్చి చూసేసరికి, ఇదుగో ఈ పళ్ళెం ప్రక్క గిలగిల తన్నుకొంటూ కనిపించాడు. ఫ్లిట్ మీద పడి ఉంటుంది. మేం ఈ ధక్కామొక్కీలకు అలవాటుపడ్డవాళ్ళం కాబట్టి తప్పిజారి ఆ ఫ్లిట్‌మీద పడినా తప్పించుకుపోతున్నాం" అని చెప్పి ఊరడించింది.

కసాయివారి ఈగలు వసుస్తూ, మొత్తుకొంటూ ఇంటికి తిరిగి వచ్చాయి. వాటి విచారం మిఠాయివారి అమ్మాయి ఈగ కోపంగా పరిణమించింది "ఈ ఈగ ముండ వల్లే మా కిన్ని తిప్పలు వచ్చాయి. ఈ మహారాణీగారికి రక్తమాంసాలు సహించవు. మావాణ్ణి పెళ్ళాడే ముందే ఇవన్నీ ఆలోచించుకోలేకపోయిందా" అని సాధింపులు ఎక్కువైనాయి.

మిఠాయివారి అమ్మాయికి దినదిన గండంగా ఉంది. ఒకరోజున భర్త ఈగను చూసి-"ఈ ఇంట్లో ఉంటే నే నూనెగిన్నెలోనో పడి చస్తాను. ఎక్కడికైనా ఎగిరిపోదాం వస్తారా రారా?" అని పోరుపెట్టింది. ఇటూ అటూ చెప్పలేని కసాయివారి ఈగ అబ్బాయి చివరకు చేసేదిలేక భార్య ఈగతో కలిసి ఎక్కడికైనా ఎగిరిపోవడానికే నిశ్చయం చేసుకొన్నాడు. ఆ మర్నాడే రెండు ఈగలూ ఇల్లువదలి ఎగిరిపోయాయి.

కసాయికుటుంబంలోని ముసలి ఈగకు ఈసంగతి తెలిసి-"అవునుతే, పిల్లకు ప్రేమతప్ప మరేమీ కనబడడంలేదు. పరిస్థితుల్ని అర్థం చేసుకోలేని పిల్ల కష్టమూనను ప్రేమే. అనుభవిస్తారు కాక్షింఫ్" అని గొణుక్కుంది.

ఈగ దంపతులు ఇల్లువదిలిన తర్వాత ప్రొద్దుటనుంచి సాయంత్రం వరకు ఎగిరి, ఎగిరి, దారితప్పి, ఒక పొలంవస్తే అక్కడ ఒక చెట్టుమీద ఆగాయి. ఆడ ఈగకు ఆకలి మండుకుపోతూంది. మగ ఈగకూ ఆకలిగానే ఉంది. ఆ పొలంలో మిఠాయి ఉంటే ఎక్కడినుంచి వస్తాయి? ఆ చెట్టుక్రింద పడుకొనిఉన్న ఎద్దు మూపుమీద పెద్ద పుండువుంటే దాన్ని కాకులు ముద్దుగా పొడుచుకు తింటున్నాయి. ఆ పుండును చూసేసరికి కసాయివారి అబ్బాయికి నోరూరింది. మిఠాయివారి అమ్మాయిని చూసి "నీకేమో బాగా ఆకలిగాఉంది. అయినా మిఠాయి తప్ప మరొకటి ముట్టవాయె. ఆ ఎద్దు పుండు చూస్తుంటే నా నోరూరుతూంది. కళ్లు మూసుకొని నువ్వు కూడా కాస్త అదే ఎంగిలిపడు. ఈ పొలంలో మనకేం దొరుకుతుంది" అని కసాయివారి ఈగ అబ్బాయి చెప్పాడు. కాలే కడుపుకు మండే బూడిద అన్నట్టు మిఠాయివారి ఈగ అమ్మాయి చేసేదిలేక, ప్రాణాలు కడబట్టుకూంటే, ఆ పుండుమీద వ్రాలి, చిన్న మాంసంపలుకు పెకలించి కడుపు నింపుకొంది. మగ ఈగకు కమ్మని ఫలహారమే అది!

కడుపు నింపుకొని చెట్టుమీదకు వచ్చి వ్రాలిన ఆ ఈగ దంపతులకు అల్లంతదూరాన చెట్టుకొమ్మల మధ్య చక్కని సాలిగూడు ఒకటి కనిపించింది. సూర్యుడి సాయంకాల కిరణాలు పడి ఆ గూడు మిలమిలా మెరిసిపోతోంది. మిఠాయివారి ఈగ ఆ గూటి సౌందర్యానికి మైమరిచి-"చూడండి, అదేమిటో గాని చాలా చిత్రంగా ఉంది. ఈ రాత్రి దాని మీద నిద్రపోదాం" అని చెబుతూనే ఎగిరి సాలిగూడుమీద వ్రాలింది. వ్రాలిన ఈగ సాలిగూట్లో చిక్కుపడి, కదలలేక గిలగిల తన్నుకొంటూంది. భార్య ఆపదలో చిక్కుకున్నట్టు చూసిన మగ ఈగ లేచి రివ్వున ఎగిరివెడుతూ ఆ సాలిగూటికే తగుల్కొని తానూ చిక్కుపడిపోయింది. ఎంత గింజుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఇల్లు కదిలి రాకపోతే ఈ ఆపద వచ్చేది కాదుగదా' అన్నట్టు ఆడ ఈగ కేసి చూసింది. ఆడ ఈగ ఏడుస్తూ ఏదో చెప్పబోతుండగా గూడుమధ్య పొంచివున్న సాలిపురుగు ఒక్క పరుగున వచ్చి ఆడ ఈగను దారంతో చుట్టబెట్టివేసింది. భార్యను రక్షిద్దామని గింజుకొంటున్న మగ ఈగమీదకు సాలీడు దృష్టి మరలింది. ఒక్క పరుగులో వచ్చి మగ ఈగనుకూడా దారంతో చుట్టబెట్టి చంపివేసింది.

ఆ ఈగదంపతుల్ని సాలీడు ఆ రాత్రి హాయిగా ఆరగించాడు. సాలీడుకు మిఠాయివారి ఈగ ఎంత కమ్మగా ఉందో, కసాయివారి ఈగ కూడా అంతే రుచిగా ఉంది!



జిత్తుల మారి

ఒకనాడు పార్వతి పరమశివుని "మాయ" అంటే ఏమిటని ప్రశ్నించెను. "నాతో భూలోకానికి వస్తే 'మాయ' అంటే ఏమిటో తెలియజేస్తాను" అని అన్నాడు పరమశివుడు. పార్వతీపరమేశ్వరులు భూలోకానికి బయలుదేరేరు. ఒక అడవిలో ఒక ఏనుగు చచ్చిపడి వుంది. ఆకలిబాధచే నకనకలాడుచున్న ఒకనక్క ఆహారంకోసం అడవిలోనికి వచ్చింది. చచ్చిన ఏనుగును చూచిన నక్కకు చాలా ఆనందం అయింది. ఏనుగు కడుపు వద్దకు వెళ్లి చిన్నకన్నం చేసి ఏనుగు కడుపులోనికి ప్రవేశించి లోపల మాంసం తృప్తిగా భుజించింది. ఆరు మాసములవరకు నేను ఆహారం కోసం తంటాలుపడనవసరం లేదని నక్క అనుకొంది. ఏనుగు కడుపులో మాంసం తినడం, అక్కడే నిద్రించడం, అవసరమైనప్పుడు కన్నం ద్వారా బయటకు రావడం, లోనికి వెళ్ళడం ఈ విధంగా నక్క కులాసాగా కాలం గడుపుచుండెను. శీతాకాలం గడిచి వేసంగి ప్రవేశించింది. ఏనుగు కడుపుమీద వున్న కన్నము క్రమక్రమంగా చిన్నదైంది. ఈ సంగతి నక్క గ్రహించలేదు. ఆఖరికి కన్నము మూసుకొని ఉంది. మామూలు అలవాటుప్రకారం నక్క బయటకు రావడానికి ప్రయత్నించగా ఏ మార్గము కనిపించలేదు. పళ్ళతో కొరికినా మార్గం ఏర్పడలేదు. ఎండ వేడిమి తగులుటచే ఏనుగు కళేబరం గట్టిపడింది. నక్క ఏనుగు కడుపులో చిక్కుకుంది. నక్క బయటకు రాలేదు; లోపల వుండలేదు. ఏనుగుకడుపులోనుండి పెద్దగా మూల్గుచుండెను. పార్వతీపరమేశ్వరులు ఆ అడవిలోనికి వచ్చిరి.

"ఏమండీ ఎక్కడో మూలుగు వినబడుచున్నది. ఏమిటది?"

నిష్ఠల అప్పలనరసయ్య

"నేను యిక్కడే ఉంటాను. ఆ మూలుగు ఏమిటో నువ్వే చూచిరా!"

పార్వతి మూలుగు శబ్దము ననుసరించి బయలుదేరింది. చచ్చిపడి ఉన్న ఏనుగుకడుపులోనుండి మూలుగు వినబడుట గ్రహించెను.

"ఎవరు నాయనా నీవు? ఎందుకిలాగ మూలుగుతున్నావు?"

"నేను పరమశివుణ్ణి! శాపకారణముచే ఈ ఏనుగుకడుపులో ఉన్నాను."

"నీవు పరమశివుడివి కావు. మా ఆయన ఒక్కరే నిజమైన పరమశివుడు!"

"మీ ఆయన నిజమైన పరమశివుడు కాదు. నిజమైన పరమశివుడని నిరూపించితే నమ్ముతాను."

"భక్తుల కోర్కెలను చెల్లించే శక్తి వారికి ఉంది. ఎవరు ఏదికోరితే అది తప్పకుండా యిచ్చితీరుతారు!"

నీ భర్త నిజమైన పరమశివుడైతే పెద్దవర్షం కురిపించాలి! అప్పుడు నీభర్త నిజమైనపరమశివుడని నమ్ముతాను."

స్త్రీలకు సహజమైన అనుమానమే పార్వతికి కల్గింది. కోపావేశంతో భర్తవద్దకు వెళ్లి జరిగిన సంగతి చెప్పి పెద్దవర్షం కురిపించమని కోరింది. ఈశ్వరుడు చిరునవ్వుతో వర్షం కురిపించాడు. పార్వతి ఏనుగు మృతకళేబరంవద్దకు వెళ్లింది. వర్షపు నీటికి గట్టిపడిన ఏనుగు కళేబరం మెత్తబడి కన్నం ఏర్పడింది. ఆ కన్నములోనుండి నక్క బావగారు బయటకు వచ్చారు.

"ఎవరు నువ్వు?" అని పార్వతి ప్రశ్నించింది.

"నేను శివుణ్ణి కాను! పరమ పరమశివుణ్ణీ కాను. జిత్తులమారితనంలో పేరుపొందిన జంబుకాన్ని. నన్ను చెరనుండి విడిపించినందులకు మీ మేలు మరచిపోను. మరి నేను వెళ్ళొస్తాను" అంది నక్క!

ఈ మాయానాటకం చూచుచున్న ఈశ్వరుడు పార్వతితో,

విందు

గ్రామస్థులు కొంతమంది సాయంత్రంపూట తీరిగ్గా రచ్చబండమీద కూర్చొని లోకాభిరామాయణం చర్చించుకుంటున్నారు. దుకాణదారుడు తన స్వాతిశయం తెగ వెళ్లబోసుకుంటున్నాడు తాను ఎన్నో శుభకార్యాలు చేశాననీ, యింకా ఎన్నో చేస్తాననీ, సాక్షాత్తూ ప్రభువువారి జనానాలోకే వెళ్లిపోయాననీ-చెబుతున్నాడు.

అక్కడున్నవాళ్లలో - శ్రోత్రి కల్లా అతి బీదవాడు-ఒకడికి యీ మాటలకు చిర్రెత్తుకొచ్చి 'ఓ! యిదీ ఓ శుభకార్యమే! నేను తలుచుకుంటే, ప్రభువువారి పక్కనే కూర్చుని భోంచేస్తాను' అన్నాడు.

'ఏమిటీ అంటున్నావు? నీ జీవితంలో అసాధ్యమయిన విషయాన్ని గురించి అలక్ష్యంగా మాట్లాడుతున్నావు—' అన్నాడు దుకాణదారు.

'నా పల్సి నత్తే, నా మాట, [illegible] తోసుకుంటాను.'

'నీతరంగాడు.'

ఇట్లా వాళ్లు చాలసేపు వాదించుకున్నారు. చివరకు పేదవాడు- 'ఊరికే కొట్లాడుకుని ప్రయోజనం ఏమిటి? ఇదిగో పందెం కాస్తున్నాను, నేనే ప్రభువువారితో విందారగిస్తే, నీ రెండు గుర్రాలనీ నాకిచ్చెయ్యాలి. నేను ఓడితే నీకు మూడు సంవత్సరాలపాటు దమ్మిడీ ప్రతిఫలం ఆశించకుండా ఊడిగం చేస్తాను' అన్నాడు.

దుకాణదారుకి పంతం వచ్చింది. 'మంచిది-గుర్రాలే కాక దూడని కూడా యిచ్చేస్తాను, నువ్వే గెలిస్తే. యిక్కడున్న పెద్దమనుషులంతా సాక్ష్యం.'

అందరూ ఎవరిదారిని వాళ్లు వెళ్ళిపోయారు.

పేదవాడు ప్రభువువారిదగ్గరికి వెళ్లాడు. 'మీతో ఓ చిన్న రహస్యం మాట్లాడాలి. చూడండి, నా టోపీ అంతటి నిండు సువర్ణం విలువ ఎంత వుంటుందంటారు?'

ప్రభువువారు యేమీ మాటాడలేదు. చప్పట్లు చరిచి నౌకర్ని పిలిచారు-'అరే, యితను నా-కెంతో ప్రియులు కూడా - మా కిద్దరికీ భోజనం తయారు చెయ్యి... కూర్చోండి, కూర్చోండి బాబూ. యిదే మీ యిల్లు అనుకోండి. తృప్తిగా భోంచేయండి.'

ప్రభువువారు పేదవాడిని గౌరవనీయమైన అతిథిగా ఆదరించారు. ఆయన ఎంతో ఓర్పుగా బంగారపు ముద్దను వ్యంజనాలతో కలిపి ఆరగించుకుంటున్నారు.

'ఆ! ఇప్పుడు తొందరగా వెళ్లి సువర్ణభాండాన్ని పట్రండి. మీకు కావల్సినంత భూమీ, వెండీ కూడా యిస్తాను.'

'అక్కర్లే, నాదగ్గర సువర్ణభాండం అంటూ ఏమీ లేదండీ. ఊరికే దాని ధర విచారిద్దామని వచ్చాను'

ప్రభువువారు రౌద్రులయ్యారు. 'అవతలికి పో, ఫూల్' అన్నారు.

'మీ అంతటివారు నన్ను గౌరవనీయమైన అతిథిగా చూచినప్పుడూ, ఆ దుకాణదారుడు ఆ విందుకోసం రెండు గుర్రాలూ, దూడని పందెం ఓడినప్పుడూ - యింక నే నెట్లా 'ఫూల్' నవుతాను?' అంటూ పేదవాడు మనసులో మురిసిపోతూ వెళ్ళిపోయాడు.

['రష్యన్ జానపద సాహిత్యం' నుంచి] ★

రామానుజాచార్య

"మాయ" అంటే ఏమిటో బోధపడిందా"? అని అన్నాడు.

పార్వతీపరమేశ్వరులు భూలోక సంచారం ముగించుకొని కైలాసానికి వెళ్లారు! మనకథ కంచికి వెళ్లింది! ★

★ అంతరాంతరాలు ★

(34-వ పేజీ తరువాయి)

పారేసిందో అదే పరమాణువు ఈ క్షణంలో ఆమెకు విశ్వరూపంగా సాక్షాత్కరించేసరికి ఆ తేజస్సు ముందు నిలబడలేకపోయింది. వెనక్కి తిరిగి ఎక్కడికో వెళ్ళిపోవాలనుకుంది కాని వెంటనే లోపలినించి మృదువైన పిలుపు—

"వెళ్ళిపోతున్నావేం, శారదా?"

వెనక్కి తిరిగింది. తోటమాలి సాక్షాత్కరించాడు.

'—అశక్తురాలను, పరిత్యక్తను చలపతీ!' అని మనస్సులో అనుకుంటూ, బావురుమంది.

చలపతి చప్పునవెళ్ళి ఆమెను పట్టుకొని లోపలికి తీసుకువచ్చాడు.

"ఏం, ఏమిటయింది శారదా?" అన్నాడు ఆతృతగా.

కడుపు చేవుకుపోయేట్టు బావురుమంది మళ్ళీ.

'—నన్ను అంతా బహిష్కరించారు చలపతీ! నాకు ప్రపంచంలేదు నాకు దిక్కు లేదు. నేను పోతాను చలపతీ' అన్నట్టుందా వ్యథార్తురాలి బాధ!

చలపతి ఆమెను ఓదార్చాడు. చాలసేపటివరకు ఆమె తేరుకోలేదు. తర్వాత మెల్లగా అంతా చెప్పింది.

చలపతి అంతా విని ఒక నిట్టూర్పు విడిచి- "ఇప్పుడు రాజమండ్రి వెడతావా?" అన్నాడు.

"వెళ్ళాలి."

ఇంతలో జానకి "సరే వెళ్ళు" అనుకుంటూ వచ్చింది.

జానకిని చూడగానే శారదకు ప్రాణం లేచివచ్చింది. వణికే కంఠంతో "జా. న. కీ" అంది.

"అవును నేనే! మీ యింటిదగ్గరనుంచే వస్తున్నాను. కృష్ణ నాకంతా చెప్పారు. కాని ఆయన నీగురించి ఎంత కంగారు పడుతున్నారో గ్రహించగలిగివుంటే నువ్వీ పని చేసివుండేదానవు కాదు శారదా."

"ఎదుటి వాళ్ళకు అలానే అనిపిస్తుంది. కాని నా బాధ వాళ్ళకేం తెలుస్తుంది?"

"బాధా! ఎవరు కలిగించారు నీకా బాధని?"

"ఆయనే!"

"అని నీ ఉద్దేశం. కాని శారదా, నువ్వు యావజ్జీవితం భయంతోనే గడపదలచుకున్నావా, చెప్పు?" అని జానకి సూటిగా అడిగింది.

"భయమా? నేను దేనికీ భయపడను."

"పాపం! కాలేజీలో స్త్రీల సమస్యల గురించి అన్నిమాటలాడి బయటికొచ్చాక స్ప్రింగుపరుపుల్లో నిద్రపోవడం భయం కాక మరేమిటి?"

"అది భయమెలా అవుతుందో?"

"భయం కాకపోతే, నువ్వు హృదయపూర్వకంగా ప్రేమించానన్న ఈ చలపతిని ఎందుకు వివాహమాడలేదు?"

చలపతి ఉలిక్కిపడ్డాడు. "జానకీ" అంటూ వారించబోయాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకు, జానకీ?"

"మీకు అనవసరంగానే కనిపించవచ్చు. కాని శారద వీటితో ఆత్మవంచన చేసుకొంది..." అని శారదవేపు తిరిగి "ఏం శారదా, ఏమిటి నీ సమాధానం?"

శారద కొంత కోపంగానే, "ఇహ ఆ మాటలు ఆపడం మంచిది" అంది.

జానకి చిన్నగా నవ్వి "ఆత్మవిమర్శ దగ్గరికి వచ్చేటప్పటికి నిజాన్ని కూడా భరించలేకపోతున్నావ్ చూశావా? .... చలపతి గొప్ప రచయితే కావచ్చు; మేధావే కావచ్చు. కాని ఆయన కటికదరిద్రుడు. నీకు కావలసింది సౌఖ్యం. అది డబ్బుతో వస్తుందని భ్రమించావు."

శారద పూర్తిగా కోపిష్టి అయిపోయి "నువ్వు చాలా మాటాడావ్! ఇహ ఆపడం మంచిది జానకి" అంది.

అంతలోనే కృష్ణ లోపలికి వచ్చాడు. వస్తూనే, భార్యవేపు చూస్తూ; "ఏం, ఆమె చెప్పింది నిజంకాదా?" అన్నాడు.

అగ్గిమీద గుగ్గిలం పడ్డంత పనైంది. ఆ ఆవేశంలో శారద ఏదో అంది కాని అది అస్పష్టంగా ఎవరికీ వినిపించలేదు. వెంటనే కృష్ణ "సరే, ఇప్పుడేం చెయ్యదలచుకున్నావ్?" అన్నాడు.

"నాకు చదువుంది; నేను స్వేచ్ఛగా జీవించగలను" అంది శారద.

కృష్ణ అదోలా నవ్వాడు. మధ్యలో జానకి కలిగించుకుని — "పౌరుషంతో ప్రకోపించిన ఈ స్వేచ్ఛాభావం, చివరికి నిన్నే ఓడిస్తుంది శారదా. నీకు ఓర్పు, వినయాలని అర్థం చేసుకోవాలనే వాంఛా రెండూ ముఖ్యం. అందుకే సౌఖ్యమనేది భౌతిక మనుకున్నావ్!" అంది.

"నిర్వచనాలతో శారదలాంటివారు మారలేరు జానకీ! జీవితాన్ని అనుభవాలు నాలుగువేపులనించీ పట్టి పూగించినపుడు వాళ్ళ మటుకి వాళ్ళే జీవితసత్యాలని తెలుసుకోగలుగుతారు" అన్నాడు కృష్ణ.

శారదలోని అహం, అభిమానం తిరగబడ్డాయి. "ఆ స్థితిలో మీ దగ్గరకు రాను లెండి" అంది.

"అనుకుంటున్నావ్!"

"నిజమని రుజూ చేస్తాను" అని గిర్రున తిరిగి వెళ్ళిపోయింది, వెనకనించి జానకీ చలపతి ఎంత పిలుస్తున్నా వినిపించుకోకుండా. జానకి చప్పున వెళ్ళబోయింది కాని కృష్ణ ఆపేశాడు.

"మీరు యిక్కడికొచ్చి మరింత రెచ్చగొట్టారు" అంది జానకి.

కృష్ణ చలించకుండా అన్నాడు:

"మాటలతో విరిగిపోయేవాళ్ళు అసలైన పిరికివాళ్ళు. పిరికివాళ్ళు ఏ పనీ నిర్విఘ్నంగా కొనసాగించలేరు, మనం వెనకనించి సానుభూతి చూపించేంతకాలం. అందుకే నేను మనస్సు రాయిచేసుకొని శారదను ప్రపంచంలోకి పంపించాను జానకీ! ఆడంబరమే జీవితసౌఖ్యం, లక్ష్యం కాదని ఆ ప్రపంచమే నేర్పిస్తుంది. ఆ స్థితిలో నాదగ్గరకు రానంది. అంటే ఆత్మహత్య చేసుకుంటాననే బెదిరింపు అందులో ధ్వనిస్తోంది. అది కేవలం బెదిరింపేకాని శారద అంతపనీ చేయలేదు! అంత ధైర్యం తనకి లేదు. అందువల్ల తప్పక తిరిగివస్తుంది."

కృష్ణకి యింత ధీమా ఎలా కలిగిందో చలపతికి, జానకికీ అర్థంకాలేదు.

కృష్ణ జేబులోనించి రుమాలు తీసుకొని ముఖం తుడుచుకొంటూ, "వెళ్ళొస్తానోయ్ చలపతీ...వస్తా జానకీ—" అని మెల్లగా వెళ్ళిపోతూ వుంటే, దంపతులిద్దరూ ఒకరిముఖా లొకరు చూసుకున్నారు ఆశ్చర్యంగా.



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



సాలంకుంచి

—చిత్రకారుడు: సి.హెచ్. నరసింహాచార్యులు, విజయనగరం

Regd. No. M. 4479. Andhra Patrika Illustrated Weekly

సొగసులొలికేవంటి చర్మ సౌందర్యము మీకున్నూ గలుగును!

దినదినమున్నూ అతి మనోహరముగా నుండుడు...

అవును, కాంతివంతమైన సొగసగు చర్మ సౌందర్యమును బొందగోరు మీ కల నిజము కాగలదు కూడ: మీరు స్నానముచేయునప్పుడున్నూ చేతులు ముఖము కడుగుకొనునప్పుడున్నూ ప్రతిమాటూ, రెక్సోనాను ఉపయోగించుడు — ఎల్లప్పుడూ దానియొక్క కేడిల్‌తోగూడిన నురగను మీ చర్మముమీద మెల్లగా రుద్దుడు. తరువాత కడిగివేయుడు. దినదినమున్నూ మీ చర్మ సౌందర్యము ఇంకా క్రొత్త, మరీ మృదువైన, మనోహరత్వమును బొందును.

"మిస్ రెక్సోనా."
1955, రెక్సోనా సౌందర్య పోటీలో మనోహరమైన గెలుపుదారు.



...సహజంగా **రెక్సోనాతో**

ఇది ఒక్కటే కేడిల్ తోగూడిన సబ్బు

పెద్ద సైజులోకూడ దొరకును

RP. 139X52 TL